www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 6-7-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 120 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి రా.9:15 తదుపరి ద్వాదశి, నక్షత్రం: విశాఖ రా.10:42 తదుపరి అనూరాధ, వర్జ్యం: తె. 3:07-4:53, దుర్ముహూర్తం: సా.5:06-5:58, అమృతఘడియలు: మ.12:51-2:38, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 5:49, సూర్యాస్తమయం: 6:50 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



దేశ రక్షణ మరింత బలోపేతం

సిద్ధమవుతున్న 12 హైపర్‌సోనిక్ మిసైళ్లు.. అభివృద్ధి చేస్తున్న డీఆర్‌డీవో

ఇప్పటికే విజయవంతంగా పరీక్షలు

2030 కల్లా మోహరించేలా చర్యలు

దాడి చేసే మిసైళ్లతో పాటు రక్షణ వ్యవస్థ కూడా..

స్క్రామ్‌జెట్ ఇంజిన్‌తో అగ్రదేశాల సరసన

వేగంగా రూపొందుతున్న ఆయుధాలు

14



నాసిరకం హెల్మెట్లపై కేంద్రం సీరియస్

అలాంటి హెల్మెట్ల తయారీ సంస్థలు, అమ్మకందారులపై కఠిన చర్యలు

అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశం

బీఐఎస్ ధ్రువీకరణ హెల్మెట్లనే వాడాలని వాహనదారులకు సూచన

సూర్యా భాయ్ దందా!



మంత్రి నివాసమే ఆయన అడ్డా

'సూర్యా భాయ్.. ఇది పేరు కాదు బ్రాండ్' అంటూ ఓ సినిమాలో కథా నాయకుడు ముంబై కేంద్రంగా సెటిల్మెంట్లు చేస్తుంటాడు. ఇప్పుడు ఏపీలోనూ ఒక 'సూర్యా భాయ్' తయారయ్యాడు. ఒక కీలక శాఖకు చెందిన మంత్రి వద్ద ఆశ్రయం పొంది... హై ప్రొఫైల్ లాబీయిస్ట్‌గా అవతరించాడు. ఆ శాఖకు సంబంధించిన 'బేరసారాల'నూ నడుపుతున్నాడు. నిజానికి... ఆయన అసలు పేరు వేరే ఉంది. కానీ... 'సూర్యా భాయ్' అంటేనే అందరికీ తెలుస్తుంది.

కీలక శాఖలో సెటిల్మెంట్లు, దందాలు.. పోస్టింగ్‌లపై బేరసారాలు, వసూళ్లు

రూ.50 కోట్లతో డెస్క్‌టాప్‌లకు 'టెండర్'.. నచ్చిన కంపెనీకి దక్కేలా పావులు


సంబంధిత అధికారికి 'పోస్టింగ్' ఆఫర్.. ఈ వ్యవహారంపై ఇప్పటికే 'నిఘా' నివేదిక

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గోదావరి జిల్లాలకు చెందిన సూర్యాభాయ్ అక్కడ పెద్ద రింగ్ మాస్టర్. గతంలో ఒక సీనియర్ నేత అనుచరుడిగా ఉండేవాడు. తూర్పు గోదావరి జిల్లాలో పలు ఇసుక ర్యాంపులు తన నియంత్రణలోనే పెట్టుకున్నాడు. ఇసుక అక్రమ రవాణాలో రింగ్ మాస్టర్‌గా వ్యవహరిస్తూ... లారీలను అడ్డుకుంటే మిమ్మల్ని తొక్కించేస్తా అంటూ స్థానికుల్ని బెదిరించిన చరిత్ర అతనిది! అలాంటి వ్యక్తికి ప్రస్తుత ప్రభుత్వంలోని ఒక కీలక మంత్రి ఆశ్రయమిచ్చారు. అతను తన పరిధిని గోదావరి జిల్లాలను దాటి అమరావతికి విస్తరించుకున్నాడు. ఎక్కువ సమయం మంత్రి ఇంట్లోనే ఉంటూ అమాత్యుడి ఆదాయం కోసమే పనిచేస్తుంటాడనే పేరుంది. ఆ శాఖకు సంబంధించిన బదిలీలు, సెటిల్మెంట్లను అతనే చూసుకుంటున్నాడు. ఇప్పుడు రూ.50 కోట్ల కొనుగోళ్ల ప్రాజెక్టు తాను చెప్పిన వాళ్లకే దక్కేలా చేసేందుకు సూర్యా భాయ్ రంగంలోకి దిగాడు. 'ఈ డీల్ చేస్తే మనకు మంచి లాభం వస్తుంది' అని మంత్రిని ఒప్పించాడు. అదే సమయంలో ఆ శాఖలోని కీలక అధికారికి కూడా 'ఆఫర్' ఇచ్చాడు. "ఆ కొనుగోలు

మిగతా 11వ పేజీలో...

విద్యుత్ కాంతుల మధ్య తుంగభద్ర క్రస్ట్‌గేట్లు దాటి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ




కృష్ణమ్మ పరవళ్లు

తుంగభద్ర నుంచి దిగువకు భారీగా నీటి ప్రవాహం

శ్రీశైలం డ్యాంకు పోటెత్తుతున్న వరద

12



తెలంగాణ బీఆర్ఎస్ జాగీరా?

థంబ్ నెయిల్ విషయంలో ఒక న్యూస్ చానల్ చేసిన పొరపాటును ఆసరాగా చేసుకొని ఆ చానల్‌పై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారు. తమ చర్యలను సమర్థించుకొనే క్రమంలో 'ఆంధ్రా మీడియా సంస్థలు' అనే పాతబడిపోయిన వాదనను మళ్లీ తెర మీదకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

రాజశేఖర రెడ్డి హయాంలో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంపై దాడి చేసి తగులబెట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాత కేసీఆర్ పాలనలోనూ 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై దాడులు జరిగాయి. వివిధ రూపాల్లో నిర్బంధాలు ఎదురయ్యాయి. వాటన్నింటినీ తట్టుకొని నిలబడ్డాం. భవిష్యత్తులో కూడా నిలడతాం.

దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చిన వాళ్లు మెరుగైన అవకాశాలు ఉంటాయనే వచ్చారు. ఆంధ్రా వాళ్లు కూడా ఇలాగే వచ్చి ఉంటారు. తెలంగాణకు వలస వచ్చిన వాళ్లు కష్టపడి సంపాదించుకొని తమ తిండి తాము తింటున్నారు. జగదీశ్ రెడ్డి వంటి వారు వారికి వంటా వార్పూ చేసి పెట్టడం లేదు కదా?

2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబును ఓడించడానికి కేసీఆర్ తన వంతు సహాయ సహకారాలను జగన్మోహన్ రెడ్డికి అందించారు. జగన్‌కు ఆర్థిక సహాయం చేయడంతో పాటు చంద్రబాబుకు హైదరాబాద్ నుంచి నిధులు అందకుండా కట్టడి చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం - బీజేపీ - జనసేన కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. తెలంగాణలో కూడా ఈ కూటమి ప్రయోగం జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ కారణంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ అండ్ కో ప్రయత్నాలు మొదలుపెట్టారు.

ప్రత్యర్థులను వేధించడమే అధికారం పరమావధి అన్నట్టుగా తెలుగునాట రాజకీయాలను మార్చిన ఘనత కేసీఆర్, జగన్ రెడ్డిలదే.

బలమైన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎన్నికల్లో గెలిచిపోవచ్చునని కేటీఆర్ పిచ్చి భ్రమలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్ రెడ్డికి బలమైన సోషల్ మీడియా సైన్యం ఉండి కూడా గత ఎన్నికల్లో ఓటమిని తప్పించుకోలేక పోయారన్న వాస్తవాన్ని విస్మరిస్తే ఎలా?

కొత్త పలుకు -ఆర్కే, విశ్లేషణ 4లో..



'క్వాంటమ్ వ్యాలీ..' ఈమధ్య కాలంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నోటి వెంట ఎక్కువగా వినిపిస్తున్న పేరిది..! ఏపీలో వచ్చే ఏడాది జనవరి 1న క్వాంటమ్ వ్యాలీని ప్రారంభిస్తామని ఆయన ఇటీవల ప్రకటించారు. భవిష్యత్ అవసరం కోసం ఏర్పాటు చేస్తున్న ఈ 'క్వాంటమ్ వ్యాలీ' సరికొత్త సాంకేతిక విప్లవానికి నాంది పలకనుందని చెప్పారు. ఇంతకీ ఈ క్వాంటమ్ టెక్నాలజీ అంటే ఏమిటి..? దేశ, రాష్ట్రాభివృద్ధికి ఇది ఎలా ఉపయోగపడనుంది...?

'క్వాంటమ్'తో నవశకం!

క్వాంటమ్ వ్యాలీతో సరికొత్త విప్లవానికి నాంది

క్వాంటమ్ పరిశ్రమను శాసించే దిశగా ఏపీ

వైద్య, సాంకేతిక రంగాల్లో చరిత్రాత్మక మార్పులు

ఈ టెక్నాలజీతో మారనున్న దేశ ముఖచిత్రం



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

భారత్‌లో ఇప్పుడు ఎక్కడ చూసినా క్వాంటమ్ కంప్యూటింగ్ పేరు మార్మోగిపోతోంది. భవిష్యత్తులో క్వాంటమ్ పరిశ్రమను భారత్ శాసించబోతుందా.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీతో దేశ, రాష్ట్ర ముఖచిత్రమే మారనుందా..? అనే ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. దేశంలోనే మొట్టమొదటి క్వాంటమ్ వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గేమ్ చేంజర్‌గా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ క్వాంటమ్ వ్యాలీ అందుబాటులోకి వస్తే టెక్నాలజీ రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు

మిగతా 13వ పేజీలో...

జాతీయ క్వాంటమ్ మిషన్ లక్ష్యాలు

క్వాంటమ్ టెక్నాలజీలో పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందే జాతీయ క్వాంటమ్ మిషన్ (ఎన్‌క్యూఎం). 2023 నుంచి 2031 వరకూ కొనసాగే ఈ మిషన్ కోసం కేంద్రం మొత్తం రూ.6వేల కోట్లకుపైగా ఖర్చు చేయనుంది. ఈ మిషన్‌లో భాగంగానే ఏపీలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయనున్నారు. ఈ మిషన్ లక్ష్యాలు ఏమిటంటే..

- క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్, క్వాంటమ్ సెన్సింగ్, మెట్రాలజీ, క్వాంటమ్ మెటీరియల్స్ రంగాల్లో పరిశోధన, అభివృద్ధిని వేగవంతం చేయడం.
- క్వాంటమ్ టెక్నాలజీలో స్వయం సమృద్ధిని సాధించడం.
- క్వాంటమ్ టెక్నాలజీ రంగంలో అంతర్జాతీయంగా భారత్‌ను అగ్రగామిగా నిలబెట్టడం.

అమరావతికి మరో 20,494 ఎకరాలు



సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో మ్యాప్‌లు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, అధికారులు

భూసమీకరణకు ప్రభుత్వం నిర్ణయం

4 అంతర్జాతీయ కన్వెన్షన్ కేంద్రాలు

హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్‌కు ఆమోదం

ప్రభుత్వ ఆఫీసులు, ప్రైవేటు సంస్థలకు భూమి

రాజధాని పనులకు కృష్ణా నుంచి ఇసుక

అల్లూరి, అమరజీవి స్మారక చిహ్నాలు 11

చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో 7 అంశాలకు ఆమోదం

రుషికొండపై నాన్చుడే!

ప్యాలెస్ వినియోగంపై సర్కారు తర్జనభర్జన

రూ. 452 కోట్లతో భవనాలు కట్టిన జగన్

అవి ఎటూకాకుండా ఉండడంతో సమస్య

ఎంబసీలకు ఇవ్వాలని, కన్వెన్షన్‌గా వాడాలని, గెస్ట్‌హౌస్‌లుగా ఉపయోగించాలని సూచనలు

అన్నింటినీ పరిశీలిస్తున్నామన్న ప్రభుత్వం

కానీ, ఏడాదైనా ముందుకు పడని అడుగు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖలో రుషికొండపై సముద్రానికి అభిముఖంగా గత ముఖ్యమంత్రి జగన్ నిర్మించిన ప్యాలెస్‌ను ఏం చేయాలనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేకపోతోంది. పర్యాటక శాఖకు చెందిన హరిత రిసార్ట్స్‌ను కూలగొట్టి

మిగతా 12వ పేజీలో...

అలా కుదరదు

రెవెన్యూకు ఆర్థికశాఖ షాక్!

జగన్ హయాంలో అడ్డగోలుగా సృష్టించిన 300 డీటీ పోస్టులను ఆమోదించబోం

రెగ్యులరైజ్ చేయాలన్న ప్రతిపాదనకు నో

అవి తాత్కాలిక పోస్టులు, వాటికి హేతుబద్ధత లేదన్న ఆర్థికశాఖ 10

శాశ్వత సిబ్బంది సంఖ్యలో కలపొద్దని స్పష్టీకరణ

న్యాయసలహా పొందాలని దిశానిర్దేశం



సింహాచలంలో అప్పన్న తొలిపావంచా వద్ద కూలిపోయిన షెడ్

'గిరి ప్రదక్షిణ' ఏర్పాట్లలో అపశ్రుతి

3

సింహాచలంలో నిర్మాణంలోనే కూలిన షెడ్

భక్తులు లేకపోవడంతో తప్పిన ముప్పు


సింహాచలంలో అప్పన్న తొలిపావంచా వద్ద కూలిపోయిన షెడ్

'గిరి ప్రదక్షిణ' ఏర్పాట్లలో అపశ్రుతి

» సింహాచలంలో నిర్మాణంలోనే కూలిన షెడ్

» భక్తులు లేకపోవడంతో తప్పిన ముప్పు

సింహాచలం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవ వేళ రెండు నెలల క్రితం గోడ కూలి ఏడుగురు భక్తులు మృత్యువాత పడిన దుర్ఘటనను మరువకముందే శనివారం గిరి ప్రదక్షిణ ఉత్సవ ఏర్పాట్లలో అపశ్రుతి చోటుచేసుకుంది. ఈ నెల 9, 10 తేదీల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొనే సింహగిరి ప్రదక్షిణ ఉత్సవ నిర్వాహణకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా కొండ దిగువన భక్తులు కొబ్బరికాయలు కొట్టి గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టే తొలిపావంచా ప్రాంతంలో దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు సుమారు రూ.6 లక్షల వ్యయంతో (జీఏ రేకులతో), కాంట్రాక్టర్ ద్వారా షెడ్ నిర్మాణం చేపట్టారు. శనివారం అక్కడ పనులు చేస్తున్న సమయంలో షెడ్‌ను జేసీబీ తగలడంతో కొంతభాగం ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు బయటకు పరుగులు తీసి ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రాథమిక సమాచారం ప్రకారం షెడ్ నిర్మాణంలో వినియోగించిన పైపులు నిర్దిష్ట ప్రమాణంలో లేవని, జాయింట్ల వద్ద వేసే బోల్టులు కూడా తగిన సైజులు వాడలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటనా స్థలికి చేరుకున్న సింహాచల దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వి.త్రినాథరావు మీడియాతో మాట్లాడుతూ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

128 గ్రా. బంగారాన్ని మర్చిపోయిన భక్తులు

» అప్పగించిన టీటీడీ రిసెప్షన్ అధికారులు

తిరుమల, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనం కోసం వచ్చి గదిలో మర్చిపోయిన 128 గ్రాముల బంగారు ఆభరణాలను టీటీడీ రిసెప్షన్ అధికారులు తిరిగి భక్తులకు అప్పగించారు. తమిళనాడు ప్రాంతం మదురై పట్టణానికి చెందిన శివానందన్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమలకు వచ్చారు. కాస్తే వకుళమాత గెస్ట్‌హౌస్‌లో 5వ నంబరు గదిని అద్దెకు తీసుకున్నారు. శ్రీవారి దర్శనం ముగించుకుని శనివారం తిరుగు ప్రయాణ హడావుడిలో 128 గ్రాముల బంగారు ఆభరణాలను గదిలోనే మర్చిపోయారు. గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన తుకారాం సోమ మందాకర్, వెంకటమణి వాటిని గుర్తించి టీటీడీ రిసెప్షన్ అధికారులకు అందజేశారు. ఆభరణాలు మర్చిపోయామని తిరిగి వచ్చిన భక్తుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం పద్మావతి విచారణ కార్యాలయం సూపరింటెండెంట్ కుమారస్వామి, భాస్కరనాయుడు ఆ ఆభరణాలను తిరిగి శివానందన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.12 లక్షల విలువైన బంగారు అభరణాలు తిరిగి అప్పగించిన అధికారులకు, సిబ్బందికి శివానందన్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే నిజాయితీగా బంగారు ఆభరణాలను అప్పగించిన గెస్ట్‌హౌస్ సిబ్బందిని అధికారులు అభినందించారు.

టీటీడీలో 'రిటైర్మెంట్' కలవరం!

» గోవిందరాజస్వామి ఆలయం ప్రధాన అర్చకుడి రిటైర్మెంట్ ప్రొసీడింగ్స్ సస్పెండ్ చేసిన హైకోర్టు

» ఇతర అర్చకులూ కోర్టును ఆశ్రయించే అవకాశం



తిరుపతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గోవిందరాజస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితుల రిటైర్మెంట్‌కు సంబంధించి టీటీడీ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు సింగిల్ జడ్జి సస్పెండ్ చేశారు. దీంతో 65 ఏళ్ల వయసు దాటినప్పటికీ ఆయన మునుపటిలాగే ప్రధాన అర్చకుడిగా కొనసాగనున్నారు. ఈ నిర్ణయంతో గతంలో టీటీడీ ఆలయాల్లో రిటైరైన ప్రధాన అర్చకులు, సాధారణ అర్చకులు సైతం తమకూ ఆ ఉత్తర్వులను వర్తింపజేయాలని కోరుతూ కోర్టును ఆశ్రయించడానికి అవకాశం ఏర్పడింది. వివరాలు.. టీటీడీ నిర్వహణలో ఉన్న తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో పాత మిరాశీ కుటుంబానికి చెందిన ఏపీ శ్రీనివాస దీక్షితులు ప్రధాన అర్చకులుగా పనిచేస్తున్నారు. టీటీడీ సర్వీసు నిబంధనల ప్రకారం 65 ఏళ్లు దాటిన ప్రధాన అర్చకులు, సాధారణ అర్చకులు సహా ధార్మిక విధులు నిర్వర్తించే ఉద్యోగులందరూ రిటైర్ కావాలి. ఈ క్రమంలో శ్రీనివాస దీక్షితులు ఈ ఏడాది మే 31న రిటైర్ కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో అదే నెల 29న ఆయన రిటైర్మెంట్‌కు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను టీటీడీ జారీ చేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం సర్వీసు నుంచి రిటైరైన ప్రధాన అర్చకులు, సాధారణ అర్చకులు శారీరక పటుత్వం ఉన్నంత కాలం సంభావన అర్చకులుగా టీటీడీ ఆలయాల్లో పనిచేసే అవకాశముంది. ఆ నిబంధనను అనుసరించి శ్రీనివాస దీక్షితులను జూన్ 1 నుంచి సంభావన అర్చకుడుగా కొనసాగేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే టీటీడీ జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ శ్రీనివాస దీక్షితులు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ ఎన్.సుబ్బారెడ్డి టీటీడీ జారీ చేసిన రిటైర్మెంట్ ప్రొసీడింగ్స్‌ను సస్పెండ్ చేస్తూ గత నెల 25న ఉత్తర్వులిచ్చారు. శ్రీనివాస దీక్షితుల రిట్ పిటిషన్‌ను గతంలో టీటీడీ దాఖలు చేసి ధర్మాసనం ఎదుట పెండింగ్‌లో ఉన్న రిట్ అప్పీలుతో జత చేయాలని ఆదేశించారు. మిరాశీ వ్యవస్థ రద్దును ఆమోదిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ గతంలో హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల కారణంగా 65 ఏళ్లు దాటినప్పటికీ ప్రధాన అర్చకులు, అర్చకులు విధులు నిర్వర్తించగలిగే స్థితిలో ఉంటే సంభావన అర్చకులుగా కొనసాగేందుకు అవకాశం ఏర్పడింది. అయితే ఈ విషయంలో హైకోర్టు ఇంకా తుది తీర్పు ఇవ్వలేదు. దీనిపై అస్పష్టతతో సాంకేతికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న టీటీడీకి తాజాగా సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు మరింత ఇబ్బందికరంగా మారాయి.

వైద్య విజ్ఞానాన్ని పంచుకోవటం ఆనందంగా ఉంది



ఏపీ న్యూరోకాన్ సదస్సులో మంత్రి నారాయణ

నెల్లూరు (వైద్యం) జూలై 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన న్యూరాలజీ వైద్య నిపుణులు పాల్గొన్న సదస్సులో వైద్య విజ్ఞానాన్ని పంచుకోవటం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం నెల్లూరు నగరంలోని నారాయణ వైద్య కళాశాలలో 32వ ఏపీ న్యూరోకాన్ సదస్సు రెండవ రోజు శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణ మాట్లాడుతూ.. ఈ వైజ్ఞానిక సదస్సు వల్ల రోగులకు మెరుగైన వైద్యచికిత్సలు అందించే వీలుంటుందని తెలిపారు. ఇలాంటి మేధో సదస్సులు నారాయణ వైద్య కళాశాలలో నిర్వహించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పొంగూరు శరణి మాట్లాడుతూ న్యూరాలజీలో వస్తున్న అత్యాధునిక వైద్య విధానాలు, పరికరాల గురించి తెలుసుకోవటం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు. సుమారు 700 మందికి పైగా వైద్యులు, 70 మందికి పైగా వక్తలు ఇందులో ప్రసంగిస్తారని తెలిపారు. ఏపీ న్యూరోకాన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, నారాయణ ఆసుపత్రి న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ దక్షిణ భారతదేశం నుంచే కాకుండా ఉత్తరాది నుంచి కూడా అనేక మంది వైద్యులు వచ్చారని తెలిపారు. మూర్ఛ, స్ట్రోక్, బ్యాక్ పెయిన్, పార్కిన్సన్ తదితర వ్యాధులకు సంబంధించి వినూత్న వైద్య విధానాలను ఈ సదస్సులో వైద్య నిపుణులు వివరిస్తారని చెప్పారు. అనంతరం ఏపీ న్యూరోకాన్ సావనీర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ న్యూరో సైన్సెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏవీ రమణమూర్తి, నెల్లూరు న్యూరోక్లబ్ అధ్యక్షుడు పీఎస్ రెడ్డి, నారాయణ వైద్య విద్యా సంస్థల కో ఆర్డినేటర్ డాక్టర్ బిజు రవీంద్రన్, నారాయణ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, నారాయణ ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి: ఆప్కాబ్ చైర్మన్

మచిలీపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థ ద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని ఆప్కాబ్ చెర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (కేడీసీసీబీ)లో శనివారం అంతర్జాతీయ సహకార సంవత్సరం-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ సహకార రంగంపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకుని, స్థిరమైన, సమగ్రతతో కూడిన వ్యవస్థను రూపొందించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు పంట రుణాలు మంజూరు చేయడంలో వాణిజ్య బ్యాంకులతో పోల్చుకుంటే సహకార సంఘాలు నాల్గో స్థానంలో ఉన్నాయన్నారు.

16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

» 15, 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో 16వ తేదీన ఆణివార ఆస్థానం జరగనున్న నేపథ్యంలో 15వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ రెండు ఉత్సవాల నేపథ్యంలో స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. 14, 15 తేదీల్లో సిఫారసు లేఖలను తీసుకోబోమని స్పష్టం చేసింది. ఆణివారం ఆస్థానం రోజున ఆలయంలోని బంగారు వాకిలిలో సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులను కొలువుదీరుస్తారు. అలాగే మరోపీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడైన విష్వక్సేనులస్వామి దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. పెద్దజీయర్ స్వామి వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా తీసుకొచ్చి మూలవిరాట్టుకు, మలయప్పస్వామికి, విష్వక్సేనులవారికి అలంకరిస్తారు. తర్వాత శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో 'పరివట్టం' (చిన్నపట్టుగుడ్డ) కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామిని ఆశీర్వదిస్తారు. తర్వాత అర్చకులు పెద్ద, చిన్నజీయర్ స్వాములకు, టీటీడీ తరుపున ఈవోకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి ఇచ్చి, 'రూపాయి' హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేస్తారు. అనంతరం ఈ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల వద్ద ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగుస్తుంది.

శ్రీవారి సేవలో చాముండేశ్వరీనాథ్



తిరుమల శ్రీవారిని శనివారం ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరీనాథ్, నటి సోనియా సింగ్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

నెల్లూరులో నేటి నుంచి రొట్టెల పండుగ

» ఐదు రోజులపాటు నిర్వహణ


విద్యుద్దీపాల వెలుగుల్లో బారాషహీద్ దర్గా

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 5 (ఆంధ్రజ్యోతి): మతసామర్యానికి ప్రతీకగా ఏటా మొహర్రం నెలలో నెల్లూరులో జరిగే రొట్టెల పండుగ ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. ఐదురోజులపాటు జరిగే ఈ పండుగ కోసం నెల్లూరు జిల్లా అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. తొలిరోజు రాత్రి సందల్‌మాల్, సోమవారం అర్ధరాత్రి బారాషహీద్‌ల గంధ మహోత్సవం జరుగుతుంది. మంగళవారం ఉదయం నుంచి రొట్టెల పండుగ ప్రారంభం అవుతుంది. ఆ తర్వాత బుధవారం తహలీఫాతేహా, గురువారం రాత్రి పండుగ ముగింపు కార్యక్రమం జరుగుతుంది. బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని స్వర్ణాల చెరువులో భక్తులు పుణ్యస్నానాలు చేసి, వరాల రొట్టెలను మార్చుకుంటారు. ఆ తర్వాత దర్గాను దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు. ఈ వేడుక కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు మంజూరు చేసింది. దాదాపు పది లక్షల మందికిపైగా భక్తులు వస్తారన్న అంచనాతో కలెక్టర్ ఓ.ఆనంద్ పర్యవేక్షణలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ కలిసి శనివారం దర్గా పరిసర ప్రాంతాలను పరిశీలించి.. ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సెప్టెంబరు వరకు హెచ్‌డీ పొగాకు కొనుగోలు

» సీఎం యాప్‌లో నమోదు చేసుకున్న రైతులే అమ్మకానికి అర్హులు: మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి ఎండీ

అమరావతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 2024 రబీ సీజన్‌లో పండిన హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియ సెప్టెంబరు నెలాఖరు వరకు కొనసాగుతుందని మార్క్‌ఫెడ్ ఇన్‌చార్జి ఎండీ డిల్లీరావు తెలిపారు. ఇందుకోసం రైతులు సీఎం యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న రైతులు మాత్రమే పొగాకు అమ్ముకోవటానికి అర్హులని చెప్పారు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని 11 కేంద్రాల్లో బర్లీ పొగాకు కొనుగోలు జరుగుతోందని, ఇప్పటి వరకు 724 మంది రైతుల నుంచి రూ.17.20 కోట్ల విలువైన 2,088 టన్నుల పరిమాణం కల ,2245 బేళ్లు కొనుగోలు చేసినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉగ్ర చెరలో పల్నాడు జిల్లా వాసి

» మాలిలో కిడ్నాప్ చేసిన టెర్రరిస్టులు

» ప్రభుత్వమే రక్షించాలంటూ కుటుంబ సభ్యుల వేడుకోలు


అమరలింగేశ్వరరావు

మాచర్ల రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం పరాయి దేశం వెళ్లిన పల్నాడు జిల్లా వాసిని ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఉగ్ర చెర నుంచి అతడిని విడిపించి స్వదేశం రప్పించాలని కూటమి ప్రభుత్వాన్ని వారు వేడుకుంటున్నారు. కూరాకుల వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మి దంపతులు మాచర్ల మండలంలోని జమ్మలమడక గ్రామ వాసులు. వ్యవసాయమే జీవనాధారమైన వారికి కుమారుడు అమరలింగేశ్వరరావుతో పాటు మరో ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడికి సుమారు 20 యేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడకు చెందిన వెంకటరమణతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. అమరలింగేశ్వరరావు పదేళ్ల క్రితం మాలి దేశానికి ఉపాధి కోసం వెళ్లాడు. అక్కడ డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో మెకానికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. జూలై 1న అమరలింగేశ్వరరావు పనిచేస్తున్న ఫ్యాక్టరీలోకి ఉగ్రవాదులు చొరబడ్డారు. మేనేజర్‌ను కిడ్నాప్ చేశారు. పని ముగించుకొని వెళ్లిపోతున్న వారికి అమరలింగేశ్వరరావు కనిపించారు. దీంతో టెర్రరిస్టులు ఆయన్ను కూడా తమతో తీసుకెళ్లారు. సమాచారం అతని కుటుంబ సభ్యులకు శుక్రవారం మధ్యాహ్నం చేరింది. దీంతో వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. అమరలింగేశ్వరరావును తిరిగి దేశానికి రప్పించాలని కుటుంబ సభ్యులు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

అమెరికాలో 'తూర్పు' యువకుడి మృతి


కిరణ్ గౌడ్

చాగల్లు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం చిక్కాల గ్రామానికి చెందిన శనగన హరి కిరణ్ గౌడ్ (25) అమెరికాలోని ఓ జలపాతంలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. ఈ విషయాన్ని ఆయన కుటుంబసభ్యులు శనివారం వెల్లడించారు. హరి కిరణ్ యూనివర్శిటీ ఆఫ్ సెంట్రల్ మిస్సోరి వారి వీసాపై అమెరికాలో ఎంఎస్ చదువుతూ, పార్ట్‌టైమ్ జాబ్ చేస్తున్నాడు. మిత్రులతో కలిసి జలపాతానికి స్నానానికి వెళ్లి అందులో కొట్టుకుపోయాడు. మృతుని తండ్రి రామకృష్ణ గౌడ్ పీఎంపీ వైద్యుడిగా సేవలందిస్తున్నారు. హరికిరణ్ మరణ వార్తతో గ్రామంలో విషాదం నెలకొంది.

మావోయిస్టు పార్టీ సభ్యుడు లొంగుబాటు

ఎటపాక, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యుడు మడకం హిడ్మా పోలీసులు ఎదుట లొంగిపోయినట్టు ఓఎస్డీ జగదీష్ అడహళ్లి తెలిపారు. శనివారం అల్లూరి జిల్లా ఎటపాక పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా చింతల్నార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జబ్బగట్ట గ్రామానికి చెందిన మడకం హిడ్మా 15 ఏళ్ల వయస్సులో 2022 ఏప్రిల్ నెలలో మనీలా డివిజన్ కమిటీ మెంబర్, జెగురుగొండ ఏరియా కమిటీలో దళ సభ్యుడిగా చేరాడు. 2023 మార్చిలో చత్తీస్‌గడ్ సుక్మా జిల్లాలోని జెగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో కందేర్ ఆటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు భద్రతా సిబ్బంది మృతి చెందిన ఘటనలో హిడ్మా పాల్గొన్నాడన్నారు. అతనిపై రూ.లక్ష రివార్డు ఉందని చెప్పారు.

'ఉచితం' సక్సెస్ కావాలంటే...

» 3 వేల బస్సులు, 10 వేల మంది సిబ్బంది కావాలి

» గుంటూరు ధర్నాలో ఈయూ నేత దామోదరరావు


గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న ఈయూ నాయకులు

గుంటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం విజయవంతం కావాలంటే రాష్ట్రంలో కొత్తగా 3 వేల బస్సులను కొనుగోలు చేయాలి. 10 వేల మంది సిబ్బంది నియామకం చేపట్టాలి' అని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు అన్నారు. గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో జరిగిన నిరసనకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఉచిత ప్రయాణంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెద్ద ఎత్తున పెరగనుంది. ప్రస్తుతం రోజుకు 40 లక్షల నుంచి 45 లక్షల మంది ప్రయాణికులు ఆర్టీసీలో రాకపోకలు సాగిస్తున్నారు. ఉచిత ప్రయాణం తరువాత ప్రయాణికుల సంఖ్య 80 లక్షలకు పైనే పెరిగే అవకాశం ఉందని ఇప్పటికే ఆర్టీసీ నివేదిక అందజేసింది. ప్రస్తుతమున్న 11 వేల బస్సులకు 45 వేల మంది ఉద్యోగులున్నారు. పెరగనున్న ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల కొనుగోలుతో పాటు సిబ్బంది నియామకాలూ చేపట్టాలి. అలానే ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి. కాలుష్య నివారణలో భాగంగా విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. వాటిని నడపడం, నిర్వహణ ప్రభుత్వ ఉద్యోగులతోనే చేయించాలి' అని డిమాండ్ చేశారు.


స్వాధీనం చేసుకున్న కొకైన్‌ను మీడియాకు చూపిస్తున్న విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, చిత్రంలో డీసీపీ-1 అజితా వేజెండ్ల, ఏసీపీ కె.లక్ష్మణమూర్తి

విశాఖలో 25 గ్రా. కొకైన్ స్వాధీనం

» ఒక విదేశీయుడు సహా ఇద్దరు అరెస్టు

విశాఖపట్నం, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ నుంచి దిగుమతి చేసుకున్న 25 గ్రాముల కొకైన్‌ను విశాఖపట్నం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో దక్షిణాఫ్రికాకు చెందిన యువకుడితో పాటు నగరానికి చెందిన మరో యువకుడిని అరెస్టు చేశారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి కథనం మేరకు... సీతమ్మధార ఏపీఎస్ఈబీ కాలనీలోని పద్మిని అపార్టుమెంట్‌లో నివాసముంటున్న చేకూరి అక్షయ్ అలియాస్ మున్నా(34) ఒక ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా కొన్నాళ్ల కిందట ఢిల్లీ వెళ్లిన ఆయనకు అక్కడ ప్రిన్స్ అలియాస్ ఒమెనెఫెతో పరిచయమైంది. విశాఖ తిరిగివచ్చిన అక్షయ్ తరచూ అతనితో మాట్లాడి కొకైన్ తెప్పించుకునేవారు. ఈ నెల 4న అర్ధరాత్రి సమయంలో ఒమెనెఫె ఫోన్ చేసి కొకైన్‌ను మరొకరి ద్వారా పంపిస్తున్నానని, వెళ్లి తీసుకోవాలని సూచించాడు. దీంతో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని ఎన్‌సీసీ భవనం వద్దకు వెళ్లిన అక్షయ్.. అక్కడ తనకోసం ఎదురుచూస్తున్న దక్షిణాఫ్రికాకు చెందిన థామస్ జిమాన్ నుంచి 25 గ్రాముల కొకైన్‌ను తీసుకున్నారు. సమాచారం అందుకున్న ఈగల్ టీమ్, త్రీటౌన్ పోలీసులు ఇద్దరినీ అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం ప్రత్యేక బృందాన్ని ఢిల్లీకి పంపిస్తున్నట్టు సీపీ తెలిపారు.



అతిగా మామిడికాయలు తిని అజీర్తితో ఏనుగు మృతి

» ఊపిరితిత్తులకు గాలి సరఫరా నిలిచి మృత్యువాత

కల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మామిడికాయలు అధికంగా తినడంతో ఓ ఏనుగుకు అజీర్తి సమస్య తలెత్తి, ఊపిరితిత్తులకు గాలి సరఫరా నిలిచిపోయి మృతి చెందింది. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలంలో మూడేళ్లుగా తిష్ట వేసిన ఏనుగులు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. రెండ్రోజులనుంచి పాతపేట పంచాయతీలో పంటలపై దాడులు చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి గోగులమ్మ వంక నుంచి బయలుదేరిన 17 ఏనుగుల గుంపు పాతపేట గ్రామంలో వరి, మామిడి పంటలను ధ్వంసం చేశాక చిట్టారెడ్డిపేట సమీపంలోని పెద్దఒడ్డు చెరువుకట్ట కిందకు చేరాయి. అక్కడినుంచి అడవిలోకి తిరిగి వెళ్లే క్రమంలో నెల క్రితం ఓ గున్నకు జన్మనిచ్చిన ఏనుగు చెరువు కట్టపైకి వెళ్లే ప్రయత్నంలో కిందకు జారిపడి మృతి చెందింది. ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు గుర్రప్ప నిర్జీవంగా పడి ఉన్న ఏనుగును గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వారు ఏనుగు కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి అక్కడే పూడ్చిపెట్టారు. అధికంగా మామిడికాయలు తినడంతో ఏనుగుకు అజీర్తి సమస్య తలెత్తిందని, ఊపిరితిత్తులకు గాలి సరఫరా నిలిచిపోయి మృతి చెందినట్టు పోస్టుమార్టం చేసిన వైద్యులు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

▪ఆర్కే RK

తెలంగాణ బీఆర్ఎస్ జాగీరా?

ఇప్పుడు సాకు దొరికింది కదా అని మీడియాను నిందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఒక వాస్తవాన్ని మరచిపోతున్నారు. గత ఎన్నికల్లో యావత్ తెలంగాణ సమాజం బీఆర్ఎస్‌ను మట్టి కరిపించింది. కేసీఆర్ అండ్ కోను తిరస్కరించింది. తెలంగాణ ఉద్యమానికి గుండెకాయగా ఉండిన ఉత్తర తెలంగాణ– అంటే నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రజలే బీఆర్ఎస్‌ను తిరస్కరించారు. ఈ వాస్తవాన్ని గుర్తించడానికి ఇప్పటికీ ఆ పార్టీ నాయకులు నిరాకరిస్తున్నారు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న వాళ్లే ఎన్నికల్లో ఎందుకు బండకేసి కొట్టారో తెలుసుకోకుండా మీడియానో, మరొకరినో నిందించడం అవివేకం. బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు తిరస్కరించగా, హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల నివసిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందినవారే ఆ పార్టీని ఆదరించి ఆదుకోవడం వాస్తవం కాదా? స్థానికేతరులు కూడా తిరస్కరించి ఉంటే బీఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు.

ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ అయితే కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ అని 'మహా ప్రస్థానం' పుస్తకానికి రాసిన యోగ్యతాపత్రంలో చలం వ్యాఖ్యానించారు. తమ సొంత బాధల్ని ప్రజలు తమ బాధలుగా భావించాలని కోరుకొనేవాళ్లు రాజకీయాల్లోనూ ఉంటారు. భారత రాష్ట్ర సమితి నాయకుల ఆక్రోశం, ఉక్రోషం ఇందుకు తాజా నిదర్శనం. తాము అధికారంలో ఉంటే అంతా సవ్యంగా ఉందని, ఇతరులు అధికారంలో ఉంటే తెలంగాణ సర్వనాశనం అయిపోతోందని, తెలంగాణ అస్తిత్వమే ప్రమాదంలో పడిందని యావత్ తెలంగాణ సమాజం భావించాలని బీఆర్ఎస్ నాయకులు కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని మీడియా సంస్థలకు ఆ పార్టీ నాయకుడు జగదీశ్‌రెడ్డి హెచ్చరికలు జారీ చేశారు. తమ పెద్ద సారు, చిన్న సారుకు కష్టం, నష్టం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీడియాదే అన్నట్టుగా ఆయన చెప్పకనే చెబుతున్నారు. థంబ్ నెయిల్ విషయంలో ఒక న్యూస్ ఛానల్ చేసిన పొరపాటును ఆసరాగా చేసుకొని ఆ ఛానల్‌పై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారు. సదరు ఛానల్‌పై జరిగిన దాడి శాంపిల్ మాత్రమేనని, మునుముందు మీడియా సంస్థలపై తాము చేయబోయే దాడి ఊహించనంత తీవ్రంగా ఉంటుందని ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. తమ చర్యలను సమర్థించుకొనే క్రమంలో 'ఆంధ్రా మీడియా సంస్థలు' అనే పాతబడిపోయిన వాదనను బీఆర్ఎస్ నాయకులు మళ్లీ తెరమీదకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడితే సహించబోమని చెబుతున్నారు. పెద్ద సారు, చిన్న సారుకు వ్యతిరేకంగా మీడియాలో కథనాలు వస్తే తెలంగాణ అస్తిత్వం ఎందుకు, ఎలా ప్రమాదంలో పడుతుందో వారికే తెలియాలి. తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తర్వాత కూడా కొంత కాలంపాటు ఇదే సెంటిమెంట్‌ను రగిలించి బీఆర్ఎస్ రాజకీయంగా లాభపడింది. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదకొండు సంవత్సరాలు దాటింది. ఆంధ్రా, తెలంగాణ అనే భావనను ఉభయ రాష్ట్రాల వారూ మరచిపోయి ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే వారి వల్ల తెలంగాణకు నష్టం జరుగుతుంది కానీ పెద్ద సారు, చిన్న సారు తప్పులను ఎత్తిచూపితే తెలంగాణ సమాజానికి కలిగే నష్టం ఏమిటో జగదీశ్‌రెడ్డి లాంటి వారే చెప్పాలి.

ఉద్యమంలో 'ఆంధ్రజ్యోతి'...

తెలంగాణ రాష్ట్ర సమితి పురుడు పోసుకోక ముందు, ఆ మాటకొస్తే కేసీఆర్ రాజకీయాల్లోకి రాక ముందు కూడా వారు నిందిస్తున్న మీడియా సంస్థలు తెలంగాణలో ఉన్నాయి. అప్పుడు కేసీఆర్‌కు గానీ, జగన్మోహన్‌రెడ్డికి గానీ సొంత మీడియా సంస్థలు లేవు. వారికి అధికారంతో పాటు సొంత మీడియా బోనస్‌గా లభించింది. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులూదిన 'ఆంధ్రజ్యోతి' సంస్థకు ఆ ఉద్యమ ప్రస్థానంలో ప్రత్యేక స్థానం ఉంటుంది. తెలంగాణ ఏర్పాటు అంశాన్ని పరిశీలించడానికి ఏర్పాటైన శ్రీకృష్ణ కమిటీ తన నివేదికలో 'ఆంధ్రజ్యోతిని కట్టడి చేస్తే తెలంగాణ ఉద్యమం చప్పబడిపోతుంది' అని వ్యాఖ్యానించడం నిజం కాదా? రాజకీయ పార్టీలైనా, మీడియా అయినా ప్రజల మనోభావాలకు అనుగుణంగానే వ్యవహరించాలి. లేని పక్షంలో వాటికి మనుగడ ఉండదు. ఈ వాస్తవాన్ని విస్మరించి జగదీశ్‌రెడ్డి వంటి వారు మరోసారి 'ఆంధ్రా' అన్న పదాన్ని అందుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటి? ఏ రాజకీయ ప్రయోజనాలకోసం బీఆర్ఎస్ నాయకులు ఈ వాదన చేస్తున్నారో తెలుసుకోవడం అవసరం. తెలంగాణ రాష్ట్ర సమితిగా ఆవిర్భవించి ఇప్పుడు భారత రాష్ట్ర సమితిగా రూపాంతరం చెందిన ఆ పార్టీ... తనకు తానుగా తెలంగాణ సమాజానికి దూరమైంది. తమది తెలంగాణ ఇంటి పార్టీగా చెప్పుకొన్నవారు ఇప్పుడు ఇంటి పేరు మార్చుకున్నందుకు ఏం చెబుతారు? పార్టీ పేరు మార్చుకోవాలని జగదీశ్‌రెడ్డి అండ్ కో నిందిస్తున్న ఆంధ్రా మీడియా సూచించలేదు కదా? ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిందని ఇదే రాజకీయ నాయకులు చెబుతారు. మెరుగైన అవకాశాల కోసం ఆంధ్రా వారితో పాటు తెలంగాణ వారు కూడా విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారు. ఆయా దేశాల స్థానికులు కూడా ఇలా సంకుచితంగా ఆలోచించడం మొదలు పెడితే అక్కడ మన వాళ్ల పరిస్థితి ఏమిటి? అంతెందుకు... మెరుగైన విద్య కోసం ఇదే జగదీశ్‌రెడ్డి తన కొడుకును లండన్‌లో చదివించడం లేదా? కేటీఆర్ ఒకప్పుడు గుంటూరులో చదువుకోలేదా? తెలంగాణ రాష్ట్ర సమితి నిలదొక్కుకోక ముందు కేటీఆర్, కవితలు అమెరికాలో ఉద్యోగాలు చేయలేదా? అప్పుడు ఎక్కడ ఉంటున్నాం? ఎవరి తిండి తింటున్నాం? అని వారు ఆలోచించారో లేదో జగదీశ్వర‌రెడ్డి కనుక్కుంటే మంచిది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వచ్చిన వాళ్లు కూడా మెరుగైన అవకాశాలు ఉంటాయనే వచ్చారు. ఆంధ్రా వాళ్లు కూడా ఇలాగే వచ్చి ఉంటారు. తెలంగాణకు వలస వచ్చిన వాళ్లు కష్టపడి సంపాదించుకొని తమ తిండి తాము తింటున్నారు. జగదీశ్‌రెడ్డి వంటి వారు వారికి వంటా వార్పూ చేసి పెట్టడం లేదు కదా? అయినా తెలంగాణ ఎవరి జాగీరు? తెలంగాణ సమాజం భారత రాష్ట్ర సమితికి జీపీఏ ఇవ్వలేదు కదా?

ఓడించింది ఎవరు.. ఆదరించింది ఎవరు?

ఇప్పుడు సాకు దొరికింది కదా అని మీడియాను నిందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఒక వాస్తవాన్ని మరచిపోతున్నారు. గత ఎన్నికల్లో యావత్ తెలంగాణ సమాజం బీఆర్ఎస్‌ను మట్టి కరిపించింది. కేసీఆర్ అండ్ కోను తిరస్కరించింది. తెలంగాణ ఉద్యమానికి గుండెకాయగా ఉండిన ఉత్తర తెలంగాణ– అంటే నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ ప్రజలే బీఆర్ఎస్‌ను తిరస్కరించారు. ఈ వాస్తవాన్ని గుర్తించడానికి ఇప్పటికీ ఆ పార్టీ నాయకులు నిరాకరిస్తున్నారు. తమను ఆదరించి అక్కున చేర్చుకున్న వాళ్లే ఎన్నికల్లో ఎందుకు బండకేసి కొట్టారో తెలుసుకోకుండా మీడియానో, మరొకరినో నిందించడం అవివేకం. బీఆర్ఎస్‌ను తెలంగాణ ప్రజలు తిరస్కరించగా, హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల నివసిస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందినవారే ఆ పార్టీని ఆదరించి ఆదుకోవడం వాస్తవం కాదా? స్థానికేతరులు కూడా తిరస్కరించి ఉంటే బీఆర్ఎస్ పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవచ్చు. బీఆర్ఎస్ నాయకులకు ఇవన్నీ తెలియక కాదు. రాజకీయంగా తాము బలహీనపడుతున్నామన్న అనుమానం కలిగిన సందర్భాలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును భూతంగా చిత్రీకరించడం, ఆ క్రమంలో మీడియాను వివాదాల్లోకి లాగడం బీఆర్ఎస్ నేతలకు పరిపాటిగా మారింది. 2018 ఎన్నికల్లో ఈ అస్త్రం ప్రయోగించి రాజకీయంగా లబ్ధి పొందారు. ఇప్పుడు మళ్లీ అదే అస్త్రాన్ని ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. రాజకీయాలలో ఏ అస్త్రమైనా ఒకేసారి పనిచేస్తుంది. 2019 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడును ఓడించడానికి కేసీఆర్ తన వంతు సహాయ సహకారాలను జగన్మోహన్‌రెడ్డికి అందించారు. ఇందులో భాగంగా జగన్‌కు ఆర్థిక సహాయం చేయడంతో పాటు చంద్రబాబుకు హైదరాబాద్ నుంచి నిధులు అందకుండా కట్టడి చేశారు. ఈ అనుభవంతో 2023 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తెలంగాణలో పోటీ చేయలేదు. అదే సందర్భంలో, జైల్లో ఉన్న చంద్రబాబుకు మద్దతుగా నిలబడిన తెలంగాణలోని టీడీపీ సానుభూతిపరులపై కేటీఆర్ హేళనగా వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ ఎన్నికల్లో తెలుగుదేశం సానుభూతిపరులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారు. దీంతో కేసీఆర్ అండ్ కో మరింత ఆగ్రహం చెందారు. తమ ఓటమికి చంద్రబాబు, తెలుగుదేశం సానుభూతిపరులే కారణమని మనసులో పెట్టుకున్నారు. రాజకీయాల్లో ఏ పార్టీ అయినా తమకు దూరమైన వర్గాలను దగ్గర తీసుకోవడానికి ప్రయత్నిస్తుంది. కేసీఆర్ ఆ ప్రయత్నం చేయకుండా వ్యక్తులపై అలిగినట్టుగా తెలుగుదేశం సానుభూతిపరులను కూడా శత్రువులుగా ప్రకటించుకున్నారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో తిరిగి జగన్మోహన్‌రెడ్డే గెలవాలని కోరుకున్నారు. ఇప్పటికీ జగన్‌రెడ్డికే మద్దతుగా మాట్లాడుతుండటంతో తెలంగాణలోని తెలుగుదేశం సానుభూతిపరులు కేసీఆర్‌కు మరింత దూరమయ్యారు.

'కూటమి' కడితే...

ఆంధ్రప్రదేశ్‌లో 2024 ఎన్నికల్లో తెలుగుదేశం – బీజేపీ – జనసేన కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో కూడా ఈ కూటమి ప్రయోగం జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. ఈ కారణంగానే మళ్లీ తెలంగాణ సెంటిమెంటును రగిలించడానికి కేసీఆర్ అండ్ కో ప్రయత్నాలు మొదలుపెట్టారు. పనిలో పనిగా మీడియాను టార్గెట్‌గా చేసుకున్నారు. నిజానికి తెలంగాణలో కూటమి ప్రయోగం అమలు చేస్తే కాంగ్రెస్ పార్టీకే అధిక నష్టం. గత ఎన్నికల్లో తెలుగుదేశం సానుభూతిపరులు కాంగ్రెస్‌కు ఓటు వేశారు. ఈ కారణంగానే ఖమ్మం వంటి జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులకు భారీ మెజారిటీలు లభించాయి. అయినా చంద్రబాబు పేరు వినడానికి కూడా

> పుట్టింటి గొప్పలు మేనమామ దగ్గర చెప్పే ప్రయత్నం చేసినట్టుగా కేసీఆర్ గొప్పతనం గురించి నాబోటి వాళ్ల వద్ద చెప్పాలని జగదీశ్‌రెడ్డి వంటి వాళ్లు ప్రయత్నించడం వ్యర్థం. బెదిరింపులను మానుకొని ప్రజలను నమ్ముకుంటే మంచిరోజులు మళ్లీ రావొచ్చు. ఆలోచించమని మాత్రమే ఎవరైనా చెప్పగలరు. కాదూ కూడదూ అనుకుంటే మాత్రం అది వారి ఖర్మ!

కేసీఆర్, కేటీఆర్‌లు ఇష్టపడటం లేదు. ఆ కారణంగానే చంద్రబాబు నాయుడు తెలంగాణ రాజకీయాల్లో వేలు పెట్టకూడదని వారు కోరుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చుకొని తమది జాతీయ పార్టీ అని ప్రకటించుకున్న కేసీఆర్ ఇతర రాష్ట్రాలలో పోటీ చేయాలని అప్పట్లో ఉబలాటపడ్డారు. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్టుగా 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అసలుకే మోసం వచ్చింది. కేసీఆర్ ఆలోచనలను, చర్యలను తెలంగాణ సమాజం తిరస్కరించింది. దీంతో ఆ తర్వాత 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఇతర రాష్ట్రాల్లో పోటీ చేసే సాహసం కేసీఆర్ చేయలేకపోయారు. తెలంగాణలో ఇతర పార్టీలకు



స్థానం లేదని, రాష్ట్రానికి తామే పట్టాదారులమని చెప్పుకున్న బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఒక్కటంటే ఒక్క సీటూ రాలేదు. ఇదీ గతం! తెలంగాణలో తమకు తిరుగులేదని భావించిన బీఆర్ఎస్‌కు ఈ దుస్థితి ఎందుకు ఏర్పడిందో గుర్తించే ప్రయత్నం చేసి దిద్దుబాటు చర్యలు తీసుకొని ఉంటే ఇప్పుడు మీడియా పైనో మరొకరి పైనో రంకెలు వేసే అవసరం వచ్చేది కాదు. రాజకీయ గండరగండడుగా పేరొందిన కేసీఆర్‌కు ఈ దుస్థితి ఎందుకొచ్చిందో తెలుసుకొనే ప్రయత్నం జగదీశ్‌రెడ్డి వంటి వారు చేయకుండా ఎవరినో బెదిరించాలనుకోవడం కుప్పిగంతులు వేయడమే అవుతుంది. తమను తెలంగాణ సమాజమే తిరస్కరించిందన్న కఠోర సత్యాన్ని విస్మరించి తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం ఏర్పడిందని ఏడ్వడం ఎబ్బెట్టుగా ఉంది. తెలంగాణ అస్తిత్వానికి ఎవరూ ముప్పు తలపెట్టడం లేదు. పదకొండు సంవత్సరాల కిందట ఏర్పడిన తెలంగాణ అస్తిత్వం ఇవాళ మాత్రమే కాదు రేపు కూడా పదిలంగానే ఉంటుంది. బీఆర్ఎస్ గానీ, మరొక పార్టీ గానీ ఉండొచ్చూ లేకపోనూ వచ్చు. తెలంగాణ మాత్రం సగర్వంగా నిలబడే ఉంటుంది. తమ అహంకారపూరిత పోకడలను తెలంగాణ సమాజం హర్షించలేకపోయిందన్న వాస్తవాన్ని గుర్తించడానికి బీఆర్ఎస్ నాయకులు ఎందుకు నిరాకరిస్తున్నారో తెలియదు.

రాజకీయ కాలుష్యం...

రాజకీయాలు కలుషితమయ్యాయి. దాని ప్రభావం తెలంగాణ రాజకీయాలపైనా పడింది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా పరిగణించేవారు. ఈ ధోరణి ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా కొనసాగుతోంది. ప్రత్యర్థులను వేధించడమే అధికారం పరమావధి అన్నట్టుగా తెలుగునాట రాజకీయాలను మార్చిన ఘనత కేసీఆర్, జగన్‌రెడ్డిలదే. తాము అల్పుడుగా భావించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి కావడాన్ని కేసీఆర్, కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ కారణంగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఒంటి కాలి మీద లేస్తున్నారు. వాడు, వీడు అన్న పద ప్రయోగాలు చేస్తున్నారు. వయసు, అనుభవం రీత్యా కేసీఆర్ తన రాజకీయ ప్రత్యర్థులను తిట్టినా ఎవరూ పెద్దగా నొచ్చుకోలేదు. కేసీఆర్ వాడిన భాషను కేటీఆర్ వాడడాన్ని బీఆర్ఎస్ శ్రేణులు కూడా హర్షించలేక పోతున్నాయి. జగదీశ్‌రెడ్డి వంటి రాజకీయ మరుగుజ్జులకు కేటీఆర్ చిన్న సారు కావొచ్చుగానీ, ప్రజలెందుకు లెక్క చేస్తారు! కేసీఆర్‌నే ప్రజలు మట్టికరిపించిన విషయం అప్పుడే మరచిపోతే ఎలా? వ్యక్తిత్వ హననాల విషయానికి వద్దాం! సోషల్ మీడియా పుణ్యమా అని ప్రజా జీవితంలో ఉన్న వారితో పాటు ప్రముఖుల వ్యక్తిత్వ హననం పరిపాటి అయింది. ఈ విషయంలో ప్రధాన మీడియాకు బాధ్యత ఉంటుంది. సోషల్ మీడియాలో ఎవరు పడితే వాళ్లు, ఏదిపడితే అది వాగవచ్చు. అంచేత అన్ని పార్టీల వాళ్లూ బాధితులుగానే ఉంటున్నారు. కేటీఆర్ వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారని ప్రత్యేకంగా బాధపడటం అనవసరం. ఈ వ్యక్తిత్వ హననాలు, దుష్ప్రచారాలు చేయడంలో కేటీఆర్ కూడా ఏమీ తీసిపోలేదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్నారు. బలమైన సోషల్ మీడియా సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంటే ఎన్నికల్లో గెలిచిపోవచ్చునని, అలా లేనందునే గత ఎన్నికల్లో ఓడిపోయామని కేటీఆర్ పిచ్చి భ్రమలో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డికి బలమైన సోషల్ మీడియా సైన్యం ఉండి కూడా గత ఎన్నికల్లో ఓటమిని తప్పించుకోలేకపోయారన్న వాస్తవాన్ని విస్మరిస్తే ఎలా? ప్రజల్ని తక్కువ అంచనా వేయడం వల్లే ఇటువంటి ఆలోచనలు వస్తాయి. సోషల్ మీడియా ద్వారా వికృత పోకడలను ప్రోత్సహించడంలో ఫలానా నాయకుడికి మినహాయింపు అని చెప్పలేని పరిస్థితి. అన్ని పార్టీలకూ ఈ జబ్బు పట్టుకుంది. ఈ క్రమంలో ప్రధాన మీడియాలో కూడా అప్పుడప్పుడూ అవాంఛనీయ పోకడలు తొంగి చూస్తున్నాయి. యూట్యూబ్‌లో కనిపిస్తున్న థంబ్ నెయిల్స్‌కూ వాస్తవ కథనానికీ పొంతన ఉండటం లేదు. ఇది గుర్తించిన యూట్యూబ్ యాజమాన్యం ఇటీవల కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పుడున్న పరిస్థితులలో సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననానికి సంబంధించిన పోస్టులు, వీడియోలపై నియంత్రణ అవసరం. ఈ విషయం అలా ఉంచితే తెలుగునాట రాజకీయాలలో కక్షలూ కార్పణ్యాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. తాము అధికారంలోకి వస్తే ప్రజలకూ, రాష్ట్రానికీ ఏం చేస్తామో చెప్పకుండా తాము ఎంత కర్కశంగా వ్యవహరించబోతామో చెబుతున్నారు. తాము అధికారంలోకి వస్తే జాతరలో పొట్టేళ్ల తలలు నరికినట్టు ప్రత్యర్థులను రప్పా రప్పా నరుకుతామని వైసీపీ నాయకులు హెచ్చరిస్తున్నారు. ఈ పోకడలను జగన్ రెడ్డి కూడా సమర్థిస్తున్నారు. ఈ ధోరణిని ఇప్పుడు తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే మీడియాను హెచ్చరించడంతో పాటు రాజకీయ ప్రత్యర్థుల సంగతి తేలుస్తామని రంకెలు వేస్తున్నారు. ఎంపిక చేసుకున్న ప్రత్యర్థులకు భౌతికంగా హాని చేయడానికి అధికారం ఇవ్వాలని కోరడం వింత ధోరణి.

> తెలంగాణ సమాజం వేరు– కేసీఆర్ కుటుంబం వేరు. ప్రజలకు కష్టం వస్తే బాధపడాలి. వారిని ఆదుకోవడానికి చేతులు కలపాలిగానీ కేసీఆర్, కేటీఆర్‌ను అధికారంలోకి తీసుకురావడం కోసం అందరూ నిద్రాహారాలు మాని ఏడ్చుకుంటూ కూర్చోవాలని కోరుకోవడం ఏమిటి? తాను మతం నడపడం లేదని, ఫక్తు రాజకీయ పార్టీ నడుపుతున్నానని కేసీఆర్ స్వయంగా చెప్పుకొన్నారు. కాంగ్రెస్, బీజేపీల వలె బీఆర్ఎస్ కూడా ఒక రాజకీయ పార్టీ మాత్రమే. తెలంగాణ సమాజంపై ఆ పార్టీకి ప్రత్యేకంగా పేటెంట్ ఏదీ లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను అభిమానించేవారు అభిమానిస్తూనే ఉంటారు. అంత మాత్రాన తమ పార్టీని మాత్రమే ప్రజలందరూ అభిమానించాలని, మీడియా కూడా తమకే ఊడిగం చేయాలని అనుకోవడం ఏమిటి? గత ఎన్నికల్లో ఓటమికి కారణాలను గుర్తించి ప్రజల వద్దకు వెళ్లి చెంపలు వేసుకుంటే వాళ్లే మళ్లీ ఆశీర్వదించవచ్చు. అంతేగానీ మా పార్టీ నాయకులకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే దాడులు చేస్తామని మీడియాను హెచ్చరించడం ఏమిటి?

విచారణల పరంపర...

తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ కమిషన్ ఏర్పాటు చేసింది. కేసీఆర్ కూడా ఈ విచారణ కమిషన్ ముందు హాజరయ్యారు. మరోవైపు టెలిఫోన్ ట్యాపింగ్‌పై దర్యాప్తునకు సిట్ ఏర్పాటైంది. నిజానికి సిట్ టెలిఫోన్ ట్యాపింగ్‌పై విచారణకు ఏర్పాటు కాలేదు. ట్యాపింగ్‌కు సంబంధించి ప్రారంభంలో ప్రత్యేకంగా ఫిర్యాదులు కూడా రాలేదు. దశాబ్దాలుగా తీవ్రవాదులు, ఉగ్రవాదులకు సంబంధించి సేకరించిన సమాచారాన్ని ధ్వంసం చేశారని ఎస్ఐబీ అధికారులు చేసిన ఫిర్యాదు కారణంగా సిట్ ఏర్పాటైంది. ఈ దర్యాప్తులో భాగంగా ప్రజా ప్రతినిధులు, ప్రత్యర్థుల ఫోన్లను విచ్చలవిడిగా ట్యాప్ చేశారని వెల్లడైంది. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడే ఇది జరిగింది. తాము చేసిన ట్యాపింగ్‌కు సంబంధించిన ఆధారాలు లభించకుండా చెయ్యాలన్న ఉద్దేశంతో నాటి అధికారులు సర్వర్లు, హార్డ్ డిస్క్‌లను ధ్వంసం చేశారు. దీనిపై ప్రారంభమైన విచారణలో తీగ లాగితే డొంక కదిలింది. టెలిఫోన్ ట్యాపింగ్‌తో ముఖ్యమంత్రికి ఏమి సంబంధమని కేసీఆర్ ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. నిజమే... తీవ్రవాదులు, ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారం కోసం అధికారులు వారి స్థాయిలోనే ఫోన్లు ట్యాప్ చేస్తారు. దానికీ ముఖ్యమంత్రికీ నేరుగా సంబంధం ఉండదు. రాజకీయ నాయకులు, వ్యాపారులు, మీడియా ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేయాలన్న ఆలోచన అధికారులకు ఎందుకొస్తుంది? వారికి ఆ అవసరం ఏమిటి? అలా చేయడం వల్ల ప్రయోజనం పొందేది ఎవరు? అధికారంలో ఉన్నవారే కదా? అలాంటప్పుడు నాకేమిటి సంబంధం? అని కేసీఆర్ వాదించడం తర్కానికి నిలబడదు. ఇప్పుడు సిట్ విచారణ వేగాన్ని అందుకున్నందున ఇందుకు సంబంధించిన వార్తలు మీడియాలో ప్రముఖంగా వస్తున్నాయి. ఇది సహజం. అంత మాత్రాన టెలిఫోన్ ట్యాపింగ్‌తో కేసీఆర్, కేటీఆర్‌కు ముడిపెడుతూ వార్తలు రాయడం ఏమిటి? అని జగదీశ్‌రెడ్డి లాంటి వారు హూంకరించడం ఏమిటి? కేసీఆర్ చుట్టూ దెయ్యాలు చేరాయని ఆయన కుమార్తె కవిత ఆరోపించారు కదా? ఈ ప్రకటన వల్ల ఆమె బీఆర్ఎస్‌కు ఎంతో కొంత నష్టం చేసినట్టే కదా? అయినా ఆమెను తమ హిట్ లిస్ట్‌లో ఎందుకు చేర్చుకోలేదో?


తలవంపులు తెచ్చిందెవరు?

తెలంగాణకు తలవొంపులు ఎవరైనా తెచ్చారంటే అది బీఆర్ఎస్ వాళ్లే. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో జైలుకు వెళ్లిన కవితది ఏ పార్టీ? జాతీయ స్థాయిలో ఎన్నికల్లో పోటీ చేసి, కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానని ప్రగల్భాలు పలికి చివరికి తోక ముడవడం వల్ల తెలంగాణ నవ్వులపాలు కాలేదా? కేసీఆర్, కేటీఆర్‌కు కష్టం వస్తే మొత్తం తెలంగాణ సమాజం ఎందుకు బాధపడాలి? తెలంగాణ సమాజం వేరు– కేసీఆర్ కుటుంబం వేరు. ప్రజలకు కష్టం వస్తే బాధపడాలి. వారిని ఆదుకోవడానికి చేతులు కలపాలిగానీ కేసీఆర్, కేటీఆర్‌ను అధికారంలోకి తీసుకురావడం కోసం అందరూ నిద్రాహారాలు మాని ఏడ్చుకుంటూ కూర్చోవాలని కోరుకోవడం ఏమిటి? తాను మతం నడపడం లేదని, ఫక్తు రాజకీయ పార్టీ నడుపుతున్నానని కేసీఆర్ స్వయంగా చెప్పుకొన్నారు. కాంగ్రెస్, బీజేపీల వలె బీఆర్ఎస్ కూడా ఒక రాజకీయ పార్టీ మాత్రమే. తెలంగాణ సమాజంపై ఆ పార్టీకి ప్రత్యేకంగా పేటెంట్ ఏదీ లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను అభిమానించేవారు అభిమానిస్తూనే ఉంటారు. అంత మాత్రాన తమ పార్టీని మాత్రమే ప్రజలందరూ అభిమానించాలని, మీడియా కూడా తమకే ఊడిగం చేయాలని అనుకోవడం ఏమిటి? గత ఎన్నికల్లో ఓటమికి కారణాలను గుర్తించి ప్రజల వద్దకు వెళ్లి చెంపలు వేసుకుంటే వాళ్లే మళ్లీ ఆశీర్వదించవచ్చు. అంతేగానీ మా పార్టీ నాయకులకు వ్యతిరేకంగా వార్తలు రాస్తే దాడులు చేస్తామని మీడియాను హెచ్చరించడం ఏమిటి? ఉడత ఊపులకు చింతకాయలు రాలవు. మా వరకు మేము ఇలాంటి దాడులను, బెదిరింపులను ఎన్నో చూశాం. రాజశేఖరరెడ్డి హయాంలో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన కార్యాలయంపై దాడి చేసి తగులబెట్టారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాత కేసీఆర్ పాలనలోనూ 'ఆంధ్రజ్యోతి' సంస్థలపై దాడులు జరిగాయి. వివిధ రూపాల్లో నిర్బంధాలు ఎదురయ్యాయి. అయినా వాటన్నింటినీ తట్టుకొని నిలబడ్డాం. భవిష్యత్తులో కూడా నిలడతాం. తమను అధికారంలోంచి తప్పించి తప్పుచేశామని ప్రజలు వాపోతున్నారని, ఎన్నికలు ఎప్పుడు జరిగినా తిరిగి అధికారంలో కూర్చోబెట్టడానికి ప్రజలు తహతహలాడుతున్నారని బీఆర్ఎస్ నాయకులు చెప్పడమే కాదు, నమ్ముతున్నారు కూడా. అలాంటప్పుడు రెండు మూడు మీడియా సంస్థలు మీ దారికి రాకపోతే ఏమౌతుంది? ఏదో ఒక రాజకీయ పార్టీని అధికారంలో కూర్చోబెట్టే సత్తా మీడియాకు ఉండదు. ప్రజల తిరస్కారణకు గురైన పార్టీ అధికారాన్ని కోల్పోతుంది. అలాగే ప్రజల నిరాదరణకు గురయ్యే మీడియాకు కూడా మనుగడ ఉండదు. ఈ వాస్తవాన్ని గుర్తించకుండా జగన్‌రెడ్డి బాటలో నడవాలనుకుంటే అది బీఆర్ఎస్ నాయకుల ఇష్టం. తనపై తనకు నమ్మకం ఉన్నవాడు ఇతరులపై పడి ఏడవడు. ఆత్మవిశ్వాసం లోపించినవాడే ఆ పని చేస్తాడు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు సహనం అలవర్చుకుంటే మంచిది. వీళ్లకు ఇంకా బలుపు తగ్గలేదని ప్రజలు భావిస్తే మరో పర్యాయం కూడా అధికారానికి దూరంగానే ఉండవలసి వస్తుంది. పుట్టింటి గొప్పలు మేనమామ దగ్గర చెప్పే ప్రయత్నం చేసినట్టుగా కేసీఆర్ గొప్పతనం గురించి నాబోటి వాళ్ల వద్ద చెప్పాలని జగదీశ్‌రెడ్డి వంటి వాళ్లు ప్రయత్నించడం వ్యర్థం. బెదిరింపులను మానుకొని ప్రజలను నమ్ముకుంటే మంచిరోజులు మళ్లీ రావొచ్చు. ఆలోచించమని మాత్రమే ఎవరైనా చెప్పగలరు. కాదూ కూడదూ అనుకుంటే మాత్రం అది వారి ఖర్మ!

అణుశాస్త్రవేత్త, అపర ధన్వంతరి!

క్యాన్సర్ వ్యాధి చికిత్సకు న్యూక్లియర్ పార్టికల్స్ పరిశోధన మరింత దోహదపడాలని అమెరికాలో శోధించి, తను పుట్టినగడ్డపై 30 ఏళ్లకు పైగా మహాత్మా గాంధీ మెమోరియల్ మెడికల్ (ఎంజీఎం) ట్రస్టు ద్వారా సేవ చేసిన గాంధేయవాది డాక్టర్ ముదుండి రామకృష్ణంరాజు. ప్రఖ్యాత శాస్త్రవేత్త స్వామి జ్ఞానానంద దగ్గర ఏడు సంవత్సరాలు పరిశోధన చేసి డి.ఎస్సీ పట్టా పొందిన సాధకుడు. రాష్ట్రపతిగా రాణించిన శాస్త్రవేత్త ఎ.పి.జె. అబ్దుల్ కలాం క్లాస్‌మేట్. 2013 సంవత్సరంలో పద్మశ్రీ పురస్కార గ్రహీత అయిన డాక్టర్ ఎమ్.ఆర్ రాజు గత నెల 24న కన్నుమూయడం తెలుగు సమాజానికి తీరని లోటు. పరులకు ఉపయోగపడే పనులు మాత్రమే చేసే తండ్రిని చూసి స్ఫూర్తి పొందిన ఎమ్.ఆర్ రాజు తన 94 ఏళ్ల వయసులో భీమవరానికి దగ్గర ఉన్న పెద్ద అమిరం గ్రామంలోని ఎంజీఎం ట్రస్ట్ భవనంలో తృప్తిగా సేవలోనే కన్ను మూశారు. పదహారేళ్ళ వయసులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించిన తన సహచరి సుభద్రారాజు... జీవితంలో, సేవాకార్యక్రమాలలో పెద్ద తోడుగా ఉండి మూడేళ్ల క్రితం మరణించడం డాక్టర్ రాజును తీవ్రంగా కలచి వేసింది.

1931 జూలై 15న జన్మించిన రామకృష్ణంరాజు మద్రాసులోని ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఎస్సీ, ఆ తర్వాత ఫిజిక్స్‌లో ఎం.ఎస్సీ చేశారు. పిమ్మట ఆంధ్ర విశ్వ విద్యాలయంలో ప్రముఖ శాస్త్రవేత్త బి.ఆర్.రావు వద్ద ఎం.ఎస్సీ (బై రీసెర్చ్) పూర్తిచేసిన తర్వాత, ప్రఖ్యాత న్యూక్లియర్ సైంటిస్ట్ స్వామి జ్ఞానానంద (1896–1969) వద్ద డాక్టర్ ఆఫ్ సైన్స్ పూర్తి చేశారు. తొలుత యోగిగా జీవితాన్ని కొనసాగించి, ఐన్‌స్టీన్ సాపేక్షతాసిద్ధాంతం కారణంగా న్యూక్లియర్ సైంటిస్ట్‌గా మారిన జ్ఞానానంద ప్రపంచ విజ్ఞాన చరిత్రలోనే చాలా ప్రత్యేకమైన వ్యక్తి. తండ్రి తర్వాత ఈ పరిశోధక గురువు ప్రభావం రాజు మీద చాలా ఉంది. కాబట్టే 1961లో క్యాన్సర్ చికిత్సకు న్యూక్లియర్ పార్టికల్స్ ఏ రకంగా తోడ్పడగలవని పరిశోధన కోసం డాక్టర్ రాజు అమెరికా వెళ్లారు. ప్రఖ్యాత మసాచుసెట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జనరల్ హాస్పిటల్, ఇంకా హార్వర్డ్‌లలో మరింత పరిశోధన చేసి, తొలుత పదేళ్లు బర్కిలీలోని లారెన్స్ రేడియేషన్ లేబరేటరీలో జి.హెచ్ లారెన్స్‌తో కలిసి శ్రమించారు. తర్వాత 1971లో లాస్ ఆల్మోస్ నేషనల్ లాబోరేటరీలో బయోఫిజిస్ట్‌గా 23 ఏళ్ల పరిశోధనాజీవితం గడిపారు. 1981లో 3000 మంది శాస్త్రవేత్తలు, ఇంజినీర్లలో ఎంపిక చేయబడిన 25 మందిలో ఒకరుగా గుర్తింపు పొందారు. దాదాపు అదే సమయంలో తను ఉద్యోగం చేసే పరిశోధనాశాలలో 'విజ్ఞాన శాస్త్రంలో సృజనాత్మకత' గురించి ప్రఖ్యాత తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తితో ప్రసంగం; అటు తర్వాత శాస్త్రవేత్తలతో వారి ముఖాముఖీ సంభాషణ ఏర్పాటు చేసి, విభిన్నమైన చరిత్రకు శ్రీకారం చుట్టారు. రామకృష్ణంరాజు దంపతులు 1994లో భారతదేశం తిరిగి వచ్చారు.



డాక్టర్ ఎమ్.ఆర్ రాజు
15-7-1931 – 24-6-2025

స్వాతంత్రోద్యమంలో పాల్గొనడమే కాకుండా, 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం సిద్ధించిన ఘడియలను దుర్గాబాయి దేశముఖ్‌తో కలిసి పంచుకున్న అదృష్టం సుభద్రది. గ్రామీణ ఆరోగ్యం కోసం సుభద్ర 1976లో ఎంజీఎంను పెద్ద అమిరంలో ప్రారంభించి కంటి చూపు, మహిళల సాధారణ ఆరోగ్యం, సర్వికల్ క్యాన్సర్ వంటి సమస్యల పరిష్కారాల పట్ల దృష్టి పెట్టారు. 1994లో వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని భీమవరానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెద్ద అమిరం గ్రామంలో ఉన్న ఎంజీఎం ట్రస్టు కార్యక్రమాలను గ్రామీణారోగ్యం, గ్రామీణ విద్య, పల్లె ప్రాంతాల్లో క్యాన్సర్ సమస్య నివారణ వైపుగా మరింత విస్తృతపరిచారు ఎం.ఆర్.రాజు దంపతులు. తన పరిశోధనతో ముడిపడి ఉన్న సంస్థలు, శాస్త్రవేత్తల సహకారంతో వీరు 'రూరల్ క్యాన్సర్ సెంటర్'ను 2006 జనవరి 9న అప్పటి రాష్ట్రపతి, ఎ.పి.జె కలామ్‌తో ప్రారంభింపజేశారు. గ్రామీణ ప్రాంతాలకు రేడియేషన్ చికిత్స, సైన్స్ అండ్ సోషల్ సర్వీస్ వంటి అంశాలపై శాస్త్రవేత్తలకు అవగాహన కల్పించే రీతిలో ఈ ట్రస్ట్ ఏర్పాటు చేసిన సదస్సులలో ఆటమిక్ ఎనర్జీ కమిషన్ చైర్మన్లు అనిల్ కకోద్కర్, కుమార్ బెనర్జీ పాల్గొనడం విశేషం. రూరల్ క్యాన్సర్ సెంటర్‌లో నమోదైన 3200 మంది పేషంట్లలో 1400 మంది రేడియేషన్ థెరపీ పొందారు. స్థానిక అధికారులతో, తనతో పని చేసిన శాస్త్రవేత్తల సహకారంతో ఎంజీఎం ట్రస్ట్ చాలా రకాల సేవలు మూడు దశాబ్దాలుగా చేస్తోంది.

వాస్తవాలను ఖాతరు చేయకుండా ఇతరులు చేసిన విమర్శలు, పొగడ్తలు వంటి ట్రాష్‌ను గుర్తుపెట్టుకోవడానికి మన మెమరీని వాడుతున్నామని డాక్టర్ ఎమ్.ఆర్ రాజు భావించేవారు. న్యూక్లియర్ పార్టికల్స్ ఉపయోగాలకు సంబంధించిన రేడియేషన్ ఫిజిక్స్, రేడియో బయాలజీ విభాగాలలో 140 పరిశోధనా పత్రాలతో పాటు ఎన్నో సమీక్షావ్యాసాలు, అధ్యయనాంశాలు రాసిన డాక్టర్ రాజు 'హెవీ పార్టికల్ రేడియో థెరపీ' అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. అలాగే క్యాన్సర్‌కు సంబంధించి మంచి అవగాహన కలిగించే పుస్తకం ఇంగ్లీషు, తెలుగు భాషల్లో వెలువడి ప్రాచుర్యం పొందింది.

▪ డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి పూర్వ సంచాలకులు

బంగారు బాపట్ల

పీ-4 అమలులో రాష్ట్రంలోనే అగ్రభాగం

- కలెక్టర్ వెంకట మురళికి సీఎం ప్రత్యేక అభినందనలు
- మార్గదర్శకుల ఎంపికలో పక్కా ప్రణాళిక
- 72 శాతం బంగారు కుటుంబాల అనుసంధానం
- గుంటూరు, పల్నాడులో ముమ్మర కసరత్తు

సీఎం చంద్రబాబు నాయుడు మదిలో పుట్టిన మహత్తర ఆలోచన పీ-4. బంగారు కుటుంబాల ఎంపికతో పేదరిక నిర్మూలనకు ఆయన యుద్ధమే చేస్తున్నారు. సీఎం ఆలోచనలకు కలెక్టర్ పట్టుదల తోడవడంతో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా ఈ పథకం అమలులో అగ్రభాగాన నిలిచింది. ఇప్పటికే 72 శాతం బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం పూర్తి చేసి.. పక్కా ప్రణాళికతో జిల్లా యంత్రాంగం ముందుకెళ్తోంది. ఇందుకు గాను కలెక్టర్ జె.వెంకట మురళి సీఎం ప్రశంసలు కూడా అందుకున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది ఏప్రిల్ 1న బాపట్ల జిల్లాలోని చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్ల పాలెంలో పింఛన్ల పంపిణీకి స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేశారు. అక్కడే వేదికపై ఇద్దరు మార్గదర్శకులను పరిచయం చేసి, గ్రామంలో కడు పేదరికంలో ఉన్న 33 బంగారు కుటుంబాలను వారికి అనుసంధానం చేశారు. అప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఓ వైపు బంగారు కుటుం బాల సర్వే చేపడుతూనే.. మార్గదర్శకుల ఎంపిక పై జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో అడుగులేసింది. రెండు వారాల కోసారి సమీక్షలు జరిపి.. పురోగతిని బేరీజు వేసుకుని ముందు కెళ్తున్నారు. దాని ఫలితమే నేడు పీ-4 అమలులో రాష్ట్రంలోనే జిల్లా అగ్రభాగాన నిలిచింది.



పీ4 అమలు సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి

3,528 మంది మార్గదర్శకులు

బంగారు కుటుంబాల సర్వే బాపట్ల జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా ఓ కొలిక్కి వచ్చింది. కానీ, మార్గదర్శకుల ఎంపికే యంత్రాంగానికి సవాల్‌గా మారింది. బాపట్ల జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా అడుగులేసి 3,528 మార్గదర్శకులను పీ-4లో భాగంగా ఎంపిక చేసింది. వారి సామర్థ్యాన్ని బట్టి.. ఒకటి నుంచి పది బంగారు కుటుంబాలను అప్పగించడం జరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎంపికైన మార్గదర్శకుల సంఖ్య వెయ్యిలోపే ఉన్నట్లు సమాచారం. శుక్రవారం సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బాపట్ల జిల్లాలో అనుసరించిన నమూనా పాటించాలని మిగతా జిల్లాలకు సూచించారు.

అందరి సహకారంతో..

మార్గదర్శకుల ఎంపికలో కార్పొరేట్ దిగ్గజాలపైనే ఆధారపడకుండా సేవాభావంతో పాటు సమాజానికి ఎంతో కొంత తిరిగివ్వాలనే దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకుని వెళ్లడంలో బాపట్ల జిల్లా యంత్రాంగం విజయవంతమైంది. గ్రామాల్లో ఉన్న ఎన్ఆర్ఐల సహకారం తీసుకుంది. ఎన్‌జీవో ఆర్గనైజేషన్స్, వివిధ విభాగాల జిల్లా అధికారులు, స్తోమతను బట్టి ఒక్క బంగారు కుటుంబానికే సాయం చేస్తామని ముందుకొచ్చిన వారిని కూడా ఈ పీ4లో భాగస్వాములుగా చేశారు. సమాంతరంగా జిల్లాలో ఉన్న ఓ మోస్తరు కంపెనీల అధినేతలతో కూడా కలెక్టర్ వెంకటమురళి పలు సార్లు సమావేశమయ్యారు. సీఎస్ఆర్ కింద వారిని కూడా ఈ బృహత్తర కార్యక్రమంలో పాలు పంచుకునేలా చేశారు. ఇలా అన్ని వైపుల నుంచి చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగడం వల్లే 3,528 మార్గదర్శకులను ఎంపిక చేయగలిగి సీఎం మన్ననలందుకోగలిగారు.

మూడు జిల్లాల్లో బంగారు కుటుంబాలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 62,388 బంగారు కుటుంబాలను పీ4 కింద యంత్రాంగం ఎంపిక చేసింది. ఇందులో 44,920 కుటుంబాలను 3,528 మంది మార్గదర్శకులకు అనుసంధానం చేశారు. దీంతో 72 శాతం కుటుంబాలకు పీ4 అమలుకు మార్గం సుగమమైంది. పల్నాడు జిల్లాలో మొత్తం 79 వేల పేద కుటుంబాలను జిల్లా యంత్రాంగం ఎంపిక చేసింది. గుంటూరు జిల్లాలో దాదాపు 58 వేల కుటుంబాలు పీ-4కు అర్హత సాధించాయి. ఈ రెండు జిల్లాల్లో మార్గదర్శకుల సంఖ్య తక్కువగా ఉండడంతో అనుసంధానం నెమ్మదిగా జరుగుతోంది. 40 శాతం బంగారు కుటుంబాల అనుసంధానం ప్రక్రియ పూర్తయింది.

కీలకంగా డీఆర్డీఏ విభాగం

పీ4 అమలు కోసం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి , క్రమం తప్పకుండా సమీక్షలు (మిగతా 6వ పేజీలో)

170 పాఠశాలలు జీరో అడ్మిషన్!





ఉపాధ్యాయులు, అధికారులు బదిలీల హడావుడిలో మునిగి పోయారు. ఈ ఏడాది పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం బడిబాట వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వం నిర్వహించ లేదు. దీంతో సర్కారు బడుల్లో ప్రవేశాలు పూర్తిగా పడి పోయాయి. మరో వైపు తల్లికి వందనం పథకాన్ని కూడా ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు తమకు అనుకూలంగా మలుచు కున్నాయి. ఆ నగదునే ఫీజుగా చెల్లించి అడ్మిషన్లు పొందా లని సూచించడంతో.. తల్లిదండ్రులు అటువైపు మొగ్గారు. వందల సంఖ్యలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఈ ఏడాది చేర లేదంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ పాఠశాలల్లో పడిపోయిన ప్రవేశాలు

- బదిలీల హడావుడిలో
- ఉపాధ్యాయులు, విద్యాశాఖ
- 'బడిబాట' కూడా నిర్వహించని వైనం
- తల్లికి వందనం నగదే.. ప్రైవేట్ స్కూళ్ల ఫీజు
- పల్నాడు జిల్లాలో పరిస్థితి మరీ దారుణం
- వందల పాఠశాలల్లో అడుగుపెట్టని విద్యార్థులు

గుంటూరు, విద్య జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ ఆధ్వర్యంలో దాదాపు 900 వరకు పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 6.50 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ఈ ఏడాది ఉపాధ్యాయులు బదిలీల హడావుడిలో.. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంగతి విస్మరించారు. దీనిని తమకు అనుకూలంగా మార్చుకున్న ప్రైవేట్ యాజమాన్యాలు.. భారీ సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తమ వైపునకు ఆకర్షించాయి. దీంతో సర్కారు పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ కార్యక్రమాలు ఏవి?

ప్రభుత్వ (మిగతా 6వ పేజీలో)

170 పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదు

పల్నాడు జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు భారీగా తగ్గిపోయాయి. దాదాపు 170 పాఠశాలల్లో ఇప్పటి వరకు ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. దీనికి తోడు జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. పల్నాడు నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిపోయారు. కొత్త డీఎస్సీ ఫలితాలు వస్తేనే.. ఉపాధ్యాయుల భర్తీ జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

లోక్ అదాలత్ రికార్డు

- ఉమ్మడి జిల్లాలో 10,734 కేసుల పరిష్కారం
- విలువ రూ.50.96 కోట్లు

గుంటూరు,(లీగల్) జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో శనివారం అన్ని కోర్టుల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 10, 734 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ తెలిపారు. వీటి లో సివిల్ కేసుల 1077, క్రిమినల్ కేసు లు 9580, ప్రీ -లిటిగేషన్ కేసులు 77 ఉండగా ఈ పరిష్కారమైన కేసుల విలువ మొత్తం రూ. 50,96,79,914 గా పేర్కొన్నారు. జిల్లా న్యాయశాఖ చరిత్ర లో ఇప్పటి వరకు జరిగిన లోక్ అదా లత్‌లలో ఇంత పెద్ద మొత్తంలో కేసులు పరిష్కారం కావడం ఇదే మొదటిసారి అని హర్షం వ్యక్తం చేశారు. వాహన ప్రమాదాలకు సంబంధించిన మూడు పెద్ద కేసుల్లో బాధితులకు రూ.3.20 కోట్లు అందినట్టు తెలిపారు. ఈ లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన కక్షిదారులు, పోలీస్, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



బాధితులకు నగదు చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి

ఆర్టీసీలో ఉద్యోగోన్నతులు కల్పించాలి

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదరరావు

గుంటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులకు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను వెంటనే అమలు చేయాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు కోరారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్సీ నియమించి, ఐఆర్ ప్రకటించాలని కోరారు. పాత వైద్య విదానం పద్దతిలో రిఫరల్ ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలందించాలని కోరారు. విలీనానికి ముందున్న ఇన్సెంటివ్‌లు, అలవెన్స్‌లు చెల్లించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టామన్నారు. ఈయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీఎస్ నారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వీ కృష్ణారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కరిముల్లా, విజయ్‌కుమార్, డిపో కార్యదర్శులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న దామోదరరావు, కృష్ణారావు

విత్తన కంపెనీలపై మెరుపు దాడులు

- 40 మంది అధికారుల బృందం ఏకకాలంలో తనిఖీలు
- రూ.4.77 కోట్ల విత్తన అమ్మకాలు నిలిపివేత

గుంటూరు సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని విత్తనాల కంపెనీలపై వ్యవసాయ శాఖ మెరుపు దాడులు నిర్వహించింది. జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ దాడుల్లో 40 మంది అధికారులు పాల్గొన్నారు. 13 బృందాలుగా ఏర్పడి గుంటూరు నగరంతో పాటు, రూరల్లోని విత్తనాల తయారీ, ప్రాసెసింగ్ యూనిట్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాలపై దాడులు నిర్వహించారు. చట్టానికి విరుద్ధంగా నిర్వహిస్తున్న వివిధ రకాల విత్తనాల అమ్మకాలను నిలిపి వేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశించారు. 704.84 కేజీల మిర్చి , 293.85 కేజీల ఇతర విత్తనాల అమ్మకాలు నిలిపి వేసినట్లు అధికారులు వెల్లడించారు. వీటి విలువ రూ. 4.77 కోట్లు వరకు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ విత్తనాల డీలర్లు నిబంధనలకు లోబడి అమ్మకాలు జరపకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గుంటూరు: విత్తనాల కంపెనీలలో తనిఖీలు చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏడీఏ మోహన్ రావు, ఏఓ కిషోర్

స్పాడ్‌పై స్పెషల్ డ్రైవ్

- ఎల్‌పీ, ఏఎల్‌పీ, ట్రాక్ మెషీన్, టవర్ వ్యాగన్ ఆపరేటర్లకు కౌన్సెలింగ్
- క్యూ డ్రైవింగ్ విధానంపై నిశితంగా పరిశీలన

గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైల్వేలో సిగ్నల్ పాస్ ఎట్ డేంజర్(స్పాడ్)పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నుంచి జారీ అయిన ఆదేశాల మేరకు గుంటూరు రైల్వే డివిజన్ వ్యాప్తంగా చర్యలు చేపట్టారు. 15 రోజుల పాటు ఈ స్పెషల్ సేఫ్టీ డ్రైవ్‌ని కొనసాగించనున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. ప్రధాన రైల్వేస్టేషన్లలో ఉన్న క్రూ లాబీలు, ట్రాక్ మెషీన్, టవర్ వ్యాగన్ డిపోలలో ఈ డ్రైవ్ కొనసాగుతుంది. ఇందుకోసం లోకో ఇన్‌స్పెక్టర్లు, సేఫ్టీ కౌన్సెలర్లకు బాధ్యతలు కేటాయించింది. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ప్రత్యేక డ్రైవ్ 17వ తేదీ వరకు కొనసాగుతుంది. లోకో పైలట్లు పరిమితికి మించిన వేగంతో రైళ్లను నడపకుండా తగిన చర్యలు చేపడతారు.

స్పాడ్ కేసులు రైల్వేలో నమోదైతే తక్షణమే లోకో పైలట్, అసిస్టెంట్ లోకో పైలట్‌లను సస్పెన్షన్ చేస్తారు. రైలుని కూడా నిలిపేసి వేరే క్రూ సిబ్బందిని పంపిస్తారు. రైలు బయలుదేరిన తర్వాత సిగ్నల్ పాస్ ఎట్ డేంజర్‌కు కారకులైన ఎల్‌పీ, ఏఎల్‌పీపై విచారణ జరుపుతారు. స్పాడ్ కేసుల వలన రైలు ప్రమాదాలు జరిగే ఆస్కారం కూడా ఉన్నది. ఈ నేపథ్యంలో స్పాడ్ కేసులు నమోదు కాకుండా తరచుగా క్రూ సిబ్బందికి కౌన్సెలింగ్ నిర్వహిస్తుంటారు. డ్యూటీకి వెళ్లే ముందు కూడా జాబ్‌చార్టు ప్రకారం బ్రీత్ ఎనలైజర్ తదితర పరీక్షలు కూడా నిర్వహిస్తారు. డ్రైవింగ్ ప్రాక్టీసు తనిఖీలో భాగంగా ఎల్‌పీ, ఏఎల్‌పీ, డబ్ల్యూవో, టీఎంవోలు పసుపు రంగు సిగ్నల్ ఉండగా ట్రైన్‌ని కంట్రోల్ ఎలా చేస్తున్నారు, రెడ్ సిగ్నల్ పడి ఉన్నప్పుడు ట్రైన్‌ని నిలిపేందుకు నియంత్రణ కలిగివున్నారా ఆటోమేటిక్ బ్లాక్ సిస్టమ్‌లో నియంత్రణతో డ్రైవింగ్ చేస్తున్నారా, లేదా అనేది పరిశీలిస్తారు. వేగ నిరోధకాలకు సంబంధించి అన్ని నిబంధనలు, కాషన్ ఆర్డర్స్ పాటిస్తున్నారా అనేది గమనిస్తారు. వివిధ రకాల మోతాదులకు క్రూ అప్లై చేస్తున్న బ్రేకింగ్ టెక్నిక్‌ని పరిశీలిస్తారు.

రైల్వే శాఖ జారీ చేస్తున్న సర్క్యులర్లపై ఎల్‌పీ, ఏఎల్‌పీలు స్పష్టమైన అవగాహన కలిగివుంటున్నారా అనేది కూడా చూస్తారు. సిగ్నల్ ఎక్స్ఛేంజ్‌ని సక్రమంగా చేస్తున్నారా, ఎమర్జెన్సీ బ్రేకుపై ఏఎల్ఎపీ ఒక చేయిని ఉంచుతున్నారా, లేదా అని నిశితంగా గమనిస్తారు. డ్యూటీలో ఉన్నప్పుడు సెల్‌ఫోన్లను స్విచ్ ఆఫ్ చేశారా, లేదా అనేది కూడా తనిఖీ చేస్తారు. డ్రైవల్‌లో భాగంగా గుర్తించిన లోపాలు, నిబంధనల ఉల్లంఘనలపై తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. రైల్వేబోర్డుకు నిత్యం తీసుకొన్న చర్యలపై నివేదికలు పంపనున్నారు.

భూ ధారాదత్తంపై యరపతినేని లేఖాస్త్రం



తుమ్మల చెరువు టోల్ ప్లాజా

- రూ.2 కోట్ల విలువైన భూమి కారుచౌకగా ధారాదత్తం
- నామ్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేటాయిస్తూ గత ప్రభుత్వం జీఓ
- వైసీపీ ఎంపీ అడిగారని జడ్పీకి తెలియకుండానే బదలాయింపు
- జీఓ రద్దు చేయాలని ఎమ్మెల్యే యరపతినేని ప్రభుత్వానికి లేఖ





గుంటూరు సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైసీపీ నేతల భూ అక్రమణలు ప్రస్తుతం వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా వైసీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి చొరవతో రూ.2 కోట్ల విలువైన జడ్పీ స్థలాన్ని నామ్ (నార్కెట్ పల్లి - అద్దంకి - మేదరమెట్ల) ఎక్స్ ప్రెస్‌వేకు కట్టబెడుతూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అసలు విషయంలోకి వెళితే.. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు చెట్టు సమీపంలో నామ్ ఎక్స్‌ప్రెస్‌వేకి చెందిన టోల్ ప్లాజా ఉంది. ఇక్కడ సర్వే నంబరు 251లో జిల్లా పరిషత్‌కు చెందిన భూమిలో టోల్ ప్లాజాకు చెందిన షెడ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 2.71 ఎకరాల భూమికి 2013 నుంచి అద్దె చెల్లిస్తూ వచ్చారు. 2018 తరవాత అద్దె చెల్లింపులు ఒక్కసారిగా నిలిపివేశారు. జడ్పీ అధికారులు ఎన్ని లేఖలు రాసినా నామ్ ఎక్స్‌ప్రెస్ వే యాజమాన్యం స్పందించలేదు. సు మారు రూ.12.64 లక్షల అద్దె బకాయి ఉన్నట్లు చెబుతున్నారు.

అధికారం అడ్డం పెట్టుకొని...

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామ్ ఎక్స్‌ప్రెస్ వే సంస్థ ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. బహిరంగ మార్కెట్‌లో రూ.2 కోట్లు పైనే ఉన్న జడ్పీ భూమిని కారుచౌక ధరకు తీసుకునేందుకు ప్రయత్నాలు ఆరంభం అయ్యాయి. హక్కుదారుగా జడ్పీని పూర్తిగా పక్కన పెట్టేసి ఆర్అండ్‌బీ శాఖను లైన్‌లోకి తెచ్చారు. 2023 మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.9.50 లక్షలు చెల్లించే విధంగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. దీంతో వైసీపీ ప్రభుత్వం జడ్పీ భూమిని నామ్ వే ఎక్స్‌ప్రెస్‌కు కేటాయిస్తూ జీవో నంబరు 76 ను 2023 ఫిబ్రవరి 21న జారీ చేసింది.

నిబంధనలకు నీళ్లు

ఏదైనా ప్రభుత్వ భూమిని ప్రయివేట్ వ్యక్తులకు బదలాయించాలంటే.. హక్కుదారుగా ఉన్న ప్రభుత్వ శాఖ అనుమతి తీసుకోవాలి. ఒక వేళ భూమి విలువ రూ.2 లక్షలు పైన ఉంటే రాష్ట్ర మంత్రి మండలిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని జీఓ నంబరు 323 చెబుతోంది. తుమ్మల చెరువు భూమి వ్యవహారంలో అటువంటిది ఏమీ జరగలేదు. అయోధ్య రామిరెడ్డి అడిగారు.. రాసి ఇచ్చేశారు అన్నట్లుగా తంతు జరిగిపోయింది.

2024 లో వెలుగులోకి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తుమ్మల చెరువు భూమిపై చర్చ జరిగింది. గత సెప్టెంబరులో జరిగిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో పిడుగురాళ్ల జడ్పీటీసీ సభ్యుడు జంగా కోటయ్య ఈ విషయం లేవనెత్తారు. అంతకు ముందు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఎంపీ అయోధ్య రామిరెడ్డి చేసిన అడ్డగోలు భూ దందాను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. జడ్పీ అనుమతి లేకుండా నే జారీ అయిన జీవోను రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభుత్వానికి లేఖ రాయడం హాట్ టాపిక్ గా మారింది.

యరపతినేని లేఖ

తుమ్మల చెరువు భూమి వ్యవహారంపై గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సీరియస్‌గా దృష్టి సారించారు. జడ్పీ స్థలాన్ని బదలాయిస్తూ..తీసుకొచ్చిన జీవో నంబరు 76 రద్దు కోసం ఆయన ప్రభుత్వానికి లేఖ రాసినట్లుగా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇటు జడ్పీ పాలక వర్గం కూడా ఈ విషయంలో సీరియస్‌గా ఉంది. శుక్రవారం జరిగిన సమావేశంలో కూడా ఈ విషయాన్ని అజెండాలో చేర్చారు.

సమాజాన్ని చైతన్యపరిచే శక్తి కళారంగానిదే

● మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ రాజకుమారి

● తెనాలిలో ఆహ్వాన నాటికల పోటీలు ప్రారంభం



సారీ రాంగ్ నెంబర్ నాటికలోని సన్నివేశం

తెనాలి అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సమాజాన్ని చైతన్యపరిచే శక్తి కళారంగానికే ఉంటుందని మహిళ కమిషన్ మాజీ చైర్పర్సన్ నన్నపనేని రాజకుమారి పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మూడు రోజుల రాష్ట్రస్థాయి ద్వితీయ ఆహ్వాన నాటికల పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. రోటరీ కళా పరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న పోటీలను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ. కళలకు, కళాకారులకు నిలయమైన తెనాలి ప్రాంతంలో రంగ స్థలాన్ని ఆదరిస్తున్న, ప్రోత్సహిస్తున్న వారిని అబినందించారు. కాకతీయ సొసైటీ అధ్యక్షుడు డీఎల్ కాంతారావు, కళాకారుల సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, ఈదర వెంకట పూర్ణచంద్, ఈదర శ్రీనివాసరావు, అయినాల మల్లేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వరరావు, వేమూరి విజయభాస్కర్ పాల్గొన్నారు. అనంతరం ఏలూరు హేలపురి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించిన సారీ రాంగ్ నెంబర్ నాటిక ప్రేక్షకులను ఆక ట్టుకుంది. చింతల మల్లేశ్వరరావు రచించిన నాటికకు కాజావలి దర్శకత్వం వహించారు. హైదరాబాద్ కళాంజలి కళాకారులు వీడేం మగాడండీ హాస్యనాటిక ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించింది. మాధవ్ రచించిన నాటికకు కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు. ఆదివారం సాయంత్రం పలు నాటికలు ప్రదర్శించనున్నారు. పరిషత్ ప్రతినిధులు నల్లూరి వెంకటేశ్వరరావు, జీవీ నారాయణ పర్యవేక్షించారు.

నల్లపాటికి ఘన నివాళి





నల్లపాటి భౌతిక కాయన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే యరపతినేని

నరసరావుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జీడీసీసీబీ మాజీ చైర్మన్ నల్లపాటి శివరామచంద్ర శేఖరరావుకు శనివారం నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద బాబు, భాష్యం ప్రవీణ్, జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్ చదలవాడ ఆదిత్యా, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుదీర్‌బార్గవ్‌రెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, కాకుమాను పెదపేరిరెడ్డి, నాగసరపు సుబ్బరాయగుప్తా, కపిలవాయి విజయకు మార్, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు వై.చెంచయ్య, కాసా రాంబాబు తదితరులు నల్లపాటి భౌతికాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు రామచంద్ర ప్రసాదు, వంశీ మోహన్‌కు ప్రగాడ సానుభూతి తెలిపారు.

'బంగారు' బాపట్ల !

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. ఇందులో డీఆర్డీఏ విభాగం కీలకంగా పనిచేస్తోంది. మార్గదర్శకుల ద్వారా కేవలం ఆర్థిక సాయం మీదే దృష్టి పెట్టకుండా కెరీర్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన, బ్యాంకుల ద్వారా రుణాలను వీలైనన్నీ ఎక్కువ మార్గాల ద్వారా బంగారు కుటుంబాలకు చేయూత అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఎక్కువగా డీఆర్డీఏ విభాగంతో అనుసంధానమై ఉన్నాయి. దీంతో అర్హత ఉన్న పేద కుటుంబాలకు తొలుత సంక్షేమం పక్కాగా అందించడానికి యంత్రాంగం ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగానే జిల్లా అధికారి మొదలుకుని మండల స్థాయిలోని డీఆర్డీఏ యంత్రాంగాన్ని పీ-4లో భాగస్వాములుగా చేశారు.

అమలులో అప్రమత్తంగా ఉండాలి

నిరుపేదల మేలు కోసమే పీ-4ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్నవారు కూడా బంగారు కుటుంబాల జాబితాలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించడమో.. స్థానికంగా ఉండే అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల ద్వారా పీ4 ద్వారా ఆయాచిత లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఈ ఫలాలు అర్హులకే అందాలంటే.. బంగారు కుటుంబాల ఎంపికలో యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



రైతులు తెచ్చిన పొగాకును పరిశీలిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మార్కెట్ యార్డులోని మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పండుటాకు పొగాకును కొనుగోలు చేయడం లేదని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు చేసిన ఫిర్యాదును వారు పరిశీలించారు. మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావుకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. పండుటాకుకు కనీసం రూ.4 వేలు మద్దతు ధరగా నిర్ణయించి, తిరస్కరణ లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. రైతులు రూ.5 వేలు మద్దతు ధర కోరుతున్నారని కూడా తెలిపారు. సానుకూల ఆదేశాలు రాకపోతే, ముఖ్యమంత్రి దృష్టికి మరోసారి తీసుకెళ్తామని ఎంపీ, ఎమ్మెల్యే రైతులకు చెప్పారు.

పొన్నెకల్లులో.. రైతుల నిరసన సెగ

● గో బ్యాక్.. అంటూ నినాదాలు

● గ్రామ సభను తాత్కాలికంగా రద్దు చేసిన అధికారులు



పొన్నెకల్లులో గ్రామ సభను రద్దు చేయాలని గోబ్యాక్ అంటు నినాదాలు చేస్తున్న రైతులు

తాడికొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని పొన్నెకల్లు గ్రామ రైతులు తేల్చి చెప్పారు. గ్రామ సభను రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేసి అధికారులను, ఎమ్మెల్యేను గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. శనివారం గుంటూరు జిల్లా తాడికొండ మండలం గరికపాడు, పొన్నెకల్లు, నిడుముక్కల గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ రెండవ ఫేజ్‌కు సంబంధించి గ్రామ సభలు నిర్వహించారు. పొన్నెకల్లు గ్రామంలో నిర్వహించిన గ్రామసభను రద్దు చేయాలని రైతులు ఆందోళనలు చేపట్టారు. గరికపాడులో గ్రామ సభను ముగించుకొని పొన్నెకల్లు చేరుకున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, ఇతర అధికారులు స్టేజ్‌పైకి వెళ్లగానే రైతులు ఒక్కసారిగా స్టేజ్ వద్దకు వచ్చి గో బ్యాక్.. గో బ్యాక్ అంటు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చేది లేదని రైతులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. రాజధాని నిర్మాణానికి భూములు త్యాగం చేసిన 29 వేల రైతుల పరిస్థితి గడిచిన ఐదు సంవత్సరాల్లో ఏమి జరిగిందో చూశామని.. తిరిగి ఆ తప్పు చేయదలుచుకోలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలో రైతులు పట్టువీడకుండా నినాదాలు చేశారు. దీంతో చేసేది ఏమిలేక ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవోలు స్టేజి దిగి వెళ్లిపోయారు. తాత్కాలికంగా గ్రామసభను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. అనంతరం నిడుముక్కలలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిలో భాగంగా రైతులను భాగస్వామ్యం చేయాలని సీఎం చంద్రబాబునాయుడు ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం దగ్గర కావాల్సినంత మిగులు భూమి లేదన్నారు. భూములు ఇస్తేనే పెట్టుబడిదారులు సంస్థల ఏర్పాటుకు ముందుకు వస్తారన్నారు. సంస్థల స్థాపన జరిగితేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. కౌలు ఎకరానికి రూ. 30 వేలకు బదులు రూ. 60 వేలు, రూ. 50 వేలకు బదులు రూ. లక్ష, రోడ్డు పక్కల పొలాలు ఉన్నవారికి అభివృద్ధి చేసిన ప్లాట్లను కూడా రోడ్డు పక్కనే ఇవ్వాలని, పౌల్ట్రీ ఫాంల యజమానులకు మెరుగైన ప్యాకేజీని ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. గ్రామ సభలను వ్యతిరేకించటం వలన రైతులు నష్టపోతారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. గ్రామ సభలో రైతులు వెల్లడించిన ప్రతి అంశాన్ని నోట్ చేసుకొని సీఎంకు తెలియజేస్తామన్నారు. అనంతరం నిడుముక్కల గ్రామంలో సభను నిర్వహించారు. రైతులు ల్యాండ్ పూలింగ్‌లో భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కాని మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలని, కౌలు పెంచి ఇవ్వాలని, తమకు నచ్చినచోట ప్లాట్లు ఇవ్వాలని కోరారు.

నెమలిపురం మార్గంలో స్లీపర్ క్లాస్‌కే డిమాండ్

● ఏసీ బెర్తుల్లో 90 శాతానికి పైగా ఖాళీ

గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో కొత్తగా ప్రయాణికుల రైళ్ల ట్రాఫిక్‌కు ప్రారంభించిన పిడుగురాళ్ల - నెమలిపురి - రొంపిచర్ల - వినుకొండ - నంద్యాల మార్గంలో స్లీపర్‌క్లాస్ బెర్తులకే ఆదరణ లభించింది. ఈ మార్గంలో నడిచిన ప్రథమ సర్వీసులకు ఏసీ తరగతుల్లో ప్రయాణించేందుకు ప్యాసింజర్లు ఆసక్తి చూపించలేదు. దీంతో ఏసీ బోగీలు దాదాపుగా 90 శాతం పైగా ఖాళీగా కనిపించాయి. అయితే రాబోయే రోజుల్లో ఏసీ తరగతులకు కూడా డిమాండ్ పెరిగే అవకాశం ఉందని వివిధ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. 07190 తిరుపతి - నాందేడ్ స్పెషల్ ట్రైన్ రైలు బయలుదేరడానికి కొద్ది ముందుగా రెండో చార్టు సిద్ధమయ్యేనాటికి స్లీపర్‌క్లాస్‌లో బెర్తులు దాదాపుగా బుకింగ్ అయ్యాయి. ఈ రైలుకు స్లీపర్ క్లాస్ బోగీలు ఏడు ఉండగా బెర్తులు 560 అందుబాటులో ఉంచారు. వాటిల్లో 14 మినహా అన్ని బుకింగ్ కావడంతో భర్తీ శాతం 97.50గా నమోదైంది. ఏసీ త్రీటైర్‌లో ఆరు బోగీలుండగా 432 బెర్తులు అందుబాటు లోకి తీసుకొచ్చారు. అయితే వాటిల్లో కేవలం 41 మాత్రమే బుకింగ్ కాగా 391 ఖాళీగా ఉన్నాయి. త్రీటైర్‌లో బెర్తుల భర్తీ శాతం 9.49గా నమోదైంది. ఏసీ టూటైర్‌లో మూడు బోగీ లుండగా 156 బెర్తులు అందుబాటులో ఉంచారు. వాటిల్లో కేవలం 16 మాత్రమే బుకింగ్ అయ్యాయి. 140 ఖాళీగా ఉండ టంతో భర్తీ శాతం 10.26గా ఉంది. చాలామంది ప్రయాణికులకు ఈ రైలు గురించి సరైన సమాచారం లేదని రైల్వేవర్గాలు అంటున్నాయి. వచ్చే వారం నుంచి ఆదరణ పెరిగే అవకాశం ఉందని, ఈ రైలు ఆదివారం తిరుపతి నుంచి నాందేడ్‌కు నడిపితే డిమాండ్ పెరగొచ్చని చెబుతున్నాయి.

170 పాఠశాలలు.. జీరో అడ్మిషన్!

(5వ పేజీ తరువాయి)

పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఏటా విద్యాశాఖ అనేక కార్యక్ర మాలు నిర్వహిస్తోంది. పాఠశాలలు ప్రారంభించడానికి పది రోజుల ముందే బడిబాట పేరుతో తల్లిదండ్రులని ఉపాధ్యాయులు కలిసి.. అడ్మిషన్ల కోసం తమ వంతు కృషి చేసేవారు. ఈ ఏడాది బదిలీల షెడ్యూల్ కారణంగా అనేకమంది ఉ పాధ్యాయులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొం ది. ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించలేదు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు భారీగా తగ్గిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

తల్లికి వందనం నగదే..ప్రైవేట్ స్కూళ్ల ఫీజు..

ప్రైవేట్ పాఠశాలల పీఆర్వోలు(ప్రజా సంబంధాల అధికారులు) గ్రామ స్థాయికి చేరి విద్యార్థులను తమ స్కూళ్లలో చేర్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మారుమూల గ్రామాలకు కూడా బస్సులను, ఆ టోలను పంపించి విద్యార్థు లను తరలిస్తున్నారు. ఫీజులు కూడా మొదట్లోనే.. పెద్ద మొ త్తంలో వసూలు చేయకుండా ప్రభుత్వమిచ్చిన తల్లికి వంద నం డబ్బులను మాత్రమే ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆ నగ దును ప్రైవేటు పాఠశాలలకు చెల్లించి.. తమ పిల్లల్ని అక్కడ చేర్పిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ స్పందించకుంటే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రాజధాని నిర్మాణ పనులకు.. కృష్ణానది ఇసుక

తుళ్లూరు, జులై 5(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణ పనులకు కృష్ణా నది నుంచే ఇసుకను డ్రెడ్జింగ్ చేసి అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు శనివారం సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 50వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో నిర్ణయించారు. రాజధాని ప్రాంతం తుళ్లూరు మండలంలో రాయపూడి, ఉద్దండ్రాయునిపాలెం, లింగాయపాలెం, తాళ్లాయపాలెం ప్రదేశాల్లో డ్రెడ్జింగ్ చేసుకుని ఇసుకను తీసుకోవటానికి అవకాశాలున్నాయి. ఇప్పటికే టెండర్లు దక్కించుకొని.. పనులు మొదలు పెట్టిన నిర్మాణ కంపెనీలకు ఇసుక కొరత లేకుండా చూడాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రూ.49,040 కోట్ల విలువైన పనులు జరుగుతున్న రీత్యా రానున్న రెండేళ్లలో వివిధ ప్రాజెక్టులకు 160 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమం అవుతుందని సీఆర్డీఏ అంచనా వేసింది. ప్రకాశం బ్యారేజీ ఎగువన ఉన్న తుళ్లూరు మండలంలో రీచ్‌ల నుంచి ఇసుక తరలింపునకు అనుమతినివ్వాలని జలవనరుల శాఖను సీఆర్డీఏ కోరింది. రెండేళ్ల పాటు రాజధాని ప్రాజెక్టులకు అవసరమైన ఇసుకను తవ్వుకునేందుకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. ఇసుక డీసీల్టేషన్ పక్రియకు రూ.286 కోట్లు మేర వ్యయం కానునన్నట్లు అథారిటీ సమావేశంలో అధికారులు తెలిపారు.

చర్లపల్లి - సిల్చార్ ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కోటా సవరణ

గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి శనివారం గుం టూరు మీదగా ప్రయాణించే 12513 చర్లపల్లి - సిల్చార్స్ సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కోటాని రైల్వే శాఖ సవరించింది. ఈ రైలుకు జనరల్ కోటాలో ఏసీ టూటైర్‌కు గతం లో ఐదు ఉంటే ఇప్పుడు 41కి పెంచారు. ఏసీ త్రీటైర్ 34 బెర్తు లను 124కి, ఏసీ త్రీటైర్ ఎకానమి 16 నుంచి 75కు, స్లీపర్ క్లాస్‌ని 15 నుంచి 234కి పెంచారు. దీంతో ఈ రైలుకు జనరల్ కోటాలో బెర్తులు పుష్కలంగా అందుబాటులో ఉంటాయి.

మాజీ ఎమ్మెల్యే రోశయ్యకు కార్పొరేషన్ శ్రీముఖం

● 8న కమిషనర్ ఎదుట హాజరు కావాలని ఆదేశం

గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత కిలారి వెంకట రోశయ్యకు నగరపాలక సంస్థ శ్రీముఖం జారీ చేసింది. ఆయనతో పాటు అనుచరులకు కూడా ఈ నోటీసుని పంపింది. మిర్చి యార్డుకు సమీపంలో సర్వే నంబరు 178సీ/ఏబీ1లో 1.23 ఎకరాల తమ భూమిని కిలారి రోశయ్య ఆక్రమించుకొన్నారని గుమ్మడి భారతి అనే వితంతువు నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అందులో అక్రమ నిర్మాణాలు, ప్రహరీ నిర్మిస్తున్నారన్నారు. ఈ ఆస్తికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ని కూడా ఆమె కమిషనర్‌కు నివేదించారు. ఉదయం 11గంటలకు నగరపాలక సంస్థ కమిషనర్ కార్యాలయంలో విచారణ నిర్వహించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు నిర్ణయించారు. ఫిర్యాదిదారు కూడా సంబంధిత డాక్యుమెంట్‌లతో విచారణకు హాజరు కావాలన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రభాకర్, తేజస్విని, అన్వేష్‌కుమార్

గోరంట్లలో నేడు మెగా వైద్యశిబిరం

● ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ చైర్మన్ దేగల వెల్లడి

గుంటూరు మెడికల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సామాన్యు మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ చైర్మన్ దేగల ప్రభాకర్ తెలిపారు. శనివారం నాజ్ సెంటర్‌లోని ఆంధ్రప్రైమ్ హాస్పిటల్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల ఆరున గోరంట్ల రామాలయం గుడి వద్ద గల వీమార్ట్ సెంటర్‌లో వైద్యశిబిరం నిర్వహిస్తారని ప్రభాకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు జరిగే ఈ మెగా వైద్యశిబిరంలో గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తుల సమస్యలతో పాటు జనరల్ సమస్యలపై ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యశిబిరానికి సంబంధించి పిన్ బ్రోచర్లను వైద్యులతో కలసి దేగల ప్రభాకర్ ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్ తేజస్విని, డాక్టర్ అన్వేష్‌కుమార్, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్ అండ్ జేసీలో ముగిసిన సదస్సు

గుంటూరు (విద్య), జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజులుగా జరుగుతున్న 'ఐడియా, డిజైన్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్' ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం ముగిసింది. గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో భారత్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా ఎంచుకోవాలని, అందుకు అవసరమైన నూతన ఆవిష్కరణలను రూపొందించేందుకు తగిన శిక్షణను విద్యార్థులకు అందించేందుకు అధ్యాపకులు సిద్ధంగా ఉండాలని కర్ణాటక - నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, అసోసియేట్ ప్రొఫెసర్ వాద్వాని ఫౌండేషన్ గ్లోబల్ జ్యూరీ మెంబర్ డాక్టర్ కే సుప్రభా అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ కే రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ ఎన్‌వీ శ్రీనివాసరావు, ప్రధాన పరిశోధకులు డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖరరావు, ఇన్క్యూబేషన్ మేనేజర్ డాక్టర్ కే షో, డాక్టర్ అబ్ హఫీజ్ బాషా, కో-ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ సజ్జా రాధిక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు

15న జిల్లా జూనియర్ అథ్లెటిక్ జట్టు ఎంపికలు

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 15న ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో సింథటిక్ ట్రాక్‌లో జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికైన జట్టు ఆగస్టులో బాపట్లలో జరిగే ఏపీ స్టేట్ జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తీసుకొని అదేరోజు ఉదయం 9గంటలకు సింథటిక్ ట్రాక్ వద్ద రిపోర్టు చేయాలన్నారు.

NOTICE

IN THE COURT OF THE II ADDL. DISTRICT JUDGE :: GUNTUR

A.S No. 249 / 2019

Between:
Kadiri Bala Kullayi Reddy, S/o.Gangi Reddy. ...Appellant
And
Ankireddy Rajya Lakshmi & Others. ...Respondents

To,
R-1:Ankireddy Rajya Lakshmi, W/o. Sivaiah, D/o.Veeraiah,
R-2:Dalavayi Vijaya Lakshmi, W/o. Venkateswarlu, D/o. Veeraiah,
R-3:Mekala Vijaya Lakshmi, D/o. Veeraiah,
R-6:Mekala Prasanthi,D/o.Koteswara Rao,
R-7:Mekala Siva Kumari, W/o. Hari Babu, All are R/o. D.No. 16-2-19, Chandra Nagar Colony, Muthukumallivari Street, Near Janda Chettu, Old Guntur, Guntur.

పైనెంబరు అప్పీలు దావాలో రెస్పాండెంట్స్ అయిన మీకు నోటీసులు ఈపేపరు ప్రకటనద్వారా తెలియజేయమని **ది.29-07-2025**కి వాయిదా వేసినారు. కావున వాయిదారోజు **ఉ.గం.10-30ని.**లకు పై కోర్టులో హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

చాగంటి రఘురామి రెడ్డి, అప్పీలెంటు తరపు న్యాయవాది, 7/4 అరండల్ పేట, సెల్ : 9848365050

నేడు పికిల్ బాల్ జిల్లా స్థాయి పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): వీవీ హెల్త్ హబ్ గుంటూరు ఆధ్వర్యంలో ఆదివారం జేకేసీ కళాశాల రోడ్డులోని, పికిల్ బాల్ కోర్టులో ఆదివారం ఓపెన్, అండర్-14 మిక్సిడ్ విభాగంలో జిల్లా స్థాయి పికిల్ బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు హెల్త్ హబ్ డైరెక్టర్ టీ అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు.

GENERAL NOTICE

IN THE COURT OF THE I ADDL CIVIL JUDGE (SENIOR DIVISION) :: GUNTUR

I.P No: 21 / 2025

BETWEEN :
Lingisetty Veeraiah S/o.Late Peda Raghavaiah, R/o.Door No: 26-22-14/A,Maseed Lane,Vaddegudem,Nagaramplaem,Guntur. ...Petitioner
and
1)Vudutha Nagamaleswarao,S/o.Vudutha Suubbarao,R/o.Eluru Bazar,Near Ramalayam,Guntur,2)NisankaraVasu,S/o.Nisankara Shankar Rao,R/o.Sri Vijaya Naga Maleswari Traders,Hazari variveedhi,Guntur,3)Yerram Bhupal Reddy,S/o.Brahma Reddy,R/o. GT Road,Above MRFShop, Opp. Mastani Dharga, Guntur, 4)Sunkara Ankammarao,S/o.Mastanrao Sunkara,R/o.104-6-595,Etukuru (V),Guntur, 5)Medisetty Raviteja @ Boby, S/o. Ankammarao, R/o. 104-6-595, Etukuru Village, Guntur,6) Bude Ankammarao, S/o. Anjaneyulu, R/o.104-6-256,Etukuru(V),Guntur,7)Gunda Pavan Tejasri,S/o. Venkata Jagan Mohan Rao,R/o.Ramanna Peta 1st line, Guntur, 8) Gunda Venkata Jagan Mohan Rao,S/o.Chinna Balaiah, R/o.Ramanna Peta 1st line, Guntur,9)Nallaka Srinu, S/o. Sitharamaiah, R/o.Kondepu Nageswarao Shop,VGT Building, Behind Lalapet police station, Guntur, 10)Murikipudi Raja, S/o. Siva Prasad rao, R/o.Vasavi jewelers, Beside Bharath Cafe, Guntur,11)Tirumalasetty Tirupathamma,W/o. Kondalu,R/o.Chagantivaripalem, Narasarapet,Palnadu Dt.,12) Pasupuleti Padma, W/o.Kotaiah, R/o.Chaganti Varipalem, Narasaraopet, Palnadu Dt., 13)Yenumula Lakshmi, W/o. Sithaiah, R/o. Chagantivaripalem, Narasaraopet, Palnadu Dt.,14)Pasupuleti Appaya S/o.Kotaiah,R/o.Chagantivaripalem,Narasaraopet, Palnadu Dt., 15) Akula Srinu,S/o.Not Known,R/o.Surya sai traders,Near Ethu Road, Opp.HP petrol Bunk,Guntur,16)Vaka Narasimha,S/o.Not Known, R/o. Vaka Narapa Reddy,Bandla Bazar,onion shop,Guntur,17)CH Mallikarjuna Reddy,S/o.Not Known,C/o.Gopala krishnarao, Patnambazar, Pasupuleti Gopaiah Complex, Guntur, 18)Thiyagura. Srinivas Reddy,S/o.Not Known,R/o.Commission Shop : Ankammathali Traders,EthuRoad,Opposite Hp Petrol Bunk,Guntur,19)Gopu Srinivas Reddy, S/o.Not Known,R/o. Sri Vijaya Bhaskar Traders, Near Market, Cheparalavedhi,Beside RMK Complex,Guntur,20)Thimmisetty Venkat Rao,S/o.Not Known,R/o.VGT Building, Lalapet, Guntur, 21) Tallam Hanumanth Rao, S/o.Not Known,R/o.Ramanamashektram 2nd line,Opp.Vinayaka temple, Guntur,22)Narasimha Rao,S/o.Not Known, R/o.Medical shop,Ramanamashketram 3rd line,Guntur, 23) Vishnumolakala Venkata Krishnaiah,S/o.Not Known,R/o.Medical shop, Ramanamashketram 3rd line, Guntur, 24)Kanjula Raja Gopal reddy, /o.Not Known, R/o.Kanjula Raja Gopal Reddy shop, Ethu Road, Opp.HP Petrol Bunk,Guntur,25)Bhushanam,S/o.Not Known, R/o. Udaya Bhaskar traders Sampath Nagar Main Road,Guntur, 26) Kurapati.Srinivas Rao,S/o.Not Known,R/o.Eluru Bazar,Near Rama Layam, Guntur,27)Hanamanth Rao, S/o. Not Known, R/o.Commission Shop:Kantheru,Ethuroad,Guntur,28)Kamineni Venkateswara Rao, S/o.Not Known, R/o. Commission Shop:Kamineni.Venkateswara Rao, Opposite Reddy College,Near Mirchi Yard,Guntur,29)Kanjula. Sivaram,S/o.Not Known,R/o.Near Ethu road,Opposite petrol Bunk, Guntur,30)Palaparthi Madhav Reddy, S/o. Not Known,R/o. Sri Vatsava chillies,GT road,Near Mastani Dharga,Guntur, 31)Dadi Sivanjaneyulu, S/o.Lakshmaiah, R/o.D.No:81-17-1576, Nallacheruvu, 16th Line, Guntur,32)The Official Receiver, Guntur, Guntur Court complex, Guntur Dist. ....Respondents

పై నెంబరు ఐ.పి.లోని పిటీషనరు తనను ఇన్ సాల్వెంట్‌గా డిక్లేర్‌చేయమని దాఖలుచేయగా సదరు పిటీషన్‌పై ఎవరికైన అభ్యంతరములు ఉంటే తెలుపుకొనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసు నిమిత్తం **ది:15-07-2025**కి వాయిదావేసినారు. కావున ఆరోజున **ఉ॥గం॥10:30ని॥**లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీతరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్ష మున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు). వాయిదా తేది: **15-07-2025.**

మంత్రి సాయి ప్రవీణ్ కుమార్, గొట్టిపాటి సాంబశివరావు ఆనంద కుమార్ బిళ్ళా, అడ్వకేట్స్, గుంటూరు, 8019787611

డ్రెయిన్లలో పూడికతీత పనులు పక్కాగా నిర్వహించాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన మేజర్, మైనర్ డ్రైన్లలో చేపట్టిన పూడికతీత పనులు పక్కాగా జరగాలని, పనులకు ముందు, అనంతరం ఫోటోలతో రిపోర్ట్ ఇవ్వాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మేజర్, మైనర్ డ్రెయిన్లలో పూడికతీత పనులపై ప్రత్యేక దృష్టి సారించామని, రానున్న వర్షాకాలంలో ఎక్కడైనా డ్రెయిన్లలో నీరు వెళ్లకుండా రోడ్ల మీద నిలిస్తే సంబంధిత ఇంజనీరింగ్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏఈ కార్యాలయాల్లో ఉన్న ఆపరేటర్లు సోమవారం నుంచి జీఎంసీ ప్రధాన కార్యాలయం కేంద్రంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్‌కుమార్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, మేనేజర్ బాలాజీ బాషా, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

రేపు కార్పొరేషన్‌లో స్టేక్‌హోల్డర్లతో సమావేశం..

నగరంలో ఆహ్లాదకరమైన హరిత వాతావరణం అందించడానికి మిషన్ గ్రీన్ అమలు, వీధి వ్యాపారులకు జోన్ల ఏర్పాటు అంశాలపై స్టేక్ హోల్డర్లు, సీనియర్ సిటిజన్స్ సూచనలు, సలహాల కోసం ఈనెల 7వ తేదీ(సోమవారం) మధ్యాహ్నం 3.30 గంటలకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని, నగరంలోని స్టేక్ హోల్డర్స్, సీనియర్ సిటిజన్స్ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సమావేశానికి హాజరై తమ సూచనలు అందించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం : ఎస్పీ



ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి లతను మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ సులువైన మార్గమని ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశా రు. ఈ మేరకు శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని పుర స్కరించుకుని ఎస్పీ సతీష్‌కుమార్ జిల్లా కోర్టును సందర్శించారు. జిల్లా 5వ అదనపు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కోలారు లతని మర్యాదపూర్వకంగా కలిసి లోక్ అదాలత్‌లో పోలీస్‌శాఖ తరపున ప్రవేశ పెట్టే కేసుల పరిష్కారానికి సహకారం అందించాలని కోరారు.

పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

గుంటూరు సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పురోగతి సూచిక 2023-24పై శిక్షణ కార్యక్రమం శనివారం గుంటూరు జిల్లా పరి షత్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో సీఈవో వీ జ్యోతి బసు, జిల్లా పంచాయతీ అధికారి బీవీఎస్ సాయికుమార్, డ్వామా పీడీ శం కర్, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి పాల్గొన్నారు. పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన నూతన ప్రణాళికపై అధికారులు మాట్లాడారు.

తపాల ఉద్యోగులకు సేవా దివస్ పురస్కారాలు

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): గత నెల 25న విజయవాడలోని ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రాంతీయ పాస్‌పోర్ట్ సేవా దివస్ వేడుకల్లో గుంటూరు విభాగానికి చెందిన పోస్టల్ ఉద్యోగులకు ప్రతిష్టాత్మక పురస్కారాలు వరించాయి. గుంటూరు డివిజన్‌కు సూపరింటెండెంట్ యల్లమందయ్యకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్, పౌరసేవల కార్యనిర్వాహకుడు కరీముల్లా ఖాన్‌కు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ అవార్డులకు ఎంపికయ్యారు. విజయవాడ, డివిజినల్ రైల్వే మేనేజర్ నరేంద్రపాటిల్, ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష చేతుల మీదుగా ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డులు అందుకున్న వారిని తపాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

పని ఒత్తిడిని తగ్గించండి

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పోస్ట్ మ్యాన్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. వారాంతపు రోజుల్లో విధుల్లోకి రావా లంటూ అధికారుల ఆదేశాలను నిరసిస్తూ శనివారం చంద్రమౌళినగర్, తపాల కార్యాలయం వద్ద పోస్టమ్యాన్‌లు ధర్నా చేపట్టారు. గత ఏడాది కాలంలో సిబ్బందిని పూర్తిగా తగ్గించారని, ఆ విధులు కూడా మాకే కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి పోస్ట్‌మ్యాన్‌ల సంఖ్యను పెంచి, పనిభారం తగ్గించాలని కోరారు.

పెంపుడు కుక్కలు, పిల్లులకు నేడు ర్యాబిస్ టీకాలు

గుంటూరు సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పెంపుడు కుక్కలు, పిల్లులకు ర్యా బీస్ టీకాలు వేయనున్నట్లు పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం రత్న జ్యోతి తెలిపారు. గుంటూరులోని కొత్త పేట పాలీ క్లినిక్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ఆమె పేర్కొన్నారు.

శ్రీకృష్ణ తత్వమే భాగవతం

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీకృష్ణుడి అవతార లీలలు, కథలు ఆయన భక్తుల చరిత్రలు భాగవతం ద్వారా తెలుసుకోవచ్చునని ప్రవచనకర్త మంచి కంటి వెంకట సత్యవతి పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేట, ఓంకార క్షేత్రం ఆలయ ప్రాంగ ణంలో శ్రీమద్ భాగవత సప్తాహ జ్ఞాన యజ్ఞ మహోత్సవంలో భాగంగా రెండో రోజు భక్తులనుద్దేశించి సత్యవతి ప్రవచిస్తూ భాగవతం విన్నా, పారాయణం చేసినా సద్గతులు ప్రాప్తిస్తాయన్నారు. భక్తి వైరాగ్యాలను అనుభవ పూర్వకంగా సాధన చేస్తూ మోక్షమా ర్గం అందుకునే శాస్త్రం భాగవతమని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మల్లాది వెంకట కృష్ణమూర్తి, ఘంటసాల వీరకుమార్, ఎన్‌వీఎస్ నారాయణమూర్తి పాల్గొన్నారు.

అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలి : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక లిబర్టీ థియేటర్ వద్ద ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ల ప్రయోజనం కోసమే స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. అనంతరం విద్యుత్ స్మార్ట్ మీటర్లును పగలగొట్టి నిరసన వ్యక్తం చేశారు. ధర్నాలో కోటా మాల్యాద్రి, మేడా హనుమంతరావు, రావుల అంజిబాబు, అకిటి అరుణ్ కుమార్, మంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సహోద్యోగి కుటుంబానికి తోటి కానిస్టేబుళ్ల చేయూత

గుంటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మరణించిన సహోద్యోగి కుటుంబానికి తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు చేయూతనిచ్చారు. పోలీస్‌శాఖ తరపున ఆ కుటుంబానికి అందవలసిన అన్ని ప్రయోజనాలు సకాలంలో అందేవిధంగా కృషి చేస్తానని ఎస్పీ హామీ ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన తమ బ్యాచ్ కానిస్టేబుల్ కూచిపూడి. క్రాంతికుమార్ కుటుంబానికి ఉమ్మడి గుంటూరు జిల్లా 2012 బ్యాచ్‌కు చెందిన ఏఆర్ కానిస్టేబుళ్లు తమ వంతు ఆర్థిక సాయంగా రూ.లక్షా 35 వేల నగదును శనివారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీ చేతుల మీదుగా మృతుడి తండ్రి శాంసన్, సతీమణి కే ప్రవీణకు అందజేశారు.

సాయినాధునికి లక్ష మల్లెల అర్చన

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యానగర్, 3వ లైన్లోని శ్రీసాయి నాథ సన్నిదానంలో గురుపౌర్ణమి మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో జరుగుతున్నాయి. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం అర్చకులు సాయినాధునికి లక్ష మల్లె ల అర్చన చేశారు. వందలాది భక్తులు ఉత్సవాల్లో పాల్గొని సాయినాధున్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తొలి ఏకాదశి పురస్కరించుని ఆదివారం సాయి వ్రతాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలను సన్నిధానం గౌరవ అధ్యక్షుడు యడ్ల పాటి ఆశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య తదితరులు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శనివారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలుత ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రముఖ నాట్యాచార్యుడు, వేదాంతం సత్యనారసింహశాస్త్రి శిష్యబృందం సాయిశరణ్య శ్రీవైష్ణవి, శ్రీజా వైష్ణవిలు వినాయక కౌతంతో ప్రారంభించి పలు కీర్తనలకు కూచిపూడి నృ త్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమాన్ని ఏవీ బ్రహ్మాజి పర్యవేక్షించారు.



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి, కాంతారావు, గంగరాజు తదితరులు

వైభవంగా జగన్నాధస్వామి రథయాత్ర

గుంటూరు(తూర్పు), జూలై 5(ఆంధ్రజ్యోతి): గుంటూరులో జగన్నాధ స్వామి రథయాత్ర వైభవంగా జరిగింది. హరే కృష్ణా నామంతో నగరం మార్మోగింది. యాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవిత్రమైన రథాన్ని లాగుతూ హరేకృష్ణా నామాన్ని జపించారు. యాత్రతో నగర వాసుల్లో ఆధ్యాత్మిక ఆనందాన్ని, సామాజిక భావాన్ని పెంపొందిం చింది. ఇస్కాన్ ఆధ్వర్యంలో మాజేటిరామ్ కల్యాణ మండపం వద్ద ప్రారంభమైన ఈ రథ యాత్ర ఎల్వీఆర్ క్లబ్, లక్ష్మీపురం రోడ్డు, ఎన్టీఆర్ స్టేడియం, వెల్‌కమ్ హోటల్ మీదగా సాగి తిరిగి కల్యాణ మండపానికి చేరుకుంది. ఈ సందర్భంగా హరే కృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు వంశీధర్ దాస మాట్లాడుతూ రాబోయే కృష్ణ జన్మాష్టమి వరకు హరే కృష్ణ గోకుల క్షేత్రం వారు సహస్ర కోటి హరినామ జప యజ్ఞ కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, క్రేన్ సంస్థల అధినేత గ్రంధి కాంతా రావు, గోకరాజు గంగరాజు, ఎస్‌ఎల్‌వీ రాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతం చేయండి

గుంటూరు సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 25వేల ఎకరాల్లో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధి హామీ పథకం క్షేత్ర స్థాయి సిబ్బందిని డ్వామా పీడీ శంకర్ ఆదేశించా రు. శనివారం గుంటూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ప్రోటోకాల్ నిబంధ నలను అనుసరించి ప్రజా ప్రతినిధుల సమక్షంలో ఒక పండుగ వాతా వరణంలో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖాధికారి రవీంద్రబాబు, పశు సంవర్ధకశాఖ ఇన్‌చార్జి జేడీ సత్యనారాయణ, ఫారె స్టు రేంజ్ ఆఫీసర్ పోతురాజు, జిల్లా నిఘా అధికారి హనుమంతరావు, ఏపీడీలు శ్యామలాదేవి, శివన్నారాయణ, అన్ని మండలాల అదనపు ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు.



సుపరిపాలన కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

సూపర్ సిక్స్ అమలు చేస్తున్న సీఎం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● 15వ డివిజన్లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

గుంటూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలో ని 15వ డివిజన్ శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నసీర్ స్థానికులతో మమేకమై కూటమి చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించి, వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోడెద్దుల్లా ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్నాయని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్లో ఉన్న సమస్యల పరిష్కారానికి తాను ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు చెప్పారు. సీసీ రోడ్లు, డ్రైన్లు, మంచి నీటి సరఫరా వంటి సమస్యల పరిష్కారానికి వందల కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. పీ- 4 కార్యక్రమం ద్వారా పేదల కుటుంబాల జీవితాల్లో వెలుగులు తీసుకురాబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సూరే శ్రీనివాసరావు, ఈర్ల గురవయ్య, మల్లెంపూడి శ్రీనివాస్, పుట్ట గంటి వెంకటేశ్వర్లు, పాటిబండ్ల శ్రీనివాసరావు, గోగినేని హరికృష్ణ, వాకా వీరారెడ్డి, కొండలు, వజ్జా లక్ష్మి, సురం లక్ష్మి, మస్తాన్ వలి, ఫారుక్, బీరం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● నియోజకవర్గంలోని రైలుపేటకు చెందిన లక్ష్మీ కుసుమవాణికి సీఎంఆర్ఎఫ్ కింద ఎమ్మెల్యే రూ.5 లక్షలకు ఎల్‌వోసీ అందజేశారు.



అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం టాంపాలో ఈనెల 4, 5, 6 తేదీల్లో జరుగుతున్న నాట్స్ సంబరాలకు అమెరికాకు వెళ్లిన నందమూరి బాల కృష్ణను టాంపా విమానాశ్రయంలో కలిసి స్వాగతం పలుకుతున్న నాట్స్ మాజీ అధ్యకుడు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ - గుంటూరు (ఆంధ్రజ్యోతి).

మహిళలకు కుట్టుమిషన్ మరమ్మతులపై శిక్షణ

గుంటూరు విద్య, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరండల్‌పేట, లోని వావిలాల సంస్థలో శనివారం మహిళలకు కుట్టుమిషన్ మరమ్మ తులపై శిక్షణ అందించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. వర్సిటీ వీసీ ఆచార్య గంగాధర్ మాట్లాడుతూ సమాజంలో లింగ వివక్ష ఉండ రాదని పురుషులు, మహిళలు సమానమని.. మహిళలు అన్ని రంగా ల్లో రాణిస్తున్నారని తెలిపారు. సీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ పీ బబిత మా ట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన కోసం స్వయం ఉపాధి పథ కాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్యూ సీఎస్ఆర్ విభాగం కోఆర్డినేటర్ ఎంవీ రమణ, సేవా భారతి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఎస్ఎన్ చారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.



సంప్రదాయం

హల్దీకి ట్రెండీగా...

వివాహానికి ముందు రోజు వధూ వరులకు విడివిడిగా జరిపించే ఓ ముఖ్యమైన కార్యక్రమం 'హల్దీ'. దీన్నే మనం మంగళ స్నానాలు అంటూ ఉంటాం. బంధు మిత్రుల ఆనందోత్సాహాలు, కేరింతలు, డ్యాన్స్‌ల మధ్య చాలా సరదాగా కోలాహలంగా సాగుతుంది ఈ ప్రోగ్రామ్. ముఖ్యంగా అమ్మాయి ఇంట జరిగే హంగామా అంతా ఇంతా కాదు. మధ్యలో ఫొటోలు, వీడియోలు అంటూ ఫొటోగ్రాఫర్ల సందడి ఉండనే ఉంటుంది. అందుకే ఈ హల్దీ ప్రోగ్రామ్‌లో అందంగా కనిపించేందుకు ప్రత్యేకమైన లెహంగాలను ఎంచుకుంటున్నారు కాబోయే పెళ్లికూతుళ్లు. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న సరికొత్త లెహంగాలు ఇవే...

లెహంగానే కావాలి

ఒకప్పుడు హల్దీ అనగానే పసుపు లేదా తెలుపు రంగు లంగా-ఓణి లేదంటే చీర ధరించేవారు. క్రమంగా ట్రెండ్ మారుతూ వచ్చింది. ఇండో వెస్ట్రన్ శైలిని ప్రతిబింబించే ఆర్గంజా, నెట్టెడ్, క్రేప్, జార్జెట్ లెహంగాలను అమ్మాయిలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. మల్టీకలర్, ఫ్లోరల్ డిజైన్లనూ ఆదరిస్తున్నారు. హల్దీ ప్రోగ్రామ్‌లో పసుపుకు ఉన్న ప్రాముఖ్యాన్ని దృష్టిలో ఉంచుకొని తాము ధరించే డ్రెస్‌లో పసుపు రంగు ఉండేలా చూసుకుంటున్నారు. లేత రంగు లెహంగా మీద పసుపు డిజైన్ ఉండేవాటిని ఎంపిక చేసుకుంటున్నారు. లెహంగా ఏ రంగులో ఉన్నప్పటికీ వాటిమీద పసుపు రంగు టాప్ ధరించి మురిసిపోతున్నారు. ప్రస్తుతం 'మల్టీ కలర్డ్ ఖాలీ' లెహంగాలు సరికొత్త ట్రెండ్‌ను సృష్టిస్తున్నాయి.



రఫెల్స్

నెట్టెడ్ క్లాత్‌ని కుచ్చులు కుచ్చులుగా చేర్చి దానితో లెహంగా, బ్లౌజ్ రూపొందిస్తారు. లేత నీలం, లేత గులాబీ, లేత ఆకుపచ్చ రంగులతో పాటు పసుపు రంగును కూడా మేళవించడం వల్ల హల్దీ ప్రోగ్రామ్ శోభ ఉట్టిపడుతుంది. స్టయిల్‌గా కూడా కనిపిస్తుంది. రఫెల్ బ్లౌజ్‌కు పూర్తిగా కాంట్రాస్ట్ కలర్‌లో ఉన్న లెహంగాను ధరించడం ప్రస్తుతం కొనసాగుతున్న ట్రెండ్.

తెల్లని లంగా-ఓణి

వివాహ ప్రక్రియలో సంప్రదాయం పాటించాలనుకునే వారు తెల్లని లంగా-ఓణి ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఒకప్పుడు ఇదే సంప్రదాయం ఉండేది. మళ్లీ ఈ పోకడ ప్రారంభమైంది. జార్జెట్ లేదా ఆర్గంజా ఫ్యాబ్రిక్‌తో రూపొందించిన బ్లౌజ్, లంగా, ఓణీల మీద.... వాటి అంచులకు పసుపు రంగు పూలు, మామిడి పిందెలు, చుక్కలను డిజైన్ చేయించుకుంటున్నారు. ముత్యాలతో రూపొందించిన గాజులు, హారం, ఉంగరాలు, జుంకాలు, పాపిడి బిళ్ల ధరించి అందంగా మెరిసిపోతున్నారు.



నెట్టెడ్ లెహంగాలు

ఇవి దక్షిణాది శైలిని ప్రతిబింబిస్తాయి. లెహంగా మొత్తం పలు లేయర్లుగా ఉంటుంది. ఒక్కో లేయర్ ఒక్కో రంగులో ఉంటుంది. ఇంద్రధనుస్సు రంగులతో లెహంగా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. భుజం మీదుగా జాలువారే కేప్ దుపట్టా ప్రత్యేకమైన అందాన్నిస్తుంది. ఈ నెటెడ్ లెహంగాల మీద లేత రంగు పాస్టెల్ బ్లౌజ్‌లు చక్కగా అమరుతాయి. వీటి మీద ముత్యపు చిప్పలు, గవ్వలు, శంఖులతో రూపొందించిన నగలు వేసుకోవడం నేటి సరికొత్త ఫ్యాషన్.

• **ఖ్యాతి**, ఖ్యాతి డిజైనర్ స్టూడియో
హైదరాబాద్, 6300386749

ఆస్తా పూనియా... భారత నావికాదళంలో తొలి మహిళా ఫైటర్ పైలెట్‌గా చరిత్ర సృష్టించిన ఆమె త్రివిధ దళాల్లో విస్తరిస్తున్న నవ నారీ శక్తికి ప్రతీక. శ్రమించే తత్వం, కష్టపడే గుణం ఉంటే ఏదీ అసాధ్యం కాదంటున్న ఆస్తా ఎందరో యువతులకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

సాగర సమరానికి సై



అది ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ నగరంలో ఒక మధ్యతరగతి కాలనీ. తమ ఇంటికి కాస్త ఎత్తులో దూసుకువెళ్తున్న విమానం శబ్దం ఎప్పుడు వినిపించినా చిన్నారి ఆస్తా పరుగులు పెడుతూ బయటికి వచ్చేది. విమానాలను అబ్బురంగా చూసేది. "ఏదో ఒక రోజు నేను అలాంటి విమానం నడుపుతాను" అని అమ్మకు, నాన్నకు చెప్పేది. ఆ కలను నిజం చేసుకోవడమే కాదు... దేశంలో తొలి మహిళా ఫైటర్ పైలెట్‌గా చరిత్రకెక్కింది. "ఇది చెప్పుకున్నంత సులువుగా జరిగిపోలేదు. తన కలను నిజం చేసుకోవడానికి ఆమె పడ్డ కష్టం ఎంతో ఉంది. చదువులో, ఆటల్లో తను ఎప్పుడూ ఫస్ట్. ఏ పనినైనా పూర్తి ఏకాగ్రతతో చేస్తుంది" అంటారు ఆమె కుటుంబ సభ్యులు.

బీటెక్ చేసి...

ఆస్తాది సైనిక నేపథ్యం ఉన్న కుటుంబం కాదు. ఆమె ఇంజనీర్ కావాలని తల్లిదండ్రులు కోరుకున్నారు. వారి ఆలోచనలను గౌరవిస్తూ ఆమె బీటెక్ చేసింది. అదే సమయంలో... పైలెట్ కావాలనే తన కోరికను మరచిపోలేదు. బీటెక్ పూర్తి కాగానే.... 'షార్ట్ సర్వీస్ కమిషన్' (ఎస్‌సిసి) ద్వారా భారత నావికాదళంలో చేరింది. "నేవల్ ఏవియేషన్‌కు సాంకేతిక పరిజ్ఞానం చాలా అవసరం. దానికి నా ఇంజనీరింగ్ పునాది ఉపకరించింది" అని చెబుతుంది ఆస్తా. మొదట కేరళలోని ఎజిమలలో ఉన్న ప్రతిష్ఠాత్మకమైన 'ఇండియన్ నేవల్ అకాడమీ' (ఐఎన్ఎ)లో శిక్షణ పొందింది. ఆ తరువాత హైదరాబాద్‌లోని దుండిగల్ 'ఎయిర్ ఫోర్స్ అకాడమీ'లో ప్రాథమిక వైమానిక శిక్షణ తీసుకుంది. సైనిక విమానాలు నడపడంలో తొలి పాఠాలు అక్కడే నేర్చుకుంది. ఆ తరువాత విశాఖపట్నంలోని 'ఐఎన్ఎస్ డేగా'లో హాక్ అడ్వాన్స్‌డ్ జెట్ ట్రైనర్ (ఎజెటి) మీద అడ్వాన్స్‌డ్ ఫ్లయింగ్, ఆ తరువాత ఫైటర్ ఫైటర్ పైలెట్‌గా ఎదురయ్యే సవాళ్లకు సిద్ధం కావడం కోసం అవసరమైన 'సెకెండ్ బేసిక్ హాక్ కన్వర్షన్ కోర్సు'లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. క్వాలిఫైడ్ నేవల్ ఏవియేటర్‌కు గుర్తింపు చిహ్నమైన 'గోల్డ్ ఆఫ్ వింగ్స్'ను ఈ నెల మూడో తేదీన రియర్ అడ్మిరల్ జనక్ బెల్వీ చేతుల మీదుగా అందుకొని, అది సాధించిన తొలి మహిళగా గుర్తింపు పొందింది.

ఆ దిశగా గట్టి అడుగు

ఇది ఆస్తా వ్యక్తిగతమైన ఘనత మాత్రమే కాదు, భారత రక్షణ దళాల్లో నారీ శక్తిని... మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా, 'మారిటైమ్ ఇండియా విజన్ - 2030' లక్ష్యాల దిశగా వేసిన గట్టి అడుగు కూడా. ఇక 'హాక్ ఏజేటీ' మీద కూడా శిక్షణ పొందిన తరువాత మిగ్29 కె ని నడపడానికి ఆస్తాకు పూర్తి అర్హత లభిస్తుంది. ఐఎన్ఎస్ విక్రాంత్, ఐఎన్ఎస్ విక్రమాదిత్య లాంటి విమాన వాహక నౌకల నుంచి ప్రయోగించే యుద్ధ విమానాలను నడిపిస్తూ... సరిహద్దుల భద్రతలో కీలక పాత్ర పోషించే అవకాశాన్ని ఆమె అందుకుంటుంది. "ఇది ఉద్వేగభరితమైన క్షణం. దేశ రక్షణలో భాగం కావడం గర్వంగా ఉంది" అంటున్న ఆస్తా... ఎంతో మంది యువతులకు స్ఫూర్తిప్రదాత అవుతుందనడంలో సందేహం లేదు.

ప్రత్యేకం

సింహపురి (నెల్లూరు) గడ్డపై ఉన్న బారాషహీద్ దర్గా మతసామరస్యానికి ప్రతీక. దాన్ని కుల, మత, వర్గాలకు అతీతంగా ఎవరైనా దర్శించుకోవచ్చు. అక్కడ జరిగే రొట్టెల పండుగ ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఏటా అయిదు రోజులపాటు నిర్వహించే ఈ వేడుకలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి లక్షలాది మంది భక్త జనం తరలివస్తారు. నేడు ప్రారంభమవుతున్న ఈ వేడుకలకు ఘనమైన చరిత్రే ఉంది.

మత సామరస్యానికి ప్రతీక



ఆర్కాడు నవాబు కాలం నుంచి.
సుమారు 400 సంవత్సరాల క్రితం సౌదీ, మక్కా షరీఫ్ నుంచి 300 మంది మత ప్రచారకులు భారతదేశానికి వచ్చారు. ఆ సమయంలో కర్ణాటకలో హైదర్ అలీ పాలన, నెల్లూరులో నవాబు పాలన ఉండేవి. ఆ ప్రచారకుల్లో 12 మంది నెల్లూరు జిల్లాలో పర్యటిస్తూ... కొడవలూరు మండలం గండవరం చేరుకున్నారు. అప్పుడు వారికి, బ్రిటిష్ సైనికులకు మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో ఆ ప్రచారకులు ప్రాణత్యాగం చేశారు. వారి తలలు గండవరం వద్ద పడిపోగా... వారి మొండేలతో గుర్రాలు నెల్లూరు చేరాయి. ఆ మొండేలను స్థానికులు స్వర్ణాల చెరువు వద్ద సమాధి చేశారు. కొన్నేళ్ళ తరువాత... ఆ చెరువులో రజక దంపతులు దుస్తులు ఉతికి, అక్కడ ఉన్న చెట్టు కింద విశ్రమించారు. ఆ రజకుడి భార్యకు ఒక దైవ స్వరూపుడు కలలోకి వచ్చి.. బారా షహీద్‌ల సమాధుల వద్ద ఉన్న మట్టిని లేపనం చేసుకున్నవారు అనారోగ్యం నుంచి కోలుకుంటారని చెప్పాడు. ఆమె తన కల గురించి భర్తకు చెప్పింది. ఈ విషయాన్ని దగ్గరలో ఉన్న రాజభటులకు ఆ దంపతులు నివేదించారు. వారిని ఆర్కాటు నవాబు దగ్గరకు భటులు తీసుకువెళ్లారు. అప్పట్లో నవాబు కుమార్తె అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమె స్వస్థత కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు. ఈ నేపథ్యంలో... ఆ దంపతులు చెప్పిన మాటలను నవాబు విశ్వసించాడు. వాటిని పాటించాడు. ఒక రోజు గడవకముందే కుమార్తె ఆరోగ్యం బాగుపడటం చూసి నవాబుకు ఆశ్చర్యం కలిగింది. అతను బారాషహీద్ సమాధుల వద్దకు చేరుకొని పూజలు చేశాడు. సమాధుల దగ్గర ఉన్న మట్టితో లేపనం చేసుకోవడం వల్ల నవాబు కుమార్తె ఆరోగ్యం బాగుపడిందని ప్రజలకూ తెలియడంతో అందరూ ఆ దర్గాలో పూజలు ఆరంభించారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మొహర్రం నెలలో ఆ సమాధులకు పూజలు జరుగుతున్నాయి.



కోరికలెన్నో... రొట్టెలు ఎన్నెన్నో

రొట్టెల పండుగలో... కొత్త కోరికలు కోరుకొనేవారు, కోరికలు తీరినవారు... ఇలా ఎందరో 'వరాల రొట్టె'లను అందుకుంటారు. ప్రసాదాలుగా భావించే ఈ రొట్టెల్లో... కాలక్రమేణా రకరకాల రొట్టెలు పుట్టుకొచ్చాయి. ఆరోగ్యం, విద్య, ఉద్యోగం, వివాహం, వ్యాపారం, సంతానం, భాగ్యం, ఇల్లు... ఇలా వివిధ కోరికలు తీరాలనుకొనే వారి కోసం ఎన్నెన్నో రొట్టెలు అందుబాటులో ఉంటున్నాయి. ఈ రొట్టెల ప్రసాదం ద్వారా కోర్కె తీరిన భక్తులు మరుసటి ఏడాది విధిగా ఈ పండుగకు వచ్చి... తమ చేతుల మీదుగా మరొకరికి రొట్టెను పంచడం, కోర్కెలు సఫలం కావడం కోసం ఆ రొట్టెను మహాప్రసాదంగా స్వీకరించడం ఈ పండుగ విశేషం. రొట్టెల పండుగకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులను నెల్లూరు నగరవాసులు అతిథులుగా భావించి వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారు.



హిందువులు పెట్టిన పేరే..

ఆర్కాట్ నవాబు 1757లో ఆ ప్రదేశంలో పండుగను ప్రారంభించినట్టు చరిత్ర చెబుతోంది. పూజలు చేసేందుకు వచ్చిన వారు తమ వెంట తెచ్చుకున్న రొట్టెలను తిని, మిగిలి వాటిని అక్కడే ఉన్నవారికి పంచేవారు. అలా స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలు తినడం, పక్కవారికి ఇవ్వడం రొట్టెల పండుగలో ఆనవాయితీ అయింది.. నవాబు పాలనలో... ఆయన ప్రతినిధిగా ఖాజీ ఆధ్వర్యంలో పండుగ జరిగేది. ముస్లింలు ఈ పండుగను 'మొహర్రం జియారత్' అని పిలుచుకునేవారు. అయితే, చెరువు వద్ద రొట్టెలు మార్చుకొనే ఆనవాయితీ కారణంగా దీన్ని 'రొట్టెల పండుగ' అనే పేరు స్థిరపడిపోయింది. ఈ పేరు హిందువులు పెట్టిన పేరేననీ, అది తమకు గర్వంగా ఉందని దర్గా సంరక్షకులు చెబుతున్నారు. అలా మొదలైన రొట్టెల పండుగ ఖ్యాతి నెల్లూరు జిల్లా సరిహద్దులు దాటి విదేశాలకు పాకింది.

• గొల్ల రామకృష్ణ
ఫొటోలు: ఎస్‌డీ జకీర్

సండే సెలబ్రిటీ

ఈ మధ్యకాలంలో ఓటీటీలో నేరుగా విడుదలయ్యే సినిమాలు... వెబ్‌సిరీస్‌ల్లో ప్రధాన పాత్రలు పోషిస్తూ అలరిస్తున్న హీరో... నవీన్ చంద్ర. తాజాగా ఆయన నటించిన 'షోటైమ్' థియేటర్లలో విడుదలయింది. ఓటీటీ సిరీస్‌ల గురించి... ప్రేక్షకుల అభిమానం గురించి ఆయన 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.

ఓటీటీ కింగ్ అంటున్నారు!



మీ దృష్టి కథలపైనా? ఖరీదైన ప్రొడక్షన్‌పైనా?

నేను మంచి కథలను ఎంచుకోవటానికి ప్రయత్నిస్తున్నా. ప్రొడక్షన్ విలువలు.. బడ్జెట్‌లు ఈ విషయాలపై కాకుండా నా నటనపైనే ఎక్కువ దృష్టి పెడుతున్నా. దీనివల్ల కొంత సంతృప్తి కలుగుతోంది. అంతే కాదు... ఈమధ్య కాలంలో నా దగ్గరకు మంచి కథలు వస్తున్నాయి. మంచి డైరక్టర్లు కూడా వస్తున్నారు.

కొన్ని చిన్న సినిమాలు ఓటీటీల్లో సూపర్‌హిట్ అవుతున్నాయి. అవే సినిమాలను చూడటానికి ప్రేక్షకులు థియేటర్‌కు ఎందుకు రావటం లేదు?

మా ప్రమోషన్ సరిపోవటంలేదా... అనే అనుమానం వస్తోంది. చిన్న సినిమాలకు సోషల్ మీడియాలో ఎక్కువగానే ప్రమోషన్స్ చేస్తున్నాం. ప్రేక్షకుల కామెంట్స్ కూడా పాజిటివ్‌గా వస్తున్నాయి. కానీ ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చి సినిమాలను ఎక్కువగా ఎందుకు చూడటం లేదనే విషయం తెలియటంలేదు. ఒకప్పుడు మొదటి రోజు 'సినిమా బాగుంది' అనే టాక్ వస్తే ప్రేక్షకులు తప్పనిసరిగా థియేటర్‌కు వస్తారనే నమ్మకం ఉండేది. ఇప్పుడు పరిస్థితులు మారాయి. చాలా జాగ్రత్తగా ఆలోచించి, అన్ని రకాలుగా బాగుందని నిర్ణయించుకుంటేనే థియేటర్‌కు వస్తున్నారు. మేము కూడా చాలా జాగ్రత్తగా కథలను ఎంచుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

మీకు ఏ తరహా పాత్రలంటే ఎక్కువ ఇష్టం?

ఒక నటుడిగా రకరకాల పాత్రల్లో నటించటానికి తగిన శిక్షణ తీసుకొని సిద్ధంగా ఉన్నా. యాక్షన్, కామెడీ, ఫ్యామిలీ డ్రామా ఇలా... ఇప్పటిదాకా నేను చేసిన సినిమాలు, వెబ్‌సిరీస్‌లలో మంచి పాత్రలే లభించాయి. ప్రేక్షకులు కూడా బాగా ఆదరించారు. ఈ మధ్య విడుదలైన 'షోటైమ్' చిన్న సినిమా. కామెడీ థ్రిల్లర్. చాలా సహజంగా ఉంటుంది. మన జీవితంలోని సంఘటనలే దీనిలో కనిపిస్తాయి. నేను జిమ్ కోచ్‌గా నటించాను. కొన్ని ప్రీమియర్ షోలు వేశాం. చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో ఎక్కడా వయలెన్స్ ఉండదు. పెద్ద పెద్ద ట్విస్ట్‌లు ఉండవు. రాజా రవీంద్ర ఒక ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆయన కూడా చాలా బాగా చేశారు. ఇక నేను చేసిన మిగిలిన పాత్రల విషయానికి వస్తే... 'గేమ్ ఛేంజర్' సినిమాలో నాకు డూప్ దొరకలేదు. దాంతో ఆ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్‌లన్నీ నేనే చేశా. ఇదే విధంగా 'పరంపర' సీరియల్ ఒక ఫ్యామిలీ డ్రామా. దీనిలో నేను ఒక ముఖ్యమైన పాత్ర పోషించా. రాబోయే ఒక సినిమాలో పరిస్థితులకు తగినట్లుగా హ్యూమర్ ఉంటుంది. ఈ పాత్ర చాలా బాగా వచ్చింది. ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందనుకుంటున్నా.

మొత్తానికే మోసం...

మంచి కథలు అనేకం ఉన్నాయి. మంచి రచయితలు అనేకమంది ఉన్నారు. కానీ ఈ మధ్యకాలంలో కథా గమనంలో సాంకేతికతను చొప్పించటానికి ప్రయత్నిస్తున్నారు. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించటానికి ఇదొక మార్గం అని భావిస్తున్నారు. అయితే కథకు అవసరమైన మేరకే సాంకేతికతను జొప్పించాలి. లేకపోతే మొత్తానికే మోసం వస్తుంది.

టెలివిజన్ స్థానాన్ని ఓటీటీ ఆక్రమించిందని అనుకుంటున్నారా?

కొంతవరకు ఆక్రమించింది. ఒకప్పుడు టెలివిజన్‌ను రోజంతా చూసేవారు. ఇప్పుడు యాప్స్ వచ్చేశాయి. దీనిలో సీరియల్స్, సినిమాలు ఏవైనా చూసుకోవచ్చు. టెలివిజన్‌లో చూడటానికి ఎన్ని ప్రత్యామ్నాయ కార్యక్రమాలు ఉంటాయో.. అవన్నీ ఓటీటీలోనూ లభిస్తున్నాయి. దీనివల్ల ఇంట్లో కూర్చొని చూసే ప్రేక్షకులకు ఓటీటీ ఒక వరం. దీంతో ఎక్కువమంది అటు టెలివిజన్.. ఇటు ఓటీటీ రెండూ చూస్తున్నారు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఒక సినిమా విజయవంతం అవ్వాలంటే... ఒక వారం బాగా ఆడాలి. ఏదైనా పెద్ద సినిమాను తీసుకుందాం. విడుదలైన తర్వాత రెండు రోజులు హీరో అభిమానులు హడావుడి చేస్తారు. ఆ తర్వాత ఫ్యామిలీ ఆడియన్స్ రావాలి. కానీ ఓటీటీకి అలవాటు పడ్డ ప్రేక్షకుల్లో ఎక్కువమంది ఇల్లు కదిలి థియేటర్‌కు రావటానికి ఇష్టపడటం లేదు. దీని ప్రభావం సినిమాలపై పడుతోంది.

ఓటీటీలలో మీ సక్సెస్ రేట్ చాలా ఎక్కువనుకుంటా?

నేను చేసిన సిరీస్‌లు, సినిమాలు అన్నీ ఓటీటీల్లో సూపర్‌హిట్ అయ్యాయి. కొందరైతే నన్ను 'ఓటీటీ కింగ్' అంటున్నారు. మా చెల్లి హైదరాబాద్‌లో పని చేస్తోంది. తను 'షోటైమ్' చూసింది. మొన్న వచ్చి... 'నవీన్ అన్నా... షోటైమ్ చూశా. చాలా బాగుంది. ఓటీటీలో వస్తే పెద్ద హిట్ అవుతుంది. నీకు ఓటీటీలో ఎక్కువ ఫ్యాన్స్ ఉన్నారు' అంది. నాకు ఎలా రియాక్ట్ కావాలో అర్థంకాలేదు. నేను ఇప్పటి దాకా నాలుగు వెబ్ సిరీస్‌లు, నాలుగు వెబ్ ఫిల్మ్స్ చేశాను. ఇవన్నీ బాగా హిట్ అయ్యాయి. దీనికి ఒక కారణం ఉంది. ఓటీటీ ప్రారంభ దశలో నాకు హీరో వేషాలు రాలేదు. పెద్ద పెద్ద నటులున్న సినిమాల్లో మంచి క్యారెక్టర్స్ వచ్చాయి. ఓటీటీలో ఇన్‌స్పెక్టర్ 'రుషి, అమ్ము, భానుమతి రామకృష్ణ, బ్రో' లాంటివన్నీ బాగా హిట్ అయ్యాయి. 'లెవెన్' సినిమాను రెండు వారాల్లో 25 కోట్ల మంది చూశారు. చాలా మంది వీటిని ఓటీటీ వచ్చిన వెంటనే చూసేస్తారు. ఇదే విధంగా థియేటర్లలో నా సినిమాలు చూడాలని దేవుడిని ప్రార్థిస్తూ ఉంటా!

• సీవీఎల్ఎన్ ప్రసాద్

గోరువెచ్చని నీరు తాగితే...

తగినంత నీరు తాగకపోతే శరీరం వ్యాధుల పాలవుతుంది. రోజూ పరగడుపునే గోరువెచ్చని నీరు తాగితే చాలా వరకు అనారోగ్య సమస్యలు తీరిపోతాయని నిపుణులు సూచిస్తున్నారు.



- ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంలో జీవక్రియలు ఉత్తేజితమవుతాయి. రక్తప్రసరణ సజావుగా జరుగుతుంది. కండరాల నొప్పులు తగ్గుతాయి. నరాల పనితీరు మెరుగుపడుతుంది. మెదడు చురుకుగా పని చేస్తుంది. జ్ఞాపకశక్తి పెరుగుతుంది.
- జీర్ణక్రియ వేగవంతమవుతుంది. అజీర్ణం, కడుపులో ఆమ్లత్వం, కడుపు ఉబ్బరం లాంటివి తగ్గుతాయి.
- రాత్రిపూట శరీరంలో పేరుకున్న వ్యర్థ పదార్థాలన్నీ పూర్తిగా విసర్జితమవుతాయి. పేగులు, మూత్రపిండాలు, జననేంద్రియాలు పరిశుభ్రమవుతాయి.
- వేడి నీరు తాగడం వల్ల గొంతులో చేరిన శ్లేష్మం తొలగిపోతుంది. గొంతులో గర గర, ముక్కు దిబ్బడ, జలుబు లాంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.
- శరీరంలో పేరుకుపోయిన కొవ్వులు కరుగుతాయి. దీంతో బరువు తగ్గి శరీరం సరైన ఆకృతిని సంతరించుకుంటుంది.
- నెలసరి సమయంలో వేడి నీరు తాగడం వల్ల కడుపునొప్పి, అలసట, నీరసం, విసుగు లాంటి సమస్యలు తగ్గుతాయి.
- నిద్రలేమితో బాధపడేవారు రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు గోరువెచ్చని నీరు తాగితే ఒత్తిడి తగ్గి సమస్య తీరుతుంది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా ఓటీటీల్లో విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌లు...

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ఆప్ జైసా కోయి	హిందీ చిత్రం	జూలై 11
సోనీ లివ్		
నరివెట్టా	మలయాళ చిత్రం	జూలై 11
జియో హాట్‌స్టార్		
మూన్‌వాక్	మలయాళ చిత్రం	జూలై 08
బుక్ మై షో		
గుడ్ వన్	హాలీవుడ్ మూవీ	జూలై 08







'వార్-2' హక్కులు ఆ సంస్థకే



ఎన్టీఆర్, హృతిక్ రోషన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'వార్-2' సినిమా తెలుగు రైట్స్‌ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ దక్కించుకొంది. ఈ మేరకు నిర్మాత సూర్యదేవర నాగవంశీ అభిమానులను ఉద్దేశిస్తూ ఓ పోస్ట్ పెట్టారు. 'సితార ఎంటర్‌టైన్‌మెంట్స్' బేనర్‌పై తెలుగు రాష్ట్రాల్లో 'వార్-2'ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. 'నాకెంతో ఇష్టమైన తారక్ సినిమాతో మళ్లీ మీ ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఆయన నటించిన రెండు సినిమాలు 'అరవింద సమేత వీర రాఘవ', 'దేవర' మా బేనర్‌పై విడుదలయ్యాయి. ఇప్పుడు హ్యాట్రిక్ కోసం సమయం ఆసన్నమైంది. అభిమానులంతా సిద్ధంగా ఉండండి. 'వార్-2'లో మీరు ఇంతకుముందెన్నడూ చూడని కొత్త ఎన్టీఆర్‌ను చూడనున్నారు. ఆగస్టు 14న సంబరాలు చేసుకుందాం' అంటూ నిర్మాత నాగవంశీ ఓ వీడియోను షేర్ చేశారు. 'వార్-2'ని అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తోంది.

శరవేగంగా షూటింగ్



వరుణ్ తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న 'వీటీ15'(వర్కింగ్ టైటిల్) సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇండో - కొరియన్ హారర్ కామెడీగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇటీవలె హైదరాబాద్, అనంతపురంలో చిత్రీకరణను పూర్తి చేసుకుంది. తాజాగా విదేశాల్లో ప్రారంభించిన షెడ్యూల్ శరవేగంగా కొనసాగుతోంది. ప్రస్తుతం వేటకు సంబంధించిన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌తో 80 శాతం షూటింగ్ పూర్తవుతుందని చిత్రబృందం పేర్కొంది.

పాట చిత్రీకరణలో గర్ల్ ఫ్రెండ్



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, హీరో దీక్షిత్ శెట్టి కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'ద గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఈ అందమైన ప్రేమకథకు రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ప్రస్తుతం రశ్మిక, దీక్షిత్‌పై పాట చిత్రీకరిస్తున్నారు. టాకీ పార్ట్ దాదాపు పూర్తయింది. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తామనీ, ఈ నెలలోనే పాటను విడుదల చేస్తామనీ నిర్మాతలు చెప్పారు. ఈ సినిమాకు కృష్ణన్ వసంత్ ఛాయాగ్రహణాన్ని, హేషమ్ అబ్దుల్ వాహబ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

నిజజీవిత ఘటన నేపథ్యంలో..



తమిళంలో సూపర్ హిట్ అయిన డీఎన్ఏ సినిమాను ఎస్కే పిక్చర్స్ ద్వారా సురేశ్ కొండేటి తెలుగు ప్రేక్షకులకు అందించనున్నారు. తెలుగులో 'మై బేబీ' పేరుతో ఈనెల 11న విడుదలవుతోంది. "మై బేబీ' నిర్మాతగా నాకు 16వ చిత్రమిది. ఇది కూడా సూపర్ హిట్ అవుతుంది' అని సురేశ్ కొండేటి ధీమా వ్యక్తం చేశారు. కాగా, తమిళంలో అధర్వ మురళి, నిమిషా సజయన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వం వహించారు. 2014లో ఒక సాఫ్ట్‌వేర్ ఆర్కిటెక్ట్ జీవితంలో జరిగిన దుర్ఘటన నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది. తమిళంలో ఇటీవలె విడుదలై విమర్శకుల ప్రశంసలు అందుకుంది.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కన్నడ గురించి మాట్లాడొద్దు

● కమల్‌కు కోర్టు సూచన



కన్నడ గురించి మాట్లాడొద్దని నటుడు కమల్ హాసన్‌కు బెంగళూరు కోర్టు శుక్రవారం సూచించింది. థగ్‌లైఫ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో తమిళం నుంచి కన్నడ పుట్టిందని ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయిన విషయం విదితమే. కన్నడ చలనచిత్ర వాణిజ్య మండలితోపాటు కన్నడ సంఘాలు కమల్ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కర్ణాటకలో థగ్‌లైఫ్ సినిమా విడుదలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. దీంతో కమల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సినిమా విడుదలను అడ్డుకోవద్దని, తగిన బందోబస్తు కల్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. అన్ని అడ్డంకులను దాటుకుని కర్ణాటకలో థగ్‌లైఫ్ రిలీజ్ అయినా.. ఆదరణ పొందలేదు. ఈ క్రమంలో కన్నడ గురించి అనుచితమైన వ్యాఖ్యలు చేయకుండా కమల్ హాసన్‌ను కట్టడి చేయాలని కన్నడ సాహిత్య పరిషత్ కోరింది. బెంగళూరు 31వ సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కన్నడ నేల, భాష, సంస్కృతి గురించి మాట్లాడకుండా చూడాలని కోరింది. పిటిషన్‌ను విచారించిన కోర్టు, కన్నడ అంశం గురించి మాట్లాడవద్దని కమల్ హాసన్‌ను ఆదేశించింది.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా..



ఆర్కే సాగర్ నటించిన 'ద 100' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో ఈ క్రైమ్ థ్రిల్లర్ రూపుదిద్దుకొంది. ఈ సినిమా ట్రైలర్‌ను ఏపీ ఉపముఖ్యమంత్రి, హీరో పవన్‌కల్యాణ్ శనివారం విడుదల చేశారు. 'జీవితంలో జరిగిపోయినది మనం మార్చలేం. కానీ జరగబోయేదాన్ని కచ్చితంగా ఆపగలం' అంటూ విక్రాంత్ ఐపీఎస్ పాత్ర పోషించిన ఆర్కే సాగర్ వాయిస్ ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. పోలీస్ ఆఫీసర్‌గా ఫిట్‌నెస్ కలిగి అద్భుతంగా కనిపించారాయన. మిషా నారంగ్ హీరోయిన్‌గా నటించారు. సస్పెన్స్, థ్రిల్స్‌తో ఎంతో గ్రిప్పింగ్‌గా ఈ క్రైమ్ థ్రిల్లర్‌ను దర్శకుడు రూపొందించారు. విడుదలకు ముందే సినిమాపై అంచనాలను ఈ ట్రైలర్ పెంచేసింది.







వైభవ్... సునామీ ఇన్నింగ్స్

యూత్ క్రికెట్‌లో వేగవంతమైన శతకంతో రికార్డు

ఇంగ్లండ్‌తో అండర్-19 వన్డే సిరీస్ భారత్ వశం

వర్సెస్టర్: యూత్ క్రికెట్‌లో వేగవంతమైన శతకం నమోదు చేసిన ఆటగాడిగా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఇంగ్లండ్ అండర్-19తో శనివారం జరిగిన నాలుగో వన్డేలో వైభవ్ (78 బంతుల్లో 13 ఫోర్లు, 10 సిక్సర్లతో 143) భారీ షాట్లతో మోత మోగించాడు. 52 బంతుల్లోనే వంద మార్క్‌ను చేరుకున్న వైభవ్.. యూత్ వన్డేల్లో వేగవంతమైన సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచాడు. ఈ క్రమంలో పాకిస్థాన్ ఆటగాడు కమ్రాన్ గులామ్ 53 బంతుల్లో శతకం రికార్డును బద్దలుకొట్టాడు. భారత్ తరఫున అండర్ రాజ్ బవ ఉగాండాపై 69 బంతుల్లో సెంచరీ రికార్డును కూడా వైభవ్ తుడిచిపెట్టేశాడు. అంతేకాకుండా పిన్న వయసులో శతకం సాధించిన ఆటగాడిగా బంగ్లాదేశ్ క్రికెటర్ నజ్ముల్ షాంటో (14 ఏళ్ల 241 రోజులు) రికార్డును కూడా సూర్యవంశీ (14 ఏళ్ల 100 రోజులు) అధిగమించాడు. భారత్ తరఫున సర్ఫరాజ్ ఖాన్ (15 ఏళ్ల 338 రోజులు)ను కూడా వైభవ్ వెనక్కినెట్టాడు. కాగా, సూర్యవంశీ ఊచకోతతో భారత్ అండర్-19 టీమ్ 55 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచింది. మరో మ్యాచ్ మిగిలుండగానే 3-1తో సిరీస్‌ను సొంతం చేసుకొంది. తొలుత భారత్ 50 ఓవర్లలో 363/9 స్కోరు చేసింది. విహాన్ మల్హోత్రా (129) కూడా శతకం సాధించాడు. ఛేదనలో ఇంగ్లండ్ 45.3 ఓవర్లలో 308 పరుగులకు ఆలౌటైంది. రాకీ ఫ్లింటాఫ్ (107) పోరాటం వృథా అయింది. నమన్ పుష్పక్ మూడు వికెట్లు పడగొట్టాడు.

విజయం ఊరిస్తోంది

ఇంగ్లండ్ లక్ష్యం 608 | **ప్రస్తుతం 72/3**

గిల్ మరో శతకం

భారత్ రెండో ఇన్నింగ్స్ 427/6 డిక్లేర్

పంత్, జడేజా, రాహుల్ అర్ధసెంచరీలు



గిల్ (162 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సర్లతో 161)

బర్మింగ్‌హామ్: ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఇప్పటిదాకా గెలుపు రుచి చూడని టీమిండియా ముంగిట సువర్ణావకాశం. వరుసగా నాలుగో రోజూ ఆధిపత్యం చూపుతూ.. భారత్ రెండో ఇన్నింగ్స్‌లోనూ అదరగొట్టింది. దీంతో గిల్ సేన ఇంగ్లండ్ ముందుంచిన లక్ష్యం ఏకంగా 608 పరుగులు. టెస్టు చరిత్రలో ఏ జట్టు కూడా గతంలో ఇంత స్కోరును ఛేదించింది లేదు. ఇప్పటికే పేసర్ల తడాఖాతో మూడు వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టు తీవ్ర ఒత్తిడిలో పడింది. ఇక ఆఖరి రోజు ఆదివారం ఇంగ్లండ్ గేమ్‌ప్లాన్ ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ఎందుకంటే మిగిలిన బ్యాటర్లు బజ్‌బాల్ ఆటతో ముందుకు సాగాలనుకున్నా మరో 536 రన్స్ సాధించడం స్టోక్స్ సేనకు దాదాపు అసాధ్యమే. అందుకే భారత్ విజయాన్ని అడ్డుకోవాలనుకుంటే వారికి డ్రా కోసం ఆడడం తప్ప మరో దారి లేదు. అటు మూడు సెషన్లలోనే ప్రత్యర్థిని ఆలౌట్ చేసి అద్భుత విజయాన్నందించేందుకు భారత బౌలర్లు ఎదురుచూస్తున్నారు. అంతకుముందు కెప్టెన్ గిల్ (162 బంతుల్లో 13 ఫోర్లు, 8 సిక్సర్లతో 161) తన అసాధారణ ఫామ్‌తో మరో శతకం సాధించాడు. అతడికి జడేజా (69 నాటౌట్), పంత్ (65), రాహుల్ (55) అర్ధసెంచరీలతో సహకరించారు. దీంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 427/6 దగ్గర డిక్లేర్ చేసింది. దీంతో జట్టుకు మొత్తం 607 పరుగుల ఆధిక్యం లభించింది. టంగ్, బషీర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 16 ఓవర్లలో 3 వికెట్లకు 72 పరుగులు చేసింది. డకెట్ (25) పర్వాలేదనిపించగా.. క్రీజులో పోప్ (24 బ్యాటింగ్), బ్రూక్ (15 బ్యాటింగ్) ఉన్నారు. ఆకాశ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

పంత్ జోరు: నాలుగో రోజు ఉదయం ఆకాశం మేఘావృతంగా ఉండడంతో తొలి గంట ఆటలో ఇంగ్లండ్ బౌలర్లు ప్రభావం చూపారు. ఫుల్ లెంగ్త్ బంతులతో ఇబ్బంది పెట్టడంతో ఆరంభంలోనే కరుణ్ నాయర్ (26) వికెట్‌ను కోల్పోయింది. పేసర్ కార్స్ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో ఆకట్టుకున్నా ఆరో బంతికి తను కీపర్ స్మిత్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 64/1 ఓవర్‌నైట్ స్కోరుతో భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించగా, మరో 22 పరుగులు జోడించి రెండో వికెట్‌ను కోల్పోయింది. అటు రాహుల్ మాత్రం అడపాదడపా బౌండరీలతో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే డ్రింక్స్ తర్వాత టంగ్ ఎక్స్‌ట్రా పేస్‌తో వేసిన బంతికి అతడు బౌల్డయ్యాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చీ రాగానే పంత్ బ్యాట్‌కు పనిజెప్పాడు. టంగ్ ఓవర్‌లో తను 4,6 బాదడంతో పాటు తన మరుసటి ఓవర్‌లోనూ 4,6.. ఆ వెంటనే బషీర్ ఓవర్‌లో రెండు ఫోర్లు సాధించాడు. దీంతో స్కోరులో వేగం పెరగ్గా, 357 పరుగుల ఆధిక్యంతో జట్టు లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

గిల్ మరో శతకం: రెండో సెషన్‌లో పంత్-గిల్ జోడీ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ముఖ్యంగా టంగ్‌ను లక్ష్యంగా చేసుకున్న గిల్ సెషన్ రెండో ఓవర్‌లోనే 6,4,4తో 14 రన్స్ రాబట్టాడు. టంగ్ తర్వాతి ఓవర్‌లోనూ 6,4తో ఆకట్టుకున్నాడు. దీంతో పంత్‌కన్నా ముందే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అటు 48 బంతుల్లోనే పంత్ కూడా అర్ధసెంచరీ సాధించగా, అతడి సిక్సర్‌తో జట్టు ఆధిక్యం 400కి చేరింది. అయితే వేగంగా ఆడే క్రమంలో స్పిన్నర్ బషీర్ ఓవర్‌లో పంత్ లాంగాఫ్‌లో డకెట్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో నాలుగో వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత బరిలోకి దిగిన జడేజా మాత్రం డిఫెన్స్‌కే పరిమితమయ్యాడు. అటు గిల్ కూడా నెమ్మదించడంతో బౌండరీలు రావడమే కష్టమైంది. ఈ సెషన్ చివర్లో గిల్ శతకం పూర్తి చేశాడు.

భారీ ఆధిక్యంతో..: 484 రన్స్ ఆధిక్యంతో చివరి సెషన్ ఆరంభించిన భారత్ మరో గంటపాటు బ్యాటింగ్ చేసి 123 రన్స్ రాబట్టింది. ఆరంభం నుంచే గిల్-జడేజా వీలైనంత వేగంగా ఆడేందుకు ప్రయత్నించారు. సెషన్ రెండో ఓవర్ (వోక్స్)లోనే గిల్ 6,4,4తో 18 రన్స్ రాబట్టాడు. ఆ తర్వాత వోక్స్ మరో ఓవర్ మాత్రమే వేయగా, స్పిన్నర్లు బషీర్, రూట్‌లతోనే కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్ వేయించాడు. అటు గిల్ ఈ ఇద్దరినీ బాదేస్తూ బౌండరీలతో చెలరేగాడు. దీంతో 156 బంతుల్లోనే 150 రన్స్ పూర్తి చేశాడు. అయితే బషీర్ ఓవర్‌లో రిటర్న్ క్యాచ్‌తో గిల్ అవుట్ కావడంతో ఐదో వికెట్‌కు 175 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత రెండు ఓవర్లలోనే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేశారు. నితీశ్ (1) మరోసారి నిరాశపర్చాడు.

1 భారత కెప్టెన్‌గా అరంగేట్ర సిరీస్‌లో ఎక్కువ పరుగులు (585) సాధించిన గిల్. విరాట్ కోహ్లీ (449)ని అధిగమించాడు.

భారత్ తరఫున ఒక టెస్టులో నాలుగు శతక భాగస్వామ్యాలు జత చేసిన బ్యాటర్‌గా గిల్.

ఒకే టెస్టులో ఎక్కువ పరుగులు (430) సాధించిన భారత బ్యాటర్‌గా గిల్. గవాస్కర్ (344)ను అధిగమించాడు. ఓవరాల్‌గా గూచ్ (456) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.

ఓ విదేశీ గడ్డ (ఇంగ్లండ్)పై ఎక్కువ సిక్సర్లు (24) బాదిన బ్యాటర్‌గా పంత్. స్టోక్స్ (దక్షిణాఫ్రికాలో 21)ను అధిగమించాడు.

2 ఒకే టెస్టులో డబుల్ సెంచరీ, సెంచరీ చేసిన రెండో భారత ఆటగాడిగా గిల్. గవాస్కర్ గతంలో ఈ ఫీట్ సాధించాడు. ఓవరాల్‌గా తొమ్మిదో బ్యాటర్. అలాగే గవాస్కర్, విరాట్ తర్వాత రెండు ఇన్నింగ్స్‌లోనూ శతకాలు బాదిన మూడో భారత కెప్టెన్‌గా గిల్.

అలెన్ బోర్డర్ తర్వాత రెండు ఇన్నింగ్స్‌లోనూ 150+ స్కోర్లు సాధించిన బ్యాటర్‌గా గిల్.

1 ఒక టెస్టు మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (రెండు ఇన్నింగ్స్ కలిపి 1014) సాధించడం భారత్‌కిదే తొలిసారి. గతంలో ఆసీస్‌పై 916 పరుగులు సాధించింది.



ఆకాశ్ (2/36)

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 587
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 407

భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) టంగ్ 28; రాహుల్ (బి) టంగ్ 55; కరుణ్ (సి) స్మిత్ (బి) కార్స్ 26; గిల్ (సి అండ్ బి) బషీర్ 161; పంత్ (సి) డకెట్ (బి) బషీర్ 65; జడేజా (నాటౌట్) 69; నితీశ్ (సి) క్రాలే (బి) రూట్ 1; సుందర్ (నాటౌట్) 12; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 83 ఓవర్లలో 427/6 డిక్లేర్. వికెట్ల పతనం:** 1-51, 2-96, 3-126, 4-236, 5-411, 6-412. **బౌలింగ్:** వోక్స్ 14-3-61-0; కార్స్ 12-2-56-1; టంగ్ 15-2-93-2; స్టోక్స్ 7-1-26-0; బషీర్ 26-1-119-2; రూట్ 9-1-65-1.

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి సబ్) సుదర్శన్ (బి) సిరాజ్ 0; డకెట్ (బి) ఆకాశ్ 25; పోప్ (బ్యాటింగ్) 24; రూట్ (బి) ఆకాశ్ 6; బ్రూక్ (బ్యాటింగ్) 15; **ఎక్స్‌ట్రాలు: 2; మొత్తం: 16 ఓవర్లలో 72/3. వికెట్ల పతనం:** 1-11, 2-30, 3-50. **బౌలింగ్:** ఆకాశ్ 8-1-36-2; సిరాజ్ 5-1-29-1; ప్రసిద్ధ్ 3-0-6-0.

చాంపియన్ శౌర్య



హైదరాబాద్: తెలుగు కుర్రాడు శౌర్య సామల స్పానిష్ టెన్నిస్ టోర్నమెంట్‌లో సత్తా చాటాడు. బార్సిలోనాలో జరిగిన ఐటీఎఫ్ నేషనల్ టోర్నీలో సింగిల్స్ విజేతగా నిలిచాడు. ఫైనల్లో శౌర్య 7-5, 5-7, 13-11తో స్పెయిన్‌కు చెందిన జువాన్ పాబ్లోపై గెలిచి ట్రోఫీ అందుకున్నాడు.

సెమీస్‌లో శ్రీకాంత్ ఓటమి

కాల్గెరి (కెనడా): భారత సీనియర్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్‌కు కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో చుక్కెదురైంది. శనివారం రాత్రి జరిగిన సింగిల్స్ సెమీఫైనల్లో శ్రీకాంత్ 21-19, 14-21, 18-21తో మూడోసీడ్ కెంటా నిషిమోటో (జపాన్)తో పరాజయం పాలయ్యాడు. కాగా, అంతకుముందు శ్రీకాంత్ 21-18, 21-9తో టాప్ సీడ్, ప్రపంచ ఆరో ర్యాంకర్ చో తిన్ (చైనీస్ తైపీ)ను చిత్తుచేసి సెమీస్ చేరాడు. ఇక, మరో భారత ఆటగాడు శంకర్ ముత్తుస్వామి క్వార్టర్స్‌లో 15-21, 21-5, 17-21తో నిషిమోటో చేతిలో ఓటమిపాలయ్యాడు.

ఆఖర్లో తడ'బ్యాటు'

ఉత్కంఠ పోరులో భారత్ ఓటమి

ఇంగ్లండ్ మహిళలతో మూడో టీ20

లండన్: కీలక బ్యాటర్లు డెత్ ఓవర్లలో తడబాటుకు గురవడంతో ఇంగ్లండ్ మహిళలతో మూడో టీ20లో భారత్‌కు నిరాశే ఎదురైంది. శుక్రవారం రాత్రి జరిగిన ఉత్కంఠ పోరులో ఐదు పరుగుల స్వల్ప తేడాతో ఇంగ్లండ్ గెలుపొందింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో పర్యాటక జట్టు ఆధిక్యాన్ని 2-1కి తగ్గించింది. టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 20 ఓవర్లలో 171/9 స్కోరు సాధించింది. సోఫీ డంక్లే (75), డానీ వ్యాట్ (66) తొలి వికెట్‌కు 137 పరుగులు జోడించారు. ఆపై భారత బౌలర్లు విజృంభించడంతో ఇంగ్లండ్ కేవలం 25 బంతుల తేడాతో 31 పరుగులకు చివరి తొమ్మిది వికెట్లు కోల్పోయింది. తెలుగు బౌలర్లు అరుంధతి రెడ్డి మూడు, శ్రీచరణి రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో మంధాన (56), షఫాలీ వర్మ (47) మొదటి వికెట్‌కు 85 పరుగులతో ధనాధన్ ఆరంభం ఇచ్చారు. ఈ దశలో లారెన్ (2/30) 16వ ఓవర్లో మంధానాను అవుట్ చేయడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. దాంతో భారత్ 20 ఓవర్లలో 166/5 స్కోరుకే పరిమితమై ఓడింది. చివరి బంతికి ఆరు పరుగులు కావాల్సిన దశలో కెప్టెన్ హర్మన్ (23) భారీ షాట్ కొట్టే యత్నంలో క్యాచవుటైంది. కాగా ఇంగ్లండ్ కెప్టెన్ నాట్ షివర్ బ్రంట్ గాయంతో సిరీస్‌లో మిగిలిన రెండు టీ20లకు దూరమైంది. ఆమె స్థానంలో టాపార్డర్ బ్యాటర్ మియా బౌచియర్ జట్టులోకి వచ్చింది.

సంక్షిప్తస్కోర్లు: ఇంగ్లండ్: 20 ఓవర్లలో 171/9 (డంక్లే 75, వ్యాట్ 66, ఎకిల్‌స్టోన్ 10, దీప్తిశర్మ 3/27, అరుంధతి రెడ్డి 3/32, శ్రీచరణి 2/43); **భారత్:** 20 ఓవర్లలో 166/5 (మంధాన 56, షఫాలీ 47, హర్మన్ 23, జెమీమా 20, లారెన్ 2/30).



నా ఈవెంట్.. నాదే టైటిల్

'క్లాసిక్' ఈవెంట్ విజేత నీరజ్

బెంగళూరు: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. తన పేరిటే నిర్వహించిన ఆరంభ ఎన్‌సీ క్లాసిక్ (నీరజ్ చోప్రా క్లాసిక్) ఈవెంట్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈవెంట్ నిర్వహణతో పాటు అథ్లెట్‌గా బరిలోకి దిగి విజేతగా నిలవాలన్న కలను నెరవేర్చుకొన్నాడు. శనివారం జరిగిన పోటీల్లో మూడో ప్రయత్నంలో జావెలిన్‌ను 86.18 మీటర్ల దూరం విసిరిన నీరజ్ టాప్‌లో నిలిచాడు. దోహాలో డైమండ్ లీగ్, గోల్డ్ స్పైక్ గెలిచిన చోప్రాకు ఇది వరుసగా మూడో టైటిల్. 2015 వరల్డ్ చాంపియన్ జూలియన్ ఇగో (కెన్యా-84.51 మీ.) రెండో స్థానంలో, రుమేష్ పతిరేజ్ (శ్రీలంక-84.34 మీ.) 84.34 మీ. మూడో స్థానంలో నిలిచారు. జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్, భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) భాగస్వామ్యంతో చోప్రా ఈ ఈవెంట్‌ను నిర్వహించాడు. కిక్కిరిసిన స్టేడియంలో చోప్రా కుటుంబం కూడా అతడి ప్రదర్శనను వీక్షించింది. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. ఫౌల్‌తో ఆరంభించిన నీరజ్.. రెండో ప్రయత్నంలో 82.99 మీ. అందుకున్నాడు. నాలుగో ప్రయత్నంలో ఫౌల్ కాగా.. ఐదో త్రోలో 84.07 మీ., ఆరో త్రోలో 82.22 మీ. మాత్రమే విసిరాడు.



సినర్, జొకో సులువుగా..

- ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశం
- సబలెంక, స్వియాటెక్ కూడా
- డిఫెండింగ్ చాంప్ క్రెజికోవా ఇంటికి



లండన్: వింబుల్డన్‌లో ఓ వైపు సీడెడ్‌లు ఒకరివెంట ఒకరు నిష్క్రమిస్తుండగా మరో పక్క స్టార్లు దూసుకు పోతున్నారు. టాప్ సీడ్‌లు జానిక్ సినర్, ఆర్యానా సబలెంక, ఆరో సీడ్ జొకోవిచ్, ఎనిమిదో సీడ్ స్వియాటెక్ వరుస సెట్ల విజయాలతో రౌండ్-16లో ప్రవేశించారు. అయితే 2022 చాంపియన్, 11వ సీడ్ ఎలెనా రిబకినా, నిరుటి విజేత బార్బరా క్రెజికోవా మూడో రౌండ్‌లో పరాజయం పాలయ్యారు. శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో సినర్ 6-1, 6-3, 6-1తో పెడ్రో మార్టినేజ్‌ని, జొకోవిచ్ 6-3, 6-0, 6-4తో కెక్‌మనోవిచ్‌ను చిత్తు చేసి ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌ల్లో 11వ సీడ్ డిమినార్ 6-4, 7-6 (5), 6-3తో హోమ్‌గ్రెన్‌ని, 22వ సీడ్ కొబోలి 6-2, 6-4, 6-2తో 15వ సీడ్ మెన్సిక్‌ని, 19వ సీడ్ డిమిత్రోవ్ 6-3, 6-4, 7-6 (0)తో సెబాస్టియన్‌ని ఓడించారు. ఇక మహిళల సింగిల్స్‌లో..ప్రపంచ నెం.1 సబలెంక 7-6 (6), 6-4తో బ్రిటన్ స్టార్ ఎమ్మా రదుకాను ఆట కట్టించగా, ఐదు గ్రాండ్‌స్లామ్‌ల చాంపియన్ స్వియాటెక్ 6-2, 6-3తో డానిలి కొలిన్స్‌పై సునాయాసంగా నెగ్గి రౌండ్-16కు చేరారు. మరో మూడో రౌండ్ మ్యాచ్‌లో 23వ సీడ్ టాసన్ 7-6 (6), 6-3తో 11వ సీడ్ రిబకినాకు షాకిచ్చింది. డిఫెండింగ్ చాంపియన్, 17వ సీడ్ క్రెజికోవా 6-2, 3-6, 4-6తో 10వ సీడ్ ఎమ్మా నవారో చేతిలో పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. 24వ సీడ్ మెర్టెన్స్ 6-1, 7-6 (6) 14వ సీడ్ స్విటోలినాపై గెలుపొందింది. ఇతర మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ ఆండ్రీవా 6-1, 6-3తో బాప్టిస్ట్‌ని, 18వ సీడ్ అలెగ్జాండోవా 6-3, 7-6 (1)తో సోనెజ్‌ని, 19వ సీడ్ సంసనోవా 6-2, 6-3తో 16వ సీడ్ కసట్కినాని ఓడించి ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి అడుగుపెట్టారు.

యుకీ జోడీ ముందంజ: యుకీ భాంబ్రీ/గాలోవే (అమెరికా) జోడీ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌కు చేరింది. రెండో రౌండ్‌లో భాంబ్రీ జంట 6-3, 7-6 (6)తో పోర్చుగల్ ద్వయం బోర్గెస్/గిరాన్‌పై విజయం సాధించింది. శ్రీరామ్ బాలాజీ/మెక్సికోకు చెందిన మిగ్వెయిల్ రేయస్, రిత్విక్/నికొలాస్ (కొలంబియా) జోడీలు మాత్రం రెండో రౌండ్ నుంచే వెనుదిరిగాయి. నాలుగో సీడ్ అర్జెంటీనా, స్పెయిన్ జంట జెబలోస్/మార్సెల్‌తో జరిగిన పోరులో బాలాజీ జోడీ 4-6, 4-6తో పరాజయం పాలైంది. రిత్విక్ ద్వయం 4-6, 6-7 (9)తో బ్రిటన్ జంట శాలిస్‌బరీ/కుప్‌స్కీ చేతిలో ఓడింది.



పారా అథ్లెటిక్స్‌లో లోకేశ్వరికి కాంస్యం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో హైదరాబాద్ అమ్మాయి లోకేశ్వరి కాంస్యం సాధించింది. శనివారం చెక్ రిపబ్లిక్‌లోని ఒలొమౌక్‌లో జరిగిన డిస్కస్ త్రో టీ37 కేటగిరీలో లోకేశ్వరి డిస్క్‌ను 14.66 మీటర్ల దూరం విసిరి తృతీయ స్థానంలో నిలిచింది. సిమోని (దక్షిణకొరియా) స్వర్ణం, రోసా కరోలినా (ఉజ్బెకిస్థాన్) రజతం సాధించారు.

విజయవాడకు ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం

- త్వరలో ఉప్పునీటి రొయ్యల పరిశోధన ప్రాంతీయ కార్యాలయం కూడా..
- ఆక్వా అథారిటీ కో-వైస్ చైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి వెల్లడి

అమరావతి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ), కేంద్ర ఉప్పునీటి రొయ్యల పరిశోధన సంస్థ (సీఐబీఏ) ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయని ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ కో-వైస్ ఛైర్మన్ ఆనం వెంకట రమణారెడ్డి చెప్పారు. శనివారం మత్స్యశాఖ కమిషనర్ రాంశంకర్‌నాయక్‌తో కలిసి రొయ్యల వ్యాధులపై ఆక్వా భాగస్వాములతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్న ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయాన్ని విజయవాడకు తరలించాలని, చెన్నైలో ఉన్న కేంద్ర ఉప్పునీటి రొయ్యల పరిశోధన సంస్థ(సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్రేకిష్‌వాటర్ ఫర్ ఆక్వాకల్చర్)కు ప్రాంతీయ కేంద్రాన్ని ఏపీలో ఏర్పాటు చేయాలని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖలు రాసినట్లు తెలిపారు. దీంతో త్వరలో ఈ సంస్థలు రాష్ట్రంలో ఏర్పాటవుతాయన్నారు. కాగా, ఆక్వా రైతులకు రొయ్యల సాగులో ఉత్తమ విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు ఆనం తెలిపారు. రైతులకు వ్యాధి రహిత రొయ్య పిల్లలను సరఫరా చేయాలని హేచరీల నిర్వాహకులకు సూచించారు. భీమవరం, కాకినాడ, అమలాపురం, బాపట్ల, మచిలీపట్నం, నెల్లూరు ప్రాంతాల్లో ఈహెచ్‌పీ, వైట్‌గట్, విబ్రియో ఇన్ఫెక్షన్స్ బారిన పడిన రొయ్యల నుంచి నమూనాలు సేకరించినట్లు ఆయన చెప్పారు. వర్షాకాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ వైరస్‌లు ఆశిస్తున్నాయని, ఇందుకు వాతావరణ మార్పులు, చెరువుల్లో అమ్మోనియా, నైట్రేట్ తీవ్రత కారణమని గుర్తించినట్లు తెలిపారు. మత్స్యశాఖ అధికారులు మాట్లాడుతూ.. తల్లి రొయ్య ద్వారా వ్యాధి వచ్చే అవకాశం లేదని, మేతగా వాడే లైవ్ ఫీడ్ వల్ల ఈ వ్యాధులు వస్తాయని పేర్కొన్నారు.

10 వరకు 'అన్నదాత-సుఖీభవ' ఫిర్యాదుల స్వీకరణ

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): అన్నదాత-సుఖీభవ పథకం కింద లబ్ధి పొందేందుకు గత నెల 30వరకు వెబ్‌ల్యాండ్‌లో నమోదైన రైతుల భూమి ఖాతాలకు అర్హత కల్పించినట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాత సుఖీభవకు అర్హతపై రైతుల ఫిర్యాదులను ఈ నెల 10వ తేదీ వరకు రైతుసేవా కేంద్రాల ద్వారా స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మొదటి దశలో.. ప్రాథమిక దశలో తిరస్కరణకు గురైన రికార్డులు, రెండో దశలో ధ్రువీకరణలో అనర్హతకు గురైన రికార్డులను గ్రీవెన్స్ మాడ్యూల్‌లో పొందుపర్చినట్లు చెప్పారు. దీంతో పాటు తహసీల్దార్ లాగిన్‌లో పెండింగ్‌లో ఉన్న ఖాతాలను కూడా గ్రీవెన్స్ మాడ్యూల్‌లో చేర్చినట్లు తెలిపారు. వీటిపై రైతుసేవాకేంద్రం నుంచి జిల్లా స్థాయి వరకు వ్యవసాయ అధికారులు అవగాహనతో ఉండాలని ఆయన సూచించారు.

రెవెన్యూకు ఆర్థికశాఖ షాక్!

- జగన్ హయాంలో అడ్డగోలుగా సృష్టించిన
- 300 డీటీ పోస్టులను ఆమోదించబోం
- రెగ్యులరైజ్ చేయాలన్న ప్రతిపాదనకు నో
- అవి తాత్కాలిక పోస్టులు,
- వాటికి హేతుబద్ధత లేదన్న ఆర్థికశాఖ
- శాశ్వత సిబ్బంది సంఖ్యలో కలుపొద్దని స్పష్టీకరణ
- న్యాయసలహా పొందాలని రెవెన్యూకు దిశానిర్దేశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ ప్రభుత్వంలో జరిగిన అనేకానేక తప్పులను చంద్రబాబు సర్కారు సరిదిద్దుతోంది. కానీ, రెవెన్యూశాఖ మాత్రం జగన్ సర్కారులో జరిగిన తప్పులను రెగ్యులరైజ్ చేయాలని చూస్తోంది. గత ఎన్నికలకు ఏడాది ముందు ఓ అధికారి ధనదాహం కోసం నాడు అడ్డగోలుగా సృష్టించిన 300 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులను క్రమబద్ధీకరించాలంటూ ఆర్థికశాఖకు ప్రతిపాదన పంపింది. అయితే, అనూహ్యరీతిలో రెవెన్యూశాఖకు ఆర్థిక శాఖ షాక్ ఇచ్చింది. రెవెన్యూది హేతుబద్ధత లేని ప్రతిపాదన అని తేల్చేసింది. అవి తాత్కాలిక పోస్టులని, శాశ్వత సిబ్బంది సంఖ్యలో కలపొద్దని గట్టిగా తేల్చిచెప్పింది.

జగన్ ప్రభుత్వంలో రెవెన్యూశాఖలో కీలక పోస్టులో ఉన్న ఓ జూనియర్ అధికారి 2023లో 300 మంది సీనియర్ అసిస్టెంట్లకు డిప్యూటీ తహసీల్దార్‌లుగా(డీటీ) అడహక్ పదోన్నతులు ఇచ్చారు. అందులో 175 మందిని ఎలక్షన్ డీటీలుగా పంపిస్తే, మిగిలిన 125 మంది రెవెన్యూయేతర శాఖల్లో (ఫారిన్ సర్వీస్) ఉన్నారు. వీరికిచ్చిన అడహక్ పదోన్నతులను శాశ్వతమైనవిగా చూపించేందుకు, ఆ తర్వాత వారి పోస్టులను శాశ్వత ఉద్యోగుల సంఖ్యలో (పర్మినెంట్ కేడర్) కలిపేందుకు ప్రయత్నాలు చేశారు. ఇందుకోసం ఆ అధికారి భారీగా దండుకున్నారని, ఆయన అడ్డగోలు పనులు చేశారన్న ఆరోపణలు, విమర్శలు వెల్లువెత్తాయి. జగన్ ప్రభుత్వంలో ఉండగానే అది వర్కవుట్ కాలేదు. అడ్డగోలు పదోన్నతులు ఇచ్చిన అధికారి ఆ తర్వాత పోస్టును వదులుకొని ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక తన పలుకుబడిని ఉపయోగించి ఆ నాడు తాను సృష్టించిన 300 పోస్టులను శాశ్వత ఉద్యోగుల సంఖ్యలో చూపించాలని మరోసారి సదరు వ్యక్తి ప్రయత్నం చేశారు. ఈ మేరకు భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నుంచి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియాకు ప్రతిపాదనలు వచ్చాయి. ఈ పరిణామంపై "సర్కారుకు తెలియకుండా 300 డీటీ పోస్టుల సృష్టి" శీర్షికతో ఆంధ్రజ్యోతి వార్తను ప్రచురించింది. ఈ వార్తపై స్పందించిన నాటి రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నివేదిక కోరారు. సీసీఎల్ఏ పంపించిన ప్రతిపాదనలపై సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ), ఆర్థికశాఖల అభిప్రాయాలు కోరారు. వాటిపై రెవెన్యూశాఖకు షాక్‌ఇచ్చేలా అభిప్రాయాలు వచ్చాయి.

వాటిని ఆమోదించలేం : ఆర్థికశాఖ

2023లో జగన్ ప్రభుత్వంలో సృష్టించిన 300 డిప్యూటీ తహసీల్దార్ పోస్టులను ఆమోదించలేమని ఆర్థిక శాఖ తేల్చిచెప్పింది. ఈ మేరకు రెవెన్యూశాఖకు లిఖితపూర్వకంగా తన అభిప్రాయం తెలియజేసింది. "ఆ పోస్టులకి హేతుబద్ధత లేదు. కాబట్టి అడహక్ పదోన్నతుల ద్వారా భర్తీచేసిన ఆ పోస్టులను ఆమోదించి శాశ్వాత ఉద్యోగుల సంఖ్యలో కలపలేం. ఈ విషయంలో తదుపరి చర్యలు తీసుకునేందుకు న్యాయశాఖ అభిప్రాయం తీసుకోండి" అని ఆర్థిక శాఖ తేల్చిచెప్పింది.

మరోసారి తేల్చుకోండి

ఇక ఇదే అంశంపై సాధారణ పరిపాలన శాఖ మరింత స్పష్టత ఇచ్చింది. అడహక్ పదోన్నతుల ద్వారా సృష్టించిన 300 డీటీ పోస్టులను శాశ్వత ఉద్యోగుల సంఖ్యలో కలపలేమని ఆర్థికశాఖ తేల్చిచెప్పిన నేపథ్యంలో, ఇక ఇందులో తాము చేసేది కొత్తగా ఏమీలేదని పేర్కొంది. ఈ విషయంలో మరోసారి ఆర్థిక శాఖతోనే తేల్చుకోవాలంది. ఇంకా న్యాయశాఖ సలహాకూడా తీసుకోవాలని సూచించింది. అడహక్ పదోన్నతుల విషయంలో ఇటు ఆర్థికశాఖ, అటు జీఏడీ.. న్యాయశాఖ సలహా తీసుకోవాలని సూచించాయి. కానీ రెవెన్యూశాఖ ఆ పనిచేయలేదు. ఎందుకంటే, ఈ పోస్టుల విషయంలో హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. రెవెన్యూశాఖ కౌంటర్ దాఖలు చేయాలి. అదే జరిగితే మొదటికే మోసం వస్తుంది. దీంతో ఏం చేయాలో రెవెన్యూకు దిక్కుతోచడం లేదు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకే సోషల్ మీడియా కేసుల్లో రిమాండ్

- ఉల్లంఘిస్తే శాఖాపరమైన విచారణ.. కోర్టు ధిక్కరణ చర్యలు తప్పవు
- మేజిస్ట్రేట్‌లకు హైకోర్టు స్పష్టీకరణ.. సర్క్యులర్ జారీ చేసిన రిజిస్ట్రార్

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత, అభ్యంతరకర పోస్టులు, వ్యాఖ్యలకు సంబంధించిన కేసులలో నిందితులకు రిమాండ్ విధించే సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాలని రాష్ట్రంలోని మేజిస్ట్రేట్లకు హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు రిజిస్ట్రార్ జ్యుడీషియల్ శనివారం సర్క్యులర్ జారీ చేశారు. నిందితులకు రిమాండ్ విధించే సమయంలో అర్నేష్‌కుమార్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసులో సుప్రీంకోర్టు మార్గదర్శకాలు పట్టించుకోకుండా మేజిస్ట్రేట్‌లు నిందితులకు రిమాండ్ విధిస్తున్నట్లు కోర్టు దృష్టికి వచ్చిందని హైకోర్టు తెలిపింది. ప్రసంగం, రచన, కళాత్మక వ్యక్తీకరణకు సంబంధించి అందిన ఫిర్యాదులలో ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 173(3) కింద ప్రాథమిక విచారణ జరపాలని(3-7 ఏళ్లలోపు శిక్షపడే కేసులు) పోలీసులకు స్పష్టం చేసింది. ప్రాథమిక విచారణకు ముందు సంబంధిత డీఎస్పీ నుంచి అనుమతి తీసుకోవాలని, 14 రోజుల్లో విచారణ ముగించాలని తీర్పులో పేర్కొంది. నిందితులు సదరు నేరాలను మళ్లీ మళ్లీ చేశారా?. సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందా?. ఆధారాలను తారుమారు చేయగలరా?. కస్టోడియల్ విచారణ అవసరమా?. తదితర అంశాలపై మేజిస్ట్రేట్లు సంతృప్తి చెందిన తర్వాతే రిమాండ్ విధింపుపై నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. సర్క్యులర్‌లో సూచనలను మేజిస్ట్రేట్‌లు తప్పకుండా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే శాఖాపరమైన విచారణను ఎదుర్కోవడమే కాకుండా కోర్టు ధిక్కరణ కింద చర్యలకు బాధ్యులవుతారని స్పష్టం చేసింది.

గిన్నిస్ రికార్డు కోసమే మెగా పీటీఎంలో సంతకం

- సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0లో 2.28 కోట్ల మందికి పైగా పాల్గొనేలా చేసి గిన్నిస్ రికార్డు నెలకొల్పే ప్రయత్నం చేస్తున్నామని సమగ్ర శిక్ష పథకం సంచాలకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. గిన్నిస్ బృందం ఇచ్చిన సూచనల మేరకు రిజిస్ట్రేషన్‌కు సాక్ష్యంగా టీచర్లు, తల్లిదండ్రులు కాకుండా.. అదే పాఠశాల పరిధిలో.. గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు, రిటైర్డ్ ప్రభుత్వోద్యోగి, దాత, పూర్వ విద్యార్థి.. ఇలా ఎవరినైనా సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. గిన్నిస్ రికార్డు కోసం లీప్ యాప్‌లో మెగా పీటీఎం 2.0 రిజిస్ట్రేషన్‌లో ఇతర వ్యక్తి సాక్ష్యం అవసరమని, అంతకుమించి సంతకం వెనుక ఎలాంటి దురుద్దేశాలు లేవని పేర్కొన్నారు.



అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం డోనేకల్లు గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

పల్లెల్లో అశాంతి పోయి ప్రశాంతత వచ్చింది

» జగన్ రౌడీల్ని రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారు: మంత్రి పయ్యావుల

విడపనకల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి అధికారం చేపట్టాక రాష్ట్రంలోని పల్లెల్లో అశాంతి తొలగిపోయి ప్రశాంత వాతావరణం ఏర్పడింది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రజలు అభద్రత, అశాంతి నడుమ జీవనం సాగించారు' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం డోనేకల్లు గ్రామంలో శనివారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మహిళల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక అమలు చేసిన వివిధ పథకాలను వివరించారు. రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్మును త్వరలోనే అందిస్తామని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అంతా జాతీయ రహదారిని పూర్తి చేయలేదని విమర్శించారు. "జగన్ రౌడీల్ని, ఎక్కడికి వెళ్లినా అశాంతిని సృష్టిస్తున్నారు. రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారు. పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళ్లి మహిళలపై దాడులు చేయించారు. ఓ వ్యక్తిని పరామర్శించేందుకు వెళ్లి కారు టైరు కింద మరో వ్యక్తి నలిగిపోయేలా చేశారు. రప్పా రప్పా నరుకుతామంటే మంచిదే కదా అని జగన్ అంటున్నారు. 'ప్రజలారా... నరుక్కుని చావండి... రౌడీల్లారా నా వెంట రండి..' అంటున్నారు. చంద్రబాబు పాలనలో అలాంటి ఆటలు సాగవు. ప్రశాంతత, స్వేచ్ఛను ఇచ్చే ప్రభుత్వం మాది" అని అన్నారు. జగన్, రైతులపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారంటూ మంత్రి వివరణాత్మక విమర్శ చేశారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి టీజీ భరత్



కర్నూలు న్యూసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): 'పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగర పాలక కార్యాలయంలో శనివారం 'స్వర్ణాంధ్ర-పీ4'పై సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. స్వర్ణాంధ్ర-పీ4 కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు భరోసా లభిస్తుందని అన్నారు. రాష్ట్రంలో ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలు, లక్ష మంది మార్గదర్శులను గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. బంగారు కుటుంబాలకు సరైన సమయంలో సహకారం, నిరంతర గైడెన్స్ ఇవ్వడం వంటి బాధ్యతలను మార్గదర్శులు తీసుకుంటారన్నారు. సీఎం చంద్రబాబు ముందు చూపు కలిగిన వ్యక్తి అని, ఆయన నాయకత్వంలో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని మంత్రి భరత్ అన్నారు.

కక్షపూరిత రాజకీయాలకు కేరాఫ్ జగన్: కొల్లు



అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం అయింది. గ్రామాల్లో నెత్తుటి ఏర్లు పారించిన సంస్కృతి జగన్‌రెడ్డిది. బియ్యం దొంగతనం చేసిన వ్యక్తితో జగన్ ప్రెస్‌మీట్లు పెట్టిస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను హింసించారు. గుంటూరు జిల్లాలో వైసీపీ నాయకుల వేధింపులకు భయపడి ఊర్లు ఖాళీ చేశారు. కక్షపూరిత రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ జగన్. టీడీపీ కార్యాలయాలపై దాడులు చేసిన వారికి పదవులు ఇచ్చి ప్రోత్సహించిన ఘనత జగన్‌ది' అని మంత్రి కొల్లు ధ్వజమెత్తారు.

మామిడి రైతును దోచుకుంది వైసీపీ సిండికేటే

» మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల కష్టాలను వైసీపీ నాయకులు రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారంటూ రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుంటే వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో వైసీపీ నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం మామిడి రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వైసీపీ నాయకులతో సత్సంబంధాలు కలిగిన పీఎల్ఆర్ ఫుడ్స్, సీజీఆర్ ఫుడ్స్, టాసా, సన్నిధి వంటి కంపెనీలు రైతుల నుంచి కిలో రూ.8కి మామిడిని కొనుగోలు చేస్తున్నాయి. ఇది ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్నా తక్కువ. వైసీపీ నాయకులు సిండికేట్‌గా ఏర్పడి మామిడి రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారు' అని మర్రెడ్డి అన్నారు.

అమరావతి రాజధానికి మరో 20,494 ఎకరాలు

» భూసమీకరణకు ప్రభుత్వం నిర్ణయం

» చంద్రబాబు అధ్యక్షతన సీఆర్‌డీఏ అథారిటీ

» సమావేశంలో 7 అంశాలకు ఆమోదం

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో 20,494 ఎకరాలను భూసమీకరణ ప్రక్రియ ద్వారా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. శనివారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్‌డీఏ 50వ అథారిటీ సమావేశంలో రాజధాని నిర్మాణానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మొత్తం ఏడు అంశాలకు ఆమోదం తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కార్లపూడిలేమల్లే, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలోని వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల్లో భూసమీకరణ చేయాలని నిర్ణయించారు. మందడం, రాయపూడి, పిచుకలపాలెంలో ఫైనాన్స్, స్పోర్ట్స్ సిటీలోని దాదాపు 58 ఎకరాల్లో హైడెన్సిటీ రెసిడెన్షియల్ జోన్, మిశ్రమ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణానికి ఆర్ఎఫ్‌పీని ఆహ్వానించేందుకు అనుమతించారు. అలాగే అమరావతిలో నిర్మించే ఫైవ్‌స్టార్ హోటళ్లకు సమీపంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం కోసం సీఆర్‌డీఏ చేసిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపారు. మందడంలో వివంతా, హిల్టన్ హోటల్స్, తుళ్లూరులో హయత్, లింగాయపాలెం నోవాటెల్ సమీపంలో కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి రెండున్నర ఎకరాల చొప్పున కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఇసుక డీసిల్టేషన్‌కు అనుమతి

రాజధాని అమరావతిలో జరుగుతున్న నిర్మాణ పనులకు కృష్ణా నది నుంచి ఇసుకను డ్రెడ్జింగ్ చేసుకునేందుకు సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో అనుమతి మంజూరు చేశారు. ప్రస్తుతం రాజధానిలో రూ.49,040 కోట్ల విలువైన పనులు జరుగుతుండటంతో రానున్న రెండేళ్లలో వివిధ ప్రాజెక్టులకు 160 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమవుతుందని సీఆర్‌డీఏ అంచనా వేసింది. రాజధాని నిర్మాణానికి అవసరమయ్యే ఇసుకను ప్రకాశం బ్యారేజీ ఎగువన డీసిల్టింగ్ చేసుకునేందుకు అనుమతివ్వాలని జలవనరుల శాఖను కోరింది. రెండేళ్ల పాటు రాజధాని ప్రాజెక్టులకు అవసరమైన ఇసుకను తవ్వుకునేందుకు సమావేశంలో అనుమతించారు. ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియకు రూ.286 కోట్ల మేర వ్యయం కానున్నట్లు అధికారులు తెలిపారు.

వివిధ సంస్థలకు భూకేటాయింపులు



సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ అధికారులు

అమరావతి రాజధానిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులపై మంత్రుల సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలకు సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో ఆమోదం తెలిపారు. సీబీఐకు 2 ఎకరాలు, జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు 2 ఎకరాలు, స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు 5 ఎకరాలు, ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్‌కు 0.495 ఎకరాలు, పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీకి 12 ఎకరాలు, ఎంఎస్‌కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీకి 12 ఎకరాలు కేటాయించేందుకు అంగీకరించారు. అలాగే ఆదాయ పన్ను శాఖకు 2 ఎకరాలు, ఏపీ గ్రామీణ బ్యాంక్‌కు 2 ఎకరాలు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు 0.40 ఎకరాలు, ఎస్ఐబీకి 0.50 ఎకరాలు, కిమ్స్ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలకు 25 ఎకరాలు, బీజేపీ కార్యాలయ నిర్మాణానికి 2 ఎకరాలు, బాసిల్ ఉడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు 4 ఎకరాలు కేటాయించేందుకు ఆమోదం తెలిపారు. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, అంబికా గ్రూప్‌లకు గతంలో కేటాయించిన 1.40 ఎకరాలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మంగళగిరి సమీపంలో ఈ-15 రహదారిపై నాలుగు లేన్ల ఆర్‌ఓబీ నిర్మాణానికి ఆమోదం తెలిపారు.

అల్లూరి, అమరజీవి స్మారక చిహ్నాలు

రాజధాని అమరావతిలో స్ఫూర్తి ప్రదాతల స్మారక చిహ్నాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులకు సూచించారు. వివిధ ప్రాంతాల్లో నిర్మించే ఎకో పార్కులకు మంచి పేర్లు పెట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కొత్త ప్రాజెక్టుల కోసం అధికారులు ఎలాంటి భేషజాలు లేకుండా ప్రయత్నాలు చేయాలని సూచించారు. అమరావతి రాజధాని రాష్ట్ర ప్రజల సెంటిమెంట్ అని, గతంలో రాష్ట్ర సచివాలయాన్ని రికార్డు సమయంలో నిర్మించామని, అదే స్ఫూర్తితో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అమరావతిలో ఎయిర్‌పోర్టు నిర్మాణం విషయంలో కేంద్రంతో సంప్రదింపులు చేయాలని అధికారులకు సూచించారు. రాజధానిలో నిర్మించతలపెట్టిన ఏ ప్రాజెక్టూ ఆలస్యం కాకుండా చూడాలన్నారు. కొత్తగా వచ్చే ప్రాజెక్టులకు అనుమతులను త్వరితగతిన ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. నిర్మాణ పనులు సరిగా చేయని సంస్థలకు నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని, గడువులోగా పూర్తి చేసేలా నిర్దేశించాలని చంద్రబాబు సూచించారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఆర్‌డీఏ ఏడీసీ, ఆర్థిక శాఖ, సీసీఎల్ఏకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం మంత్రి నారాయణ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.

రాజధానికి భూములివ్వం

» పొన్నెకల్లు గ్రామసభలో ఆందోళన

తాడికొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చే ప్రసక్తే లేదని గుంటూరు జిల్లా తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామ రైతులు తేల్చి చెప్పారు. శనివారం తాడికొండ మండలం గరికపాడు, పొన్నెకల్లు, నిడుముక్కల గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ రెండో దశకు సంబంధించి గ్రామ సభలను నిర్వహించారు. పొన్నెకల్లు గ్రామసభను రద్దు చేయాలని రైతులు ఆందోళనలు చేపట్టారు. ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఆర్‌డీవో శ్రీనివాస్, ఇతర అధికారులు స్టేజ్‌పైకి రాగానే రైతులు ఒక్కసారిగా అక్కడికి వచ్చి గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. రైతులు శాంతించకపోవడంతో తాత్కాలికంగా గ్రామసభను రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

క్యాన్సర్ బాధిత కార్యకర్తకు సీఎం వీడియో కాల్

» చంద్రబాబును చూడాలన్న కోరిక మేరకు ఫోన్

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న టీడీపీ కార్యకర్త కోరికను సీఎం చంద్రబాబు తీర్చారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం మోరంపూడి జంక్షన్‌కు చెందిన ఆకుల కృష్ణ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. కృష్ణ తొలి నుంచీ టీడీపీ అభిమాని. చంద్రబాబు అంటే అమిత ఇష్టం. తన ఆరోగ్యం క్షీణిస్తుండటంతో చంద్రబాబుతో ఒక్కసారైనా మాట్లాడాలని కృష్ణ కోరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబు శనివారం స్వయంగా కృష్ణకు వీడియో కాల్ చేసి మాట్లాడారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాల ఆదుకుంటామని కృష్ణ కుటుంబానికి భరోసా ఇచ్చారు. చంద్రబాబు ఫోన్ చేయడంపై కృష్ణ సంతోషం వ్యక్తం చేశారు.

సూర్యా భాయ్ దందా!

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టు మాకు ఇవ్వండి. బాగా కీలకమైన పోస్టింగ్ మీకు ఇప్పిస్తా" అని బేరం పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఏమిటీ డీల్...

టెక్నాలజీకి అధిక ప్రాధాన్యం ఇచ్చే చంద్రబాబు పాలనలో ఒక శాఖ... కంప్యూటర్ స్థాయి నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగం దిశగా దూసుకెళుతోంది. అంతకుముందే రాష్ట్రంలోని 26 యూనిట్ల పరిధిలోని 1019చోట్ల కంప్యూటర్లు పెట్టి మొత్తం సమాచారాన్ని ఆన్‌లైన్‌లోకి తెచ్చింది. అయితే... గత ప్రభుత్వం ఆ వ్యవస్థను దాదాపు నీరు గార్చేసి తిరోగమనంలోకి తీసుకెళ్లింది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే మొత్తం కంప్యూటర్లను మార్చాల్సి ఉందని, సుమారు రూ.50 కోట్లు ఖర్చు అవుతాయని కీలకశాఖలోని ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపారు. అందుకు కేంద్రం నుంచి రూ.40 కోట్లు రాగా రాష్ట్ర ప్రభుత్వం మరో 10కోట్లు ఇచ్చింది. ఈ మొత్తంతో భారీ సంఖ్యలో డెస్క్‌టాప్ కంప్యూటర్ల కొనుగోలుకు ఆ శాఖలోని టెక్నికల్ విభాగం ప్రక్రియ మొదలు పెట్టింది. ఇదే అవకాశంగా భావించిన లాబీయిస్ట్ సూర్యా భాయ్... కీలక మంత్రికి మంచి ఆఫర్ ఉందని చెప్పాడు. డెస్క్‌టాప్‌ల కొనుగోలు ఆర్డర్ హైదరాబాద్‌కు చెందిన ఒక కంపెనీకి ఇప్పిస్తే ప్రతిఫలం భారీగా ఉంటుందని ఆశ పెట్టాడు. సంబంధిత కంపెనీ ప్రతినిధులను మంత్రితో మాట్లాడించి డెస్క్‌టాప్‌ల కొనుగోలు వ్యవహారాలు చూసే అధికారిని సైతం లైన్‌లో పెట్టాడు. ఆ మంత్రి కూడా సంబంధిత అధికారితో మాట్లాడి... ఎలాగైనా తాను సిఫారసు చేసిన కంపెనీకి డెస్క్‌టాప్ కంప్యూటర్ల ఆర్డర్లు ఇవ్వాలని ఒత్తిడి చేశారు.

ఆ అధికారికి పోస్టింగ్ ఆశ...

ప్రధాని మోదీతో సైతం పేరు పెట్టి పిలిపించుకునే... రాష్ట్ర ప్రభుత్వంలోని ఒక పవర్‌ఫుల్ నాయకుడిని ఆ అధికారి గతంలో బాగా ఇబ్బంది పెట్టారు. అప్పటి నుంచి ఆ అధికారిపై ఆ నాయకుడు కోపంగా ఉన్నారు. ఈ క్రమంలో ఆ ఆఫీసర్‌కు మంచి పోస్టింగ్ కూడా దక్కడంలేదు. అదే సమయంలో... తాము సూచించిన కంపెనీకి డెస్క్‌టాప్‌ల కొనుగోలు ఆర్డర్ ఇస్తే, 'మంచి పోస్టింగ్' ఇస్తామంటూ మంత్రి తరపున సూర్యా భాయ్ ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పుడు ఆ శాఖలో ఇదో పెద్ద చర్చనీయాంశంగా మారింది. నిజానికి... ఆ మంత్రి వ్యవహారం ఇప్పటికే ప్రభుత్వ పెద్దల దృష్టిలో పడింది. శాఖలో ఓ మోస్తరు హోదా ఉండే అధికారుల బదిలీలను కూడా చేయించుకోలేకపోయారు. పోస్టింగ్‌లకు 'ధర' నిర్ణయించారని సమాచారం అందడంతో... ప్రభుత్వం ఈ విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించింది. మరోవైపు... సదరు మంత్రి ఇటీవల దుబాయ్ పర్యటనలూ చేస్తున్నట్లు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో... 'డెస్క్‌టాప్'ల డీల్ మాట ఎలా ఉన్నా సదరు అధికారికి మాత్రం మంచి పోస్టింగ్ లభించే అవకాశమే లేదని చెబుతున్నారు. సూర్యా భాయ్ వ్యవహారంపై నిఘా విభాగం ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు తెలిసింది.

అమరావతిలో 'రియల్' చీటింగ్

» నకిలీ పత్రాలతో ఎన్నారై మహిళకు టోకరా

» పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



ఎన్నారై హసీనా

గుంటూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): అమరావతి ప్రాంతంలో 95 సెంట్ల పొలాన్ని విక్రయిస్తానంటూ ఓ వ్యక్తి నకిలీ పత్రాలు చూపించి ఎన్ఆర్ఐ మహిళ నుంచి రూ.16 లక్షలు స్వాహా చేశాడు. గుంటూరు నగరంలోని శ్యామలనగర్‌కు చెందిన హసీనా యూఆర్ఎలో ఉంటున్నారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం నెమలికల్లు గ్రామంలోని 95 సెంట్ల పొలాన్ని విక్రయిస్తానంటూ అమరావతికి చెందిన టీడీపీ నాయకుడు జాన్ సైదా మధ్యవర్తి గోపి ద్వారా ఆమెను సంప్రదించాడు. కంచేటి కుక్క మల్లేశ్వరయ్య నుంచి తాను ఆ పొలాన్ని కొనుగోలు చేసి అగ్రిమెంట్ రాయించుకున్నానంటూ ఓ నకిలీ అగ్రిమెంట్ సృష్టించి ఆమెకు చూపించాడు. గుంటూరు నగరం ఆర్ అగ్రహారంలో నివసిస్తున్న ఆమె సోదరి జాన్‌బీని ఆ పొలానికి తీసుకెళ్లి చూపించారు. రూ.75.52 లక్షలకు ఆ పొలాన్ని కొనేందుకు అంగీకరించిన హసీనా అడ్వాన్సుగా రూ.16 లక్షలు చెల్లించారు. నెల వ్యవధిలో మిగిలిన డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకునేలా తన సోదరి జాన్‌బీ పేరున మే 15న అగ్రిమెంటు రాయించుకున్నారు. జూన్ 20న గుంటూరుకు వచ్చిన హసీనా రిజిస్ట్రేషన్ చేయించేందుకు రావాలని జాన్ సైదాను కోరగా డొంకతిరుగుడు సమాధానాలు చెబుతున్నాడు. దీంతో హసీనాకు అనుమానం వచ్చి నెమలికల్లు వెళ్లి మాజీ సైనికుడు కంచేటి కుక్క మల్లేశ్వరయ్యను సంప్రదించారు. జాన్‌సైదా ఎవరో తనకు తెలియదని, తాను అతనికి అగ్రిమెంట్ రాయలేదని మల్లేశ్వరయ్య చెప్పడంతో బాధితురాలు శనివారం రాత్రి పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీస్ అధికారులకు, ఆన్‌లైన్‌లో సీఎంవోకు కూడా ఫిర్యాదు పంపారు.

విద్యార్థినిపై ఆటోడ్రైవర్ అత్యాచారం

» ఒంటరిగా బస్టాండ్ వద్ద దిగిన బాలికపై కన్ను

» మానసిక ఒత్తిడితో ఉందని గుర్తించి మాయమాటలు


» రాత్రివేళ బైపాస్ పక్కన వెంచర్‌లోకి తీసుకెళ్లి దారుణం

» కర్నూలు జిల్లా ఆదోనిలో ఘటన

ఆదోని రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, మానసిక ఒత్తిడితో బాధపడుతున్న ఇంటర్ విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. కర్నూలు జిల్లా ఆదోనిలో శుక్రవారం జరిగిందీ దారుణం. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సి.బెళగల్ మండలానికి చెందిన బాలిక పత్తికొండ మండలంలోని ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్మీడియెట్ చదువుతోంది. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. మానసిక ఒత్తిడిలోనూ ఉంది. దీంతో శుక్రవారం ఉదయం బాలికను తల్లి ఎమ్మిగనూరులోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తిరుగుప్రయాణంలో బస్టాండ్ వద్ద తప్పిపోయిన బాలిక సాయంత్రం 6.30 గంటలకు ఆదోనిలో ఆదోని-ఆస్పరి బైపాస్ వద్దకు చేరుకుంది. అక్కడి నుంచి ఆదోని మండలం ఇస్వీ గ్రామానికి చెందిన రమేశ్ ఆటోలో ఆమె తిరిగి బస్టాండ్‌కు చేరుకుంది. తల్లిదండ్రులకు ఫోన్ చేసేందుకు ఫోన్ ఇవ్వాలని బాలిక ఆటో డ్రైవర్‌ను అడగగా ఇవ్వలేదు. ఆమె మానసిక ఒత్తిడిలో ఉన్నట్లు గమనించిన రమేశ్ మాటలు కలిపాడు. కులం, కుటుంబ వివరాలు అడిగాడు. తనదీ అదే కులమని చెప్పాడు. చీకటి పడిన సమయంలో ఒంటరిగా ఉండడం మంచిది కాదని, తన అక్క ఇంటికి తీసుకెళ్తానని నమ్మించి ఆదోని-ఎమ్మిగనూరు బైపాస్ పక్కనున్న ఓ వెంచర్‌లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. బాలిక కేకలు వేయడంతో రమేశ్ భయపడి తిరిగి ఆటోలో ఆదోని పట్టణంలోకి తీసుకొచ్చాడు. స్నేహితుడి సాయంతో బాలికను ఓ ప్రైవేటు హాస్టల్‌కు తీసుకెళ్లాడు. బాలికను హాస్టల్‌లో ఉంచడానికి పోలీసుల అనుమతి అవసరమని నిర్వాహకులు చెప్పడంతో తిరిగి పోలీసుస్టేషన్‌కు వెళ్లారు. అక్కడ త్రీటౌన్ సీఐ రామలింగయ్య బాలికను విచారించగా జరిగిన విషయం చెప్పింది. వెంటనే రమేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటన తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో జరిగినందున అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. నిందితుడిపై పోక్సో, అత్యాచారం కేసు నమోదు చేశామని తాలుకా సీఐ నల్లప్ప తెలిపారు.



తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు పరవళ్లు తొక్కుతున్న వరద జలాలు



జలకళతో తొణికిసలాడుతున్న శ్రీశైలం డ్యాం

నేడు అక్కడక్కడా వర్షాలు

పశ్చిమ బెంగాల్ పరిసరాల్లో శనివారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో ఆదివారం అక్కడ భూ ఉపరితలంపై అల్పపీడనం ఏర్పడనుంది. ఈ అల్పపీడనం దూరంగా ఉన్నందున రాష్ట్రంపై పెద్దగా ప్రభావం ఉండదని వాతావరణ నిపుణులు చెప్పారు. కాగా శనివారం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. మిగిలినచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. నెల్లూరులో 38 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తా తీరం వెంబడి బలంగా గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

లోకం తీరు



కృష్ణ, తుంగభద్ర పరవళ్లు

జూరాల, సుంకేసుల నుంచి దిగువకు భారీగా నీటి ప్రవాహం... శ్రీశైలం డ్యాంకు పోటెత్తుతున్న వరద

- జలాశయంలో 175.10 టీఎంసీలు నిల్వ
- తుంగభద్రకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- పొంగుతున్న గోదావరి, పెరుగుతున్న నీటిమట్టం

కర్నూలు/పోలవరం/విశాఖపట్నం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా, తుంగభద్ర నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఎగువన జూరాల ప్రాజెక్టు నుంచి 1,21,471 క్యూసెక్కులు, కర్నూలు జిల్లా సుంకేసుల బ్యారేజీ నుంచి 66,589 క్యూసెక్కులు శ్రీశైలంకు విడుదల చేస్తున్నారు. ఈ నీరు ఆదివారం సాయంత్రానికి డ్యాంకు చేరుతుందని ఇంజనీర్లు తెలిపారు. డ్యాం సైట్‌లో 1,30,780 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం 877.40 అడుగుల స్థాయిలో 175.10 టీఎంసీలు డ్యాంలో నిల్వ చేసి, విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు ద్వారా 67,019 క్యూసెక్కులు నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. ఇదే స్థాయిలో వరద ప్రవాహం కొనసాగితే మూడు నాలుగు రోజుల్లో క్రస్ట్ గేట్లు ఎత్తే అవకాశం ఉందని కడప ఇరిగేషన్ ప్రాజెక్టు సీఈ, శ్రీశైలం ప్రాజెక్టు ఇన్‌చార్జి ఎస్ఈ శ్రీరామ చంద్రమూర్తి చెప్పారు. కాగా 10వ గేటు దిగువన రబ్బర్ సీల్ నుంచి స్వల్ప లీకేజీ వస్తుండడంతో పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తుంగభద్రకు రికార్డు వరద

గత పదేళ్ల రికార్డును అధిగమించి తుంగభద్రకు వరద ప్రవాహం కొనసాగుతోంది. శనివారం 72,931 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంది. మరమ్మతుల దృష్ట్యా 80 టీఎంసీలే నిల్వ చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో 76.519 టీఎంసీలు నిల్వచేసి, 22 గేట్లెత్తి 64,702 క్యూసెక్కులు దిగువకు వదిలేస్తున్నారు. సుంకేసుల వద్ద సాయంత్రం 6 గంటలకు 66,589 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగువన శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. నీరు పుష్కలంగా వస్తున్నందున తక్షణమే కాలువకు సాగునీరు విడుదల చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు.



గండి పోశమ్మ ఆలయంలోకి చేరిన గోదావరి వరద

భద్రాచలం వద్ద 20 అడుగులకు నీటిమట్టం

ఉపనదుల నుంచి వస్తున్న ప్రవాహంతో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతోంది. శనివారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 20.3 అడుగులకు చేరుకుంది. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వేలో నుంచి 1,87,051 క్యూసెక్కుల అదనపు జలాలను దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. కాఫర్ డ్యాంకి ఎగువన నీటిమట్టం పెరగడంతో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు గండి పోశమ్మ ఆలయంలోకి వరద చేరింది. దీంతో అధికారులు ఆలయానికి రాకపోకలు నిలిపివేశారు.



తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతికి రూ.కోటి చెక్కును అందజేస్తున్న పరమేశు బయోటెక్ ఎండీ ఆనంద్‌స్వరూప్, పక్కన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

ప్రభుత్వాస్పత్రికి పరమేశు బయోటెక్ రూ. కోటి విరాళం

- తూర్పు కలెక్టర్‌కు చెక్ అందజేసిన ఎండీ ఆనంద్ స్వరూప్

గోపాలపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి పరమేశు బయోటెక్ లిమిటెడ్ ఎండీ ఆనంద్‌స్వరూప్ రూ.కోటి విరాళం అందించారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరంలో, జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కలిసి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద సంబంధిత చెక్‌ను అందజేశారు. ఆస్పత్రిని పునఃనిర్మించాలని సూచించారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చొరవతో ఈ నిధులు అందించగా, ఎండీ స్వరూప్‌ను ఎమ్మెల్యేతోపాటు, కలెక్టర్ అభినందించారు. సామాజిక అవసరాలకు ప్రభుత్వంతో పాటు దాతల సహకారం అభినందనీయమన్నారు.



క్యాథ్‌ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ ఈడీ, సీఈవో అహంతెం శాంతా సింగ్

మంగళగిరి ఎయిమ్స్‌లో అధునాతన క్యాథ్‌ల్యాబ్

- ప్రారంభించిన ఎయిమ్స్ సీఈవో శాంతా సింగ్
- అందుబాటులోకి ప్రపంచ స్థాయి కార్డియాలజీ సేవలు

మంగళగిరి సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన సెవెన్త్ జనరేషన్ బైప్లేన్ క్యాథ్‌ల్యాబ్‌ను, టీఎంటీ పరికరాలను ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఈవో ప్రొఫెసర్ అహంతెం శాంతా సింగ్ శనివారం ప్రారంభించారు. గుండె సంరక్షణ, న్యూరోవాస్కులర్ ఇంటర్వెన్షన్స్ సేవలు, సంక్లిష్టమైన ఎండోవాస్కులర్ సేవలను మెరుగు పరిచేలా ఆ క్యాథ్‌ల్యాబ్‌ను తీర్చిదిద్దారు. ఈ అధునాతన టెక్నాలజీ ద్వారా కార్డియాలజీ విభాగంలో ప్రపంచ స్థాయి రోగ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వీలవుతుందని ఈ సందర్భంగా శాంతా సింగ్ అన్నారు. సుమారు రూ. 11 కోట్ల ఖరీదు చేసే నూతన ల్యాబ్ ద్వారా కరోనరీ యాంజియోప్లాస్టీ, పుట్టుకతో వచ్చే గుండె జబ్బులు, స్ట్రక్చరల్ హార్ట్ ప్రొసీజర్లు, ఎలక్ట్రోఫిజియోలాజికల్ అధ్యయనాలు చేయవచ్చన్నారు. దీంతో కచ్చితమైన ఫలితాలు వస్తాయని చెప్పారు. వ్యాధిని ముందస్తుగా గుర్తించేందుకు ట్రెడ్‌మిల్ టెస్ట్ పరికరాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఎయిమ్స్ హాస్టల్ ప్రాంగణానికి సమీపంలో బ్యాడ్మింటన్ కోర్టుల సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏఆర్ నటరాజ్, కార్డియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అమృత గణేష్, ఇతర అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

13 మంది ఎయిమ్స్ విద్యార్థులపై చర్యలు

మంగళగిరి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్‌లో ర్యాగింగ్ ఘటనకు సంబంధించి 13 మంది వైద్య విద్యార్థులపై చర్యలు తీసుకున్నట్టు ఆ సంస్థ అధికార ప్రతినిధి డాక్టర్ వంశీకృష్ణారెడ్డి వెల్లడించారు. శనివారం ఎయిమ్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. '13 మంది విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడినట్టుగా గుర్తించాం. వారిని ఆరు నెలల నుంచి ఏడాదిన్నరపాటు సస్పెండ్ చేయడంతోపాటు ఒక్కొక్కరికి రూ.25 వేల జరిమానా కూడా విధించాం. ఆ విద్యార్థులను ఎయిమ్స్ వసతి గృహం నుంచి పూర్తిగా బహిష్కరించాం. సస్పెన్షన్ కాలం పూర్తయిన తర్వాత కూడా వారు హాస్టల్‌లో వుండే అవకాశం లేదు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాం. వారి భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని పేర్లను బయటకు వెల్లడించడం లేదు' అని వంశీకృష్ణారెడ్డి తెలిపారు.

లోక్ అదాలత్‌లకు విశేష స్పందన

- ఒక్కరోజే 78,168 కేసుల పరిష్కారం

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లకు విశేష స్పందన లభించింది. శనివారం ఒక్కరోజే 78,168 కేసులు పరిష్కారమయ్యాయి. మొత్తం రూ.63 కోట్ల పరిహారం అందజేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయస్థానాల్లో 411 లోక్ అదాలత్ బెంచ్‌లు నిర్వహించారు. ఇరువర్గాల ఆమోదంతో రాజీకి అవకాశం ఉన్న కేసులను పరిష్కరించారు. ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర హైకోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు జస్టిస్ అవధానం కుంచం మహేశ్వరరావు, జస్టిస్ వై.లక్ష్మణరావు పాల్గొన్నారు. పెండింగ్‌లో ఉన్న135 కేసులు పరిష్కరించి రూ.3.85 కోట్ల పరిహారం అందజేశారు. లోక్ అదాలత్‌లు విజయవంతం కావడానికి సహకరించిన న్యాయవాదులు, కక్షిదారులు, అధికారులకు ఏపీ న్యాయసేవాధికార సంస్థ సభ్యకార్యదర్శి, ఏపీ హైకోర్టు న్యాయసేవల కమిటీ ఇన్‌చార్జ్ కార్యదర్శి బీఎస్‌వీ హిమబిందు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజు కట్టలేదని ఫొటోలు తీశారు!

- ఆ అవమానం భరించలేకున్నా తల్లిదండ్రులకు కుమార్తె లేఖ
- డీ-ఫార్మసీ విద్యార్థిని అదృశ్యం
- అన్నమయ్య జిల్లాలో ఘటన



అదృశ్యమైన శ్వేతశ్రీ



తల్లిదండ్రులు సూర్యనారాయణ, సుజాత

మదనపల్లె, జూలై 5(ఆంధ్రజ్యోతి): "ఫీజు కట్టలేదని బయట నిలబెట్టి ఫొటోలు తీశారు. కాలేజీలో ఫీజుకోసం పెట్టే ఒత్తిడి తట్టుకోలేను, అవమానం భరించలేను. ఇక అక్కడ నేను చదవలేను. సారీ.. మమ్మీ, సారీ.. డాడీ. ఇంటి నుంచి వెళ్లిపోతున్నా. చనిపోవాలని నిర్ణయించుకున్నా." అంటూ తల్లిదండ్రులకు లేఖ రాసి ఓ విద్యార్థిని ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆ తల్లిదండ్రులు రోదిస్తూ.. పోలీసులను ఆశ్రయించారు. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం పట్టేంవాండ్లపల్లెకు చెందిన సూర్యనారాయణ, సుజాత దంపతుల ఏకైక కుమార్తె శ్వేతశ్రీ(21) ఓ కళాశాలలో డీ-ఫార్మసీ చదువుతోంది. తల్లిదండ్రులు పలమనేరులోని కోళ్లఫారంలో పనిచేస్తున్నారు. స్థానిక సీటీఎంలోని నేతాజీ కాలనీలో నివాసం ఉంటున్నారు. శ్వేతశ్రీ రోజూ ఇంటి నుంచే కళాశాలకు వెళ్తోంది. డీ-ఫార్మసీ రెండో ఏడాదిలో కొంత ఫీజు బ్యాలెన్స్ ఉంది. దీంతో బ్యాలెన్స్ ఫీజు చెల్లించాలని శ్వేతశ్రీని.. కళాశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తున్నట్టు తల్లిదండ్రులు తెలిపారు. ఈ నెల 2న ఫీజు చెల్లించని విద్యార్థినులను బయట నిలబెట్టి ఫొటోలు తీశారని, కాలేజీ మానేస్తానని ఇంట్లో చెప్పింది. డబ్బులు కట్టేస్తామని వారు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అయితే, శుక్రవారం యథావిధిగా కళాశాలకు బయలుదేరిన శ్వేతశ్రీ.. ఫోన్ స్విచ్‌ఆఫ్ చేసి అదృశ్యమైంది. సాయంత్రం కళాశాలకు వెళ్లి విచారిస్తే.. రాలేదని చెప్పారు. ఫీజు చెల్లించని విద్యార్థులను నిలబెట్టి ఫొటోలు తీశారని, ఆ అవమానంతోనే తమ కుమార్తె ఇంటి నుంచి వెళ్లిపోయిందని తల్లిదండ్రులు వాపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు మదనపల్లె తాలూకా ఎస్ఐ గాయత్రి, సీఐ కళా వెంకటరమణ తెలిపారు. శ్వేతశ్రీకి ఫోన్ చేయగా తిరుమలలో ఉన్నట్లు గుర్తించామన్నారు. మరోసారి ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ వచ్చిందని చెప్పారు.

మందకొడిగా ఖరీఫ్ సాగు

- పది శాతం కూడా పడని విత్తనం
- చాలీచాలని వర్షాలే కారణం
- రాష్ట్రంలో 17.4 శాతం వానలోటు
- వరుణుడి కరుణ కోసం రైతుల ఎదురుచూపు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వానాకాలం వచ్చినా సాధారణ స్థాయిలోనూ వర్షాలు కురవక ఖరీఫ్ సాగు మందకొడిగా సాగుతోంది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు పక్షం రోజుల ముందే వచ్చినా.. అవి మందగించడంతో విస్తారమైన వర్షాలు కురవడం లేదు. ఈ కారణంగా భూమి పదునవ్వక.. మెట్ట ప్రాంతాల రైతులు విత్తనాలు వెదపెట్టలేకపోతున్నారు. రుతుపవనాలు ముందే వచ్చినందున ఈ సీజన్‌లో 86 లక్షల ఎకరాల్లో 21 రకాల పంటలు సాగులోకి తేవాలని వ్యవసాయశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవంగా ఖరీఫ్‌లో 77.9 లక్షల ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణంలో ఇప్పటికే 10 లక్షల ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉంది. అయితే ఇప్పటికి 7.4 లక్షల ఎకరాల్లో(10%) మాత్రమే విత్తనం పడింది. చాలీచాలని వానలతో భూమి పదునుకాక చాలా మంది రైతులు విత్తనాలు వెదపెట్టేందుకు జంకుతున్నారు. ఒరువు వాతావరణంలో విత్తనం నాటితే.. మొక్క మొలవకపోయినా.. మొక్క గిడసబారినా ఇబ్బంది అవుతుందని వేచిచూస్తున్నారు. గత నెలలో చెదురుమదురుగా కురిసిన వర్షాలకు విత్తనాలు నాటిన రైతులు కూడా తగిన వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. వరి, ఇతర చిరుధాన్యాలు, అపరాల పంటలు 3.32 లక్షల ఎకరాల్లో, పత్తి 3.15 లక్షల ఎకరాల్లో, నూనె గింజ పంటలు 8వేల ఎకరాల్లోనే పడ్డాయి. గత నెల రోజుల్లో బంగాళాఖాతంలో నాలుగైదు అల్పపీడనాలు ఏర్పడినా.. రాష్ట్రంలో పెద్దగా వర్షాలు కురవకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లో సాధారణం కన్నా ఎక్కువ వాన పడినా, విజయనగరం, మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అల్లూరి, కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో సాధారణ వర్షాలు పడ్డాయి. కానీ శ్రీకాకుళం, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో సాధారణం కన్నా తక్కువ వాన పడింది. నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల్లో అతి తక్కువ వాన పడింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా 17.4 శాతం వానలోటు నెలకొంది. ఫలితంగా ఖరీఫ్ సాగు మందంగా ఉంది. .



'రుషికొండ'పై నాన్చుడే!

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం 9.8 ఎకరాల్లో రూ.452 కోట్లతో రాజభవనం నిర్మించింది. పర్యాటకుల కోసం నిర్మిస్తున్నామని చివరి వరకు మాయమాటలు చెప్పి ఎన్నికలు ఇంకో రెండు నెలల్లో ఉన్నాయనగా (2024 ఫిబ్రవరి 29న) ... దానిని సీఎం క్యాంపు కార్యాలయంగా ఉపయోగిస్తామని అప్పటి పర్యాటక శాఖ మంత్రి రోజా ప్రకటించారు. ఎంతో ముచ్చటపడి నిర్మించుకున్న ఆ భవనంలోకి అడుగు పెట్టకుండానే జగన్ అధికారం కోల్పోయారు. అప్పటివరకూ ఎవరినీ ఆ భవనం వైపు కన్నెత్తి కూడా చూడనీయలేదు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రెండుసార్లు రుషికొండ వెళ్లి వెనక్కి వచ్చేశారు. సీపీఐ సీనియర్ నేత నారాయణ కోర్టు ఉత్తర్వులతో లోపలకు వెళ్లి చూడగలిగారు. కూటమి విజయం సాధించాక భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మీడియాతో వెళ్లి ఆ భవనం చూశారు. ఆ తరువాత సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ భవనాన్ని పరిశీలించారు.

ఏమి చేయాలో అర్థం కావడం లేదు

రుషికొండపై 4.5 ఎకరాలలో 1,48,413 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపట్టారు. అందులో 2.8 ఎకరాల్లో మూడు భవనాలను జగన్, ఆయన ఇద్దరు కుమార్తెలకు వేర్వేరుగా నిర్మించారు. ఆ బ్లాకు లోపలకు ఎవరూ వెళ్లకుండా పెద్ద గేటు ఏర్పాటు చేశారు. మిగిలిన భవనాలన్నీ పెద్ద పెద్ద సమావేశ మందిరాలుగా నిర్మించారు. ఎక్కడా గదులు లేవు. వాటిని ఎలా ఉపయోగించుకోవాలనే దానిపై అభిప్రాయాలు తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటించింది. కొంతమంది రాయబార కార్యాలయాలకు ఇవ్వాలని, ఐటీ సంస్థలు పెట్టాలని, పెద్ద పెద్ద సంస్థలకు కన్వెన్షన్ సెంటర్‌కు ఇవ్వాలని సూచించారు. అయితే ఎవరు దానిని వినియోగించుకోవాలన్నా లోపల కొన్ని మార్పులు చేస్తే తప్పవీలు కాదు. అలా పనులు చేపట్టాలంటే వాటికి రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు వెచ్చించాల్సి ఉంటుందని చెబుతున్నారు.

సీఎంవోలో అధికారికి బాధ్యతలు

ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓ ఐఏఎస్ అధికారిని రుషికొండ ప్యాలెస్ భవనం ఏం చేస్తే బాగుంటుందో నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్టు సమాచారం. అయితే ఆ అధికారి కూడా ఇప్పటివరకూ భవనాన్ని సందర్శించలేదు. ప్రజలను సందర్శనార్థం అనుమతించి, జగన్ ప్రభుత్వం నిధులను ఎలా దుర్వినియోగం చేసిందో వివరించాలని కొందరు ప్రభుత్వ పెద్దలకు సలహా ఇచ్చారు. ఆ ఆలోచనను కూడా పరిశీలిస్తున్నట్టు సీఎం చంద్రబాబు ఇటీవల విశాఖకు వచ్చినపుడు ప్రకటించారు. అయితే దానిపై కూడా నిర్ణయం తీసుకోలేదు. పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ రెండురోజులక్రితం రుషికొండ బ్లూ ఫ్లాగ్ బీచ్‌ను సందర్శించారు. విశాఖకు వచ్చే పర్యాటకులకు ఆ భవనాన్ని చూపించే ఆలోచన ఉందని ఆయన ప్రకటించారు. జగన్ తప్పు చేశారనే భావనతో దానిని అందరికీ చూపించాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. కానీ అది చూసి...'ఎంత పెద్ద భవనం నిర్మించాడో...జగన్!!' అనే అభిప్రాయాలు కూడా వ్యక్తమయ్యే అవకాశం లేకపోలేదని కొందరు అంటున్నారు. కాబట్టి అలాంటి ప్రయత్నం చేయకుండా ఉండడమే మంచిదని అభిప్రాయపడుతున్నారు. విశాఖలో భారీ సమావేశాలు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఇంకా అనేకం జరుగుతాయి. అటువంటి వాటిని స్టార్ హోటళ్లలో నిర్వహించి, కోట్ల రూపాయల బిల్లులు చెల్లించడం కంటే ఈ భవనాన్ని ఉపయోగించుకుంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అతిథి గృహాలుగా వాడుకుంటే బాగుంటుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఏదేమైనా నాన్చడం మాని, వీలైనంతత్వరగా వాటిని సద్వినియోగం చేసుకోవలసి ఉంది.

స్వయం ఉపాధి.. ఫ్చ్!

కార్పొరేషన్లకు అరకొరగా యూనిట్లు కేటాయింపు

- నిధుల మంజూరు కూడా అంతంతమాత్రంగానే..
- బీసీల జనాభా ఎక్కువ, యూనిట్లు మాత్రం తక్కువ
- మండల స్థాయిలో ఇబ్బందికరంగా లబ్ధిదారుల ఎంపిక

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో స్వయం ఉపాధి పథకాల అమలులో నాటి స్ఫూర్తి కొరవడుతోంది. ప్రభుత్వ సహకారంతో, బ్యాంకు చేదోడుతో, జీవితంలో స్థిరపడాలన్న ఆలోచన యువతలో కరువైంది. గత వైసీపీ ప్రభుత్వం డీబీటీ పేరుతో ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లుగా, ఉపాధి యూనిట్లు లేకుండా సబ్సిడీ కోసం డిమాండ్ చేస్తున్నారు. ఈ యూనిట్లకు సంబంధించి అర్హతల నిబంధనలు సరళతరం చేయడంతో అందరూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కలిగింది. దీంతో ఆర్థికంగా స్థితిమంతులుగా ఉన్నవారు సైతం సబ్సిడీల కోసం ఎగబడుతున్నారు. వాస్తవంగా స్వయం ఉపాధి యూనిట్లు నిర్వహించుకుని ఎదగాలన్న వారికి మాత్రం ఊతం లభించడం లేదు. మరోవైపు యూనిట్ల కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతుండంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. 2014-19 మధ్యకాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు పలు కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారు. వాటికి భారీగా బడ్జెట్ కేటాయించి పలు స్వయం ఉపాధి పథకాలు అమల్లోకి తెచ్చారు. ఈ వర్గాల యువతకు ఇన్నోవా కార్ల కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు సబ్సిడీ కూడా అందించారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆయా వర్గాల యువత జీవన ప్రమాణాలు పెరిగాయి. అయితే 2019లో జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత స్వయం ఉపాధి పథకాలను అటకెక్కించారు. వివిధ కార్పొరేషన్లు ఏర్పాటుచేసినా వాటికి ఒక్క పైసా కూడా కేటాయించకుండా డీబీటీ విధానాన్ని అమలు చేశారు. దీంతో ఆ కార్పొరేషన్లు చివరకు డీబీటీ పథకాలకు బుక్ అడ్జస్ట్‌మెంట్ సంస్థలుగా మారిపోయాయి. చంద్రబాబు హయాంలో ఆయా కులాలకు చెందిన యువతకు స్వయం ఉపాధి యూనిట్ నిర్వహించేందుకు అవసరమైన ఆర్థికసాయం కూడా అందించేవారు. జగన్ డీబీటీ పథకాలతో ఇచ్చిన అరకొర ఆర్థిక సాయం కుటుంబ తాత్కాలిక అవసరాలు, ఆసుపత్రుల బిల్లులు, విద్యుత్ చార్జీలు, పన్నులకే సరిపోయేవి. ఈ డబ్బులు లబ్ధిదారులకు ఉపయోగపడేవి కావు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువత రోజు కూలీలుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు రావడంతో వారంతా స్వయం ఉపాధి పథకాల కోసం ఎదురుచూస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ పథకాలకు ప్రభుత్వం బడ్జెట్ అంతంత మాత్రంగానే కేటాయిస్తోంది. దరఖాస్తులు మాత్రం విరివిగా వస్తున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల ఎంపిక అధికారులకు తలనొప్పిగా మారింది.

వెల్లువెత్తిన దరఖాస్తులు

రాష్ట్ర జనాభాలో దాదాపు సగం ఉన్న బీసీలు టీడీపీ ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. స్వయం ఉపాధి పథకాలు అమలు చేయడానికి బీసీ సంక్షేమ శాఖ శ్రీకారం చుట్టింది. దీనికోసం దరఖాస్తుల స్వీకరణ చేపట్టడంతో ఏకంగా 4.33 లక్షల దరఖాస్తులు వచ్చాయి. అయితే 2024-25 సంవత్సరానికి గాను బీసీలకు 44,722 యూనిట్లు మాత్రమే లక్ష్యంగా నిర్దేశించారు. అందిన దరఖాస్తుల్లో 10శాతం మందికి కూడా స్వయం ఉపాధి యూనిట్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా 2025-26 సంవత్సరానికి సంబంధించి ఎస్సీ కార్పొరేషన్ ఏప్రిల్ 11 నుంచి మే 20 వరకూ దరఖాస్తులు స్వీకరించనుంది. ఈ కార్పొరేషన్‌కు కూడా దరఖాస్తుల వెల్లువ ప్రారంభమైంది. వీరికి 20వేల యూనిట్లు మాత్రమే లక్ష్యంగా పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ సరిపోకపోడంతో లబ్ధిదారులను సంతృప్తిపరచలేక నేతలు, అధికారులు సతమవుతున్నారు.

క్షేత్రస్థాయిలో అసంతృప్తి

డిమాండ్ మేరకు స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు కాకపోవడంతో పథకాల అమలులో ప్రజల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతోంది. మండల స్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న అధికారులు ఒత్తిడికి గురవుతున్నారు. బ్యాంకుల పరిధిలో టార్గెట్లు అతి తక్కువ సంఖ్యలో ఉండటం, లబ్ధిదారులు సంఖ్య ఎక్కువగా ఉండటంతో తీవ్ర పోటీ నెలకొంది. వీరిలో ఎవరికి సిఫారసు చేయాలో తెలియక అధికార పార్టీ నేతలూ ఇబ్బంది పడుతున్నారు. కొన్నిచోట్ల అధికార పార్టీ నేతలు, అధికారులు సూచించిన వారికి కాకుండా వేరేవారికి రుణాలిస్తామని బ్యాంకులు మెలికలు పెడుతున్నాయి. దీంతో అధికార పార్టీ పట్ల వ్యతిరేకత పెరుగుతోంది.

జగన్ నిర్వాకంతోనే..

2014లో చంద్రబాబు ప్రభుత్వం ఏటా లక్ష మందికి పైగా స్వయం ఉపాధి యూనిట్లు మంజూరు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన జగన్ కూడా ఈ పథకాన్ని కొనసాగించి ఉంటే ఇప్పుడు ఇంత డిమాండ్ ఉండేది కాదు. కానీ గత ప్రభుత్వం ఈ పథకాలను పూర్తిగా నిలిపేయడంతో ఆ ఒత్తిడి ఇప్పుడు కూటమి ప్రభుత్వంపై పడింది. స్వయం ఉపాధి కోసం వచ్చిన దరఖాస్తులన్నింటికీ రుణాలివ్వాలంటే బ్యాంకుల్లో ఉండే నిల్వలు చాలవని, సబ్సిడీ ఇవ్వాలంటే ప్రభుత్వ బడ్జెట్ చాలదని పేర్కొంటున్నారు. గత ఐదేళ్లుగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోని రాష్ట్రంలో కూటమి సర్కారు చేపడుతున్న ఈ పథకాలు అందరికీ చేరువ కాలేని పరిస్థితి ఉండటంతో క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై అసంతృప్తి ఏర్పడుతోంది.



బీటీపీ కాలువ పనుల పునఃప్రారంభం సందర్భంగా పూజలు చేస్తున్న ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, సురేంద్రబాబు, ఎంపీ అంబికా తదితరులు

బీటీపీ కాలువ పనులు పునఃప్రారంభం

బ్రహ్మసముద్రం, జూలై 5(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం వెస్ట్ కోడిపల్లి గ్రామ సమీపంలోని భైరవాన్ తిప్ప కాలువ పనులను ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు శనివారం పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, కలెక్టర్ వినోద్ కుమార్ పాల్గొన్నారు. గత టీడీపీ(2014-19) హయాంలో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీటిని భైరవాన్‌తిప్ప ప్రాజెక్టుకు తరలించేందుకు రూ.968 కోట్లు మంజూరు చేశారు. 2019 వరకు ఈ పనుల్లో 30 శాతానికి పైగా పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఈ పనులను అటకెక్కించారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేపట్టడంతో ఈ పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. గతంలో కేటాయించిన రూ.968 కోట్ల నిధులతోనే పెండింగు పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. కాలువ వద్ద పూజలు నిర్వహించి, జేసీబీతో మట్టిని తీసి ఎంపీ, ఎమ్మెల్యేలు శనివారం పనులను పునఃప్రారంభించారు. ఈ పనులు పూర్తి అయితే బీటీపీ కింద 12 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. కల్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులకు నీరు అందుతుంది. తద్వారా భూగర్భ జలాలు పెరిగి, వ్యవసాయ బోరుబావుల్లో నీటి నిల్వలు పెరగనున్నాయి. వందలాది గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారమవుతుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని మాట్లాడారు. బీటీపీ కాలువ పనుల విషయాన్ని సీఎం చంద్రబాబుకు వివరించి పనుల పునఃప్రారంభానికి అనుమతి తీసుకున్నామని తెలిపారు. కల్యాణదుర్గం నుంచి ఎన్నికై, మంత్రిగా పనిచేసిన వైసీపీ నాయకురాలు ఉష శ్రీచరణ్ ఈ ప్రాంతంలో దోపిడీలు, కబ్జాలకు పాల్పడ్డారని, ప్రాజెక్టు గురించి, రైతుల కష్టాల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. సీమ సాగునీటి ప్రాజెక్టులపై సీఎం ప్రత్యేక శ్రద్ధ పెట్టారని, హంద్రీనీవాకు బడ్జెట్‌లో రూ.3,800 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. హంద్రీనీవా పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.

‘వాణిజ్యం’లో అడ్డగోలుగా బదిలీలు

- రాష్ట్రవ్యాప్తంగా 350 మందికి స్థానచలనం
- నిబంధనలకు విరుద్ధంగా పలువురు బదిలీ
- నెలాఖరు, వచ్చే నెలలో రిటైరయ్యేవారూ..
- మార్కులు, ర్యాంకింగ్‌ల ఆధారంగానే

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖలో వివాదాస్పదంగా మారిన అధికారులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ అడ్డగోలుగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 100 మంది అసిస్టెంట్ కమిషనర్లు, 220 మంది డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లను వారికి కేటాయించిన వ్యక్తిగత మార్కుల ఆధారంగా బదిలీ చేశారు. మరో 35 మంది జాయింట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను కూడా మార్కులు, ర్యాంకింగ్‌ల ఆధారంగా బదిలీ చేశారు. శాఖ ప్రధాన కమిషనర్(సీసీఎస్టీ) అహ్మద్ బాబు ఈ మేరకు శుక్రవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తంగా వాణిజ్య పన్నుల శాఖలో 350 మంది అధికారులకు స్థానచలనం కలిగింది. క్షేత్రస్థాయిలో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులను కూడా మార్కుల ప్రాతిపదికనే బదిలీ చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల వ్యక్తిగత పనితీరుకు సీసీఎస్టీ నిబంధనలకు విరుద్ధంగా మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టి బదిలీలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఏపీఎన్జీజీవో ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. సాధారణ బదిలీలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో వచ్చే ఏడాది మే 31 లోపు పదవీ విరమణ చేసేవారిని బదిలీ చేయకూడదని పేర్కొంది. స్పౌజ్, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి మెడికల్ గ్రౌండ్స్‌లో బదిలీల నుంచి మినహాయింపు ఇచ్చింది. అయితే ఈ నిబంధనలను పరిగణనలోకి తీసుకోకుండా చాలా అన్యాయమైన పద్ధతిలో బదిలీలు చేశారంటూ పలువురు అధికారులు గగ్గోలు పెడుతున్నారు. ఉదాహరణకు శ్రీకాకుళం సర్కిల్‌లో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బడియా కామరాజు ఈ నెలాఖరునే పదవీ విరమణ చేయనున్నారు. అయితే ఆయనను విశాఖపట్నానికి బదిలీ చేశారు. గుంటూరు అరండల్‌పేట సర్కిల్‌లో పని చేస్తున్న డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ శాంతారామ్ వచ్చే నెలలో రిటైర్ కానుండగా.. ఆయనను పట్నంబజార్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఇలా రెండు, మూడు నెలల్లో రిటైరవుతున్న అనేక మందిని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారు. గుంటూరు పట్నంబజార్ సర్కిల్‌లో పని చేస్తున్న ఓ మహిళా అసిస్టెంట్ కమిషనర్‌ను 9 నెలలు తిరక్కుండానే నంద్యాలకు బదిలీ చేశారు. ఆమె భర్త రాజమండ్రిలో ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నారు. 4 నెలల క్రితమే వివాహమైన ఈ మహిళా అధికారి స్పౌజ్ కోటా కింద బదిలీ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఆమెను భర్తకు మరింత దూరంగా ఉండేలా నంద్యాలకు బదిలీ చేశారు.

‘క్వాంటమ్’తో నవశకం!

(మొదటి పేజీ తరువాయి)

జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. మన దేశ సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ ఎవరూ ఛేదించలేనంత పటిష్ఠంగా మారుతుందని, వైద్య రంగంలో నయంకాని ఎన్నో రోగాలకు వ్యాక్సిన్లు, మందులు అందుబాటులోకి వస్తాయని, వాతావరణంలోని మార్పులను, ప్రకృతి వైపరీత్యాలను కూడా ముందే పసిగట్టవచ్చని, దేశ రక్షణ కోసం శక్తిమంతమైన ఆయుధాలను అభివృద్ధి చేయవచ్చని చెబుతున్నారు. అయితే ఇవన్నీ.. ఒక్క క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటుతో ఎలా సాధ్యమవుతాయో.. వివరంగా తెలుసుకుందాం.



క్వాంటమ్ కంప్యూటర్ తయారీ..

1990 నుంచి 2000 మధ్యలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఐటీ సెక్టార్‌లో ఎవరూ ఊహించిన అభివృద్ధిని అందుకుంది. అయితే ఈసారి ఐటీ పరిశ్రమకు బదులుగా క్వాంటమ్ ఇండస్ట్రీలో ఆ అభివృద్ధిని తీసుకురావాలని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. దీని కోసం అమరావతిలోని 50 ఎకరాలలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు కోసం ఇప్పటికే భూమిని కేటాయించింది. అయితే ఈ క్వాంటమ్ వ్యాలీని ముందుకు నడిపించేది క్వాంటమ్ కంప్యూటర్. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు కలిసి త్వరలోనే భారతదేశపు చరిత్రలోనే అత్యంత శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారు చేయబోతున్నాయి. క్వాంటమ్ సిస్టమ్-2గా భావిస్తున్న ఇది 156 క్యూబిట్ల సామర్థ్యం ఉండే హెరాన్ ప్రాసెసర్ ద్వారా పనిచేస్తుంది.

క్వాంటమ్ టెక్నాలజీ అంటే ఏమిటి..?

క్వాంటమ్ టెక్నాలజీ అనేది భౌతికశాస్త్రం, ఇంజనీరింగ్ విభాగాల కలయిక. ప్రస్తుతం మనం వాడే సాధారణ కంప్యూటర్ల కన్నా సూపర్ కంప్యూటర్స్ చాలా పవర్‌ఫుల్‌గా పనిచేస్తాయి. కానీ.. ఆ సూపర్ కంప్యూటర్ల కన్నా లక్షల రెట్లు ఎక్కువ సామర్థ్యంతో పనిచేసేవే ఈ క్వాంటమ్ కంప్యూటర్లు. దీనికి కారణం మనం వాడే సాధారణ కంప్యూటర్ల బైనరీ మీద ఆధారపడి పనిచేస్తే.. ఇవి క్వాంటమ్ మెకానిక్స్ సూత్రాల ఆధారంగా పనిచేస్తాయి. బైనరీ సిస్టమ్‌లో 0, 1 అనే రెండు బిట్స్ ఉంటాయి. ఇక్కడ జీరో అంటే ఆఫ్ అని.. వన్ అంటే ఆన్ అని అర్థం. అదే క్వాంటమ్ కంప్యూటర్స్‌లో మాత్రం క్వాంటమ్ బిట్స్ ఉంటాయి. వీటినే క్యూబిట్స్ అని కూడా అంటారు. ఈ క్యూబిట్స్ ప్రత్యేకత ఏమిటంటే.. ఇవి ఒకేసారి జీరోగానూ, వన్‌గానూ ఉండగలవు. దీనినే క్వాంటమ్ ఫిజిక్స్‌లో క్వాంటమ్ సూపర్ పొజిషన్ అని అంటారు. ఈ సూపర్ పొజిషన్ సాయంతో సాధారణ కంప్యూటర్‌లో రెండు బిట్లు చేసే పనినే క్వాంటమ్ కంప్యూటర్‌లో ఒక బిట్ మాత్రమే పూర్తి చేయగలదు. ఇలా క్యూబిట్స్ సంఖ్య పెరిగేకొద్దీ కంప్యూటర్ ప్రాసెసింగ్ పవర్ అనేది విపరీతంగా పెరుగుతుంది. రెండు క్యూబిట్స్ ఉన్న కంప్యూటర్ నాలుగు పాజిబుల్ వ్యాల్యూస్‌ని కనుక్కోగలిగితే 20 క్యూబిట్స్ ఉన్న కంప్యూటర్ 10 లక్షల కన్నా ఎక్కువ వ్యాల్యూస్‌ని గుర్తించగలదు.

తయారీ అంత ఈజీ కాదు

నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా ఇటీవల బెంగళూరుకు చెందిన క్యూపై ఏఐ అనే కంపెనీ భారతదేశపు మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్‌ను తయారు చేసింది. ఇది 25 సూపర్ కండక్టింగ్ క్యూబిట్స్ సహాయంతో పనిచేస్తుంది. ఇక అమరావతిలో నిర్మించబోయే క్వాంటమ్ కంప్యూటర్ అయితే.. 156 క్యూబిట్‌ల ప్రాసెసింగ్ పవర్‌తో పనిచేయనుంది. అందుకే దీన్ని భారతదేశపు అత్యంత శక్తిమంతమైన క్వాంటమ్ కంప్యూటర్ అని పిలుస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో ఆల్గరిథమ్స్‌ను రాయడానికి ఏ హార్డ్‌వేర్‌ను అయితే ఉపయోగిస్తున్నారో ఇది కూడా ఆ విభాగంలోకే వస్తుంది. అలాగే ఈ క్వాంటమ్ కంప్యూటర్ల డిజైన్ కూడా మనం రోజూ వాడే సాధారణ కంప్యూటర్లతో పోలిస్తే చాలా విభిన్నంగా ఉంటుంది. ఈ సిస్టమ్ మొత్తాన్నీ కూడా ఒక సీల్డ్ బాక్స్‌లో పెడతారు. క్వాంటమ్ కంప్యూటర్లను తయారు చేయడం అంత ఈజీ కాదు. ఎందుకంటే ఇప్పుడు మనం వాడే సాధారణ కంప్యూటర్లలో ట్రాన్సిస్టర్లు కదలకుండా ఫిక్స్‌డ్‌గా ఉంటాయి. క్వాంటమ్ కంప్యూటర్లలో అలా కాదు. ఇక్కడ పార్టికల్స్ అనేవి ఎప్పుడూ కదులుతూనే ఉంటాయి. కాబట్టి చిన్న వైబ్రేషన్ వచ్చినా.. టెంపరేచర్‌లో చిన్న తేడా వచ్చినా.. రేడియేషన్ పెరిగినా.. ఇలా చిన్న అంతరాయం ఎదురైనా ఇవి మైక్రో సెకన్లలోనే తమ క్వాంటమ్‌లను కోల్పోతాయి. అప్పుడు ఈ ప్రాజెక్టు కోసం పెట్టిన ఖర్చంతా వృథా అవుతుంది. కాబట్టే వీటిని బయటి ప్రపంచంతో సంబంధం లేనటువంటి ఒక ప్రత్యేకమైన ఆపరేటింగ్ రూమ్స్‌లో ఉంచుతారు. అలాగే -273 డిగ్రీల చల్లటి వాతావరణం మధ్యలో వీటిని ఏర్పాటు చేస్తారు. దీనికోసమే ఈ కంప్యూటర్‌ని ఒక సీల్డ్ బాక్సులో భద్రపరుస్తారు. కాబట్టి క్వాంటమ్ కంప్యూటర్ దాని పూర్తిసామర్థ్యంతో పనిచేయాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

విప్లవాత్మక మార్పులు

- ▲ క్వాంటమ్ కంప్యూటర్ ఎన్నో కాలిక్యులేషన్స్‌ని చేయడం ద్వారా అసాధ్యం అనుకున్న ప్రాజెక్టులను సుసాధ్యం చేయగలదు.
- ▲ ఇది చూపించే సొల్యూషన్స్‌తో కొత్త వ్యాక్సిన్లను, ఔషధాలను కనుగొనేందుకు సహాయపడగలదు.
- ▲ భవిష్యత్తులో రాబోయే ప్రకృతి విపత్తులను వంద % కచ్చితత్వంతో అంచనా వేయగలదు.
- ▲ అలాగే స్టాక్ మార్కెట్‌లో రిస్కును తగ్గించడం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వంటి కొత్త టెక్నాలజీని తయారు చేయడం, రవాణాలో ఖర్చుతక్కువయ్యే మార్గాలను కనుగొనడంలో సహాయపడగలదు.
- ▲ సైబర్ సెక్యూరిటీ, కమ్యూనికేషన్, రక్షణ రంగం, క్రిప్టోగ్రఫీ.. ఇలా ఎన్నో రంగాల్లో క్వాంటమ్ టెక్నాలజీ విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదు.

అగ్రదేశాల సరసన చేరేలా..

ఇలాంటి క్వాంటమ్ టెక్నాలజీపై అమెరికా, చైనా, ఫ్రాన్స్, కెనడా, ఫిన్లాండ్ వంటి అతికొద్ది దేశాలు మాత్రమే పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో క్వాంటమ్ టెక్నాలజీతో ప్రపంచ దేశాలను తనవైపు తిప్పుకొనే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. దీనికోసం చేపట్టిన నేషనల్ క్వాంటమ్ మిషన్‌లో భాగంగా అమరావతిలో నిర్మించబోయే క్వాంటమ్ వ్యాలీ 2026 జనవరి 1 నాటికి అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. కంప్యూటర్ నిర్మాణంతోపాటు, డేటా సెంటర్లు, రిసెర్చ్ ఇంక్యుబేటర్లు, టెక్ పార్కులను నిర్మించనున్నారు. ప్రపంచాన్ని ప్రభావం చేయను న్న క్వాంటమ్ ఇండస్ట్రీలోకి అమెరికా, చైనా వంటి దేశాలు దీటుగా భారత్ అడుగుపెట్టడం.. అదికూడా అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని ఏర్పాటు చేయనుండడం సరికొత్త విప్లవానికి నాంది పలకనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

క్వాంటమ్ కంప్యూటర్‌కు 7 సెకన్లు చాలు

క్వాంటమ్ వ్యాలీతో అద్భుతాలు ఆవిష్కారమవుతాయి. దీనికి క్వాంటమ్ కంప్యూటరే కారణం. వీటిలో ఉండే అసాధారణ కంప్యూటింగ్ పవర్ ప్రపంచంలోని ఎంతటి క్లిష్టమైన సమస్యనైనా సరే పరిష్కరించగలుగుతుంది. ఎందుకంటే ప్రస్తుతం మన దగ్గరున్న ఎంత గొప్ప సూపర్ కంప్యూటర్ అయినా సరే ఒక సమస్య వచ్చిందంటే.. దాన్ని పరిష్కరించడానికి ఒక్కో సమాధానాన్ని ఒకదాని తర్వాత ఒకటి సరి చూసుకుంటూ వెళ్తుంది. దీనికి చాలా సమయం పడుతుంది. కానీ, క్వాంటమ్ కంప్యూటర్స్ మాత్రం దాని క్వాంటమ్ సెర్చ్‌లో సరైన సమాధానం కోసం కోటానుకోట్ల మార్గాలను ఒకేసారి అన్వేషించి వాటిలో నుంచి సరైన సమాధానాన్ని పసిగడుతుంది. ఉదాహరణకు ఒక బలమైన పాస్‌వర్డ్‌ను క్రాక్ చేయడానికి ఇప్పుడున్న సూపర్ కంప్యూటర్లకు కొన్ని సంవత్సరాలు పడితే.. క్వాంటమ్ కంప్యూటర్ మాత్రం దానికి ఉన్న ప్రాసెసింగ్ స్పీడ్‌తో ఈ పాస్‌వర్డ్‌ను కేవలం ఏడు సెకన్లలోనే క్రాక్ చేస్తుంది. ఇది ప్రపంచంలోని ఎంత స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌నైనా సరే కొన్ని సెకన్లలోనే క్రాక్ చేయగలదు. కానీ, ఇది సృష్టించే ఎన్‌క్రిప్షన్‌ను బ్రేక్ చేయాలంటే మాత్రం శత్రుదేశ హ్యాకర్లకు ఒక జీవిత కాలం సరిపోదు.

జీడిపల్లికి పది రోజుల్లో నీరు

- ఈ నెలాఖరునాటికి పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా నీరు
- కాంట్రాక్టర్లు లక్ష్యాలను చేరుకోవాల్సిందే
- పోలవరం ఎడమ కాలువ పనులు ఈ నెలాఖరుకు పూర్తి కావాల్సిందే
- ప్రతినీటి బొట్టూ సద్వినియోగం కావాలి
- నీటి వనరులపై ఆడిట్ నిర్వహించండి
- జలవనరులపై సమీక్షలో సీఎం



హంద్రీనీవా, పోలవరం ఎడమ కాలువ పనులపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు జలాలు అందించాలనే లక్ష్యంతో జలవనరుల శాఖ ఏడాది కాలంగా చేస్తున్న నిర్విరామ కృషి ఫలిస్తోందని.. మరో పది రోజుల్లో(ఈనెల 15) హంద్రీనీవా నుంచి జీడిపల్లికి జలాలు అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఫేజ్-2 పూర్తి చేసి ఈ నెలాఖరునాటికి పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు కృష్ణా నీరు తరలిస్తామని స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యాలను కాంట్రాక్టర్లు పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు. గాలేరు, నగరి ద్వారా కడపకు నీళ్లందించే పనులు ప్రారంభించాలని సూచించారు. పోలవరం ఎడమ కాలువ పనులు ఈ నెలాఖరుకు పూర్తి కావాల్సిందేనని డెడ్‌లైన్ విధించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి వెలిగొండ పూర్తి చేయాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది నీటి ప్రవాహాలు ఆశాజనకంగా ఉన్నాయని, ప్రతి నీటి బొట్టూ సద్వినియోగం కావాలని సూచించారు. నీటి ఆడిట్ జరగాల్సిందేనని జల వనరుల శాఖకు స్పష్టం చేశారు. ఈ మేరకు ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో శనివారం జలవనరుల శాఖపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఫలిస్తున్న ప్రయత్నాలు!

కూటమి అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగు నీటిని అందించే భగీరథ ప్రయత్నాలు ఫలిస్తున్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు హంద్రీనీవాకు రూ.3,890 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా హంద్రీనీవా పనుల పురోగతిని సీఎం తెలుసుకున్నారు. లక్ష్యం మేరకు హంద్రీనీవా తొలి దశ పనులు పూర్తి చేసి ఈ నెల 15 నుంచి ప్రధాన కాలువ ద్వారా జీడిపల్లికి నీరందిస్తామని అధికారులు తెలిపారు. జీడిపల్లి నుంచి గొల్లపల్లి, మరాల, చెర్లోపల్లి రిజర్వాయర్లకు జలాలను తరలిస్తామన్నారు. నెల 15న జీడిపల్లికి జలాలు విడుదల చేసి అక్కడ నుంచి 15 రోజుల పాటు పెన్నా-అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు నీటిని తరలిస్తామని అధికారులు చెప్పారు.

‘షిరిడీ సాయి’కి దోచిపెట్టేందుకే విద్యుత్ భారాలు

- అదానీ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలి
- పోలవరం నిర్వాసితుల కోసం ఉద్యమం: సీపీఐ రామకృష్ణ



విద్యుత్ స్మార్ట్ మీటర్లను మంటల్లో వేసి నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

విజయవాడ(ధర్నాచౌక్), చింతలపూడి, జూలై 5(ఆంధ్రజ్యోతి): షిరిడీ సాయి కంపెనీకి దోచిపెట్టేందుకే ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ భారాలను మోపుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ భారాన్ని తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా జరిగింది. రామకృష్ణ మాట్లాడుతూ... విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక రూ.15,400 కోట్ల భారాన్ని ప్రజలపై మోపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

మంత్రి సంధ్యారాణి దాతృత్వం

- పీ4లో 10 కుటుంబాల దత్తత



పార్వతీపురం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మంత్రి గుమ్మిడి సంధ్యారాణి దాతృత్వం చాటుకున్నారు. పీ4లో భాగంగా 10 కుటుంబాలను దత్తత తీసుకుంటానని ప్రకటించారు. ఆ కుటుంబాల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి బాధ్యత తీసుకుంటానన్నారు. శనివారం పార్వతీపురం జిల్లా సాలూరులో పీ4 ప్లానింగ్‌పై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఈ ప్రకటన చేశారు. సాలూరు నియోజకవర్గంలో 10 కుటుంబాలను తాను దత్తత తీసుకుంటున్నట్టు ప్రకటించారు.

ఎల్‌ఐసీ నుంచి కొత్త పాలసీలు

ప్రభుత్వ రంగంలోని భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్‌ఐసీ).. మరో రెండు కొత్త ఎండోమెంట్ పాలసీలు ప్రారంభించింది. నవ జీవన్ శ్రీ, నవ జీవన్ శ్రీ సింగిల్ ప్రీమియం పేరుతో ప్రారంభించిన ఈ రెండు పాలసీలు పొదుపుతో పాటు పాలసీదారులకు ఆర్థిక భద్రత కల్పిస్తాయని తెలిపింది. ఆయా వ్యక్తుల జీవిత కాలంలో వివిధ అవసరాలకు అనుగుణంగా చాలినంత మూలధనాన్ని సమకూర్చేలా ఈ రెండు పాలసీలను రూపొందించారు. ప్రస్తుత వడ్డీ రేట్ల ఆటుపోట్లను దృష్టిలో ఉంచుకుని పాలసీ కాలంలో హామీతో కూడిన అదనపు మొత్తాలకూ వీలు కల్పించారు. ఈ రెండు పాలసీల ప్రత్యేకతలు.

నవ జీవన్ శ్రీ పాలసీ

- ఇది ఒక లిమిటెడ్ పీరియడ్ ఎండోమెంట్ ప్లాన్
- ప్రీమియం చెల్లింపు కాలపరిమితి 6,8,10,12 సంవత్సరాలు
- 30 రోజుల నుంచి 60 సంవత్సరాల వరకు వయసు ఉన్న వారు ఎవరైనా ఈ పాలసీ తీసుకోవచ్చు
- పాలసీ కనీస కాలపరిమితి 10 నుంచి 16 సంవత్సరాలు.
- పాలసీ గరిష్ఠ కాలపరిమితి 20 సంవత్సరాలు.
- కనీస బీమా హామీ మొత్తం రూ.5 లక్షలు. గరిష్ఠ పరిమితి లేదు.

నవ జీవన్ శ్రీ సింగిల్ ప్రీమియం

- 30 రోజుల నుంచి 60 సంవత్సరాల వరకు వయసున్న వారు ఎవరైనా ఈ పాలసీ తీసుకోవచ్చు
- ఆప్షన్-1 కింద కనీస మెచ్యూరిటీ వయసు 18 సంవత్సరాలు. గరిష్ఠ మెచ్యూరిటీ వయసు 75 సంవత్సరాలు
- ఆప్షన్-2 కింద మెచ్యూరిటీ వయసు 60వ పుట్టిన రోజుకు దగ్గరలో ఉండాలి
- పాలసీ కనీస గడువు ఐదేళ్లు, గరిష్ఠ గడువు 20 సంవత్సరాలు
- కనీస బీమా హామీ మొత్తం రూ.లక్ష. గరిష్ఠ బీమా హామీ మొత్తానికి పరిమితి లేదు.

ఫాల్కన్‌ఎక్స్ సీఈఓ రఘు యార్లగడ్డకు

ఫిన్‌టెక్ ఎక్సలెన్స్ అవార్డు



హైదరాబాద్: అమెరికాకు చెందిన డిజిటల్ అసెట్ ట్రేడింగ్ సేవల కంపెనీ ఫాల్కన్‌ఎక్స్ సహ వ్యవస్థాపకులు, సీఈఓ రఘు యార్లగడ్డకు తానా అవార్డు లభించింది. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న తానా 24వ వార్షిక సదస్సులో రఘు యార్లగడ్డను ‘తానా అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఫైనాన్షియల్ టెక్నాలజీ’ (ఫిన్‌టెక్) అవార్డుతో సత్కరించనుంది. ఈ జనవరిలో ఆయన యూటీ డల్లాస్ డిస్టింగ్విష్డ్ అలుమ్నీ అవార్డుకు కూడా ఎంపికయ్యారు. విజయవాడ వాస్తవ్యులైన రఘు యార్లగడ్డ.. వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ)లో బీటెక్ పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్-డల్లాస్ నుంచి సిగ్నల్ ప్రాసెసింగ్, ఎంఎల్‌లో మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్) పట్టా పుచ్చుకున్నారు. ఆపై హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ కూడా పూర్తి చేసిన యార్లగడ్డ.. 2018లో కాలిఫోర్నియా కేంద్రంగా ఫాల్కన్‌ఎక్స్‌ను ప్రారంభించారు. ఇప్పటికే కంపెనీ మార్కెట్ విలువ 800 కోట్ల డాలర్లు (మన కరెన్సీలో దాదాపు రూ.68,500 కోట్లు) దాటింది.

బిజినెస్ ప్లస్



మదుపరులూ పారాహుషార్

అమెరికా ట్రేడింగ్ సంస్థ జేన్ స్ట్రీట్ మాయాజాలం దేశీయ స్టాక్ మార్కెట్‌ను ఓ కుదుపు కుదిపింది. ఎఫ్ అండ్ ఓ విభాగంలో ఎక్స్‌పైరీ రోజుల్లో ఈ సంస్థ తన చేతివాటంతో భారీగా లాభాలను ఆర్జించినట్లు సెబీ గుర్తించింది. మానవ ప్రమేయం లేని ఆల్గో ట్రేడింగ్‌తో జేన్ స్ట్రీట్ ఈ మోసాలకు పాల్పడినట్లు తేల్చింది. ఈ అక్రమ దందాతో బ్రోకర్లు, సంస్థాగత ఇన్వెస్టర్లతో పాటు రిటైల్ ఇన్వెస్టర్లూ భారీగానే నష్టపోయారు. రిటైల్ మదుపరులు భవిష్యత్తులో ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలంటే మరింత అప్రమత్తంగా ఉండక తప్పదు. అవేమిటంటే..

పెద్ద సంస్థలదే హవా

మార్కెట్ సమాచారం పెద్ద పెద్ద ట్రేడింగ్ సంస్థలకు తెలిసినంతగా రిటైల్ ఇన్వెస్టర్లకు తెలియదు. ఆ మాటకొస్తే చిన్న చిన్న ట్రేడింగ్ సంస్థలకూ తెలియదు. కాబట్టి స్పష్టమైన సమాచారం ఉంటే తప్ప ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ జోలికి పోయి చేతులు కాల్చుకోవద్దు.

గుడ్డిగా నమ్మొద్దు

టెక్నాలజీ కూడా మాయగాళ్లకు తోడ్పడుతోంది. జేన్ స్ట్రీట్ సంస్థ కూడా అత్యాధునిక ఆల్గో ట్రేడింగ్ ద్వారానే ఎఫ్ అండ్ ఓ మార్కెట్లో అనైతిక పద్ధతులకు పాల్పడింది. కాబట్టి ఇండెక్స్‌లు మార్కెట్ వాస్తవ పరిస్థితులకు నిజమైన సూచికలని గుడ్డిగా నమ్మవద్దు. అందులోనూ ఎక్స్‌పైరీ రోజుల్లో అసలు నమ్మొద్దు.

సూచీల కదలికలపైనా జాగ్రత్త

రిటైల్ మదుపరులు ఇండెక్స్‌ల కదలికలపైనా జాగ్రత్త పడాలి. తన పంప్ అండ్ డంప్ వ్యూహంతో జేన్ స్ట్రీట్.. డెరివేటివ్స్ విభాగంలో సూచీలను ప్రభావితం చేసింది. డెరివేటివ్స్‌లో ఇన్వెస్ట్ చేసే రిటైల్ మదుపరులు సూచీల కదలికను బట్టి కాకుండా టెక్నికల్స్ ఆధారంగానే పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవటం మంచిది.

అవగాహన

ఎక్స్‌పైరీ రోజుల్లో సూచీలను గణనీయంగా పెంచటం, తగ్గించేందుకు జేన్ స్ట్రీట్.. ఆల్గో ట్రేడింగ్ ద్వారా పెద్ద మొత్తంలో పుట్ ఆప్షన్స్ కొనుగోలు చేసింది. వాటిని ఫ్యూచర్స్‌లో విక్రయించి భారీగా లాభపడింది. ఈ మాయ మంత్రాలు పెద్ద పెద్ద ట్రేడర్లకు తప్ప రిటైల్ మదుపరులకు తెలియవు. కాబట్టి రిటైల్ మదుపరులు ఎఫ్ అండ్ ఓ జోలికి పోకపోవడమే మంచిదని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు.

మార్కెట్లో అక్రమాలను సహించం..

సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే

స్టాక్ మార్కెట్లో అక్రమాలను ఏ మాత్రం సహించబోమని సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే స్పష్టం చేశారు. తమతో పాటు ఎక్స్ఛేంజీలు కూడా మార్కెట్‌పై నిఘా పెంచాయన్నారు. శనివారం నాడు బాంబే చార్టర్డ్ అకౌంటెంట్స్ సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. ఆయన వ్యాఖ్యలు చేశారు. డెరివేటివ్ ట్రేడింగ్‌లో అక్రమ పద్ధతుల్లో రూ.వేల కోట్లు ఆర్జించిన అమెరికా ట్రేడింగ్ కంపెనీ జేన్ స్ట్రీట్ గ్రూప్‌ను సెక్యూరిటీ మార్కెట్ నుంచి నిషేధిస్తూ సెబీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సెబీ చైర్మన్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇతర విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) కూడా జేన్ స్ట్రీట్ తరహాలో మార్కెట్‌ను కొల్లగొట్టే తరహా ట్రేడింగ్ వ్యూహాలను అనుసరించారా..? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. “మార్కెట్లో ఎలాంటి అక్రమాలనూ సహించేది లేదని మాత్రం నేను చెప్పగలను” అని పాండే అన్నారు.

నయా ఫండ్స్

ట్రస్ట్ ఎంఎఫ్ మల్టీ క్యాప్ ఫండ్

ట్రస్ట్ మ్యూచువల్ ఫండ్.. మల్టీ క్యాప్ ఫండ్‌ను ప్రారంభించింది. లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం ఇది. వృద్ధికి అపార అవకాశాలున్న స్టాక్స్‌ను గుర్తించి ఈ ఫండ్ పెట్టుబడులు పెడుతుంది. ఈ ఫండ్‌కు నిఫ్టీ 500 మల్టీ క్యాప్ 50:25:25 టీఆర్ఐ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 14.

యాక్సిస్ సర్వీసెస్ ఆపర్చునిటీస్ ఫండ్

యాక్సిస్ మ్యూచువల్ ఫండ్.. యాక్సిస్ సర్వీసెస్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ప్రారంభించింది. ఇది సర్వీసెస్ థీమ్ ఆధారిత ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ పథకం. ఈ ఫండ్‌కు నిఫ్టీ సర్వీసెస్ సెక్టార్ టీఆర్ఐ బెంచ్‌మార్క్‌గా ఉండనుంది. మంచి పనితీరు కనబరుస్తున్న సేవల రంగంలోని కంపెనీల్లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 18.

ఇన్వెస్కో ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ ఫండ్

ఇన్వెస్కో మ్యూచువల్ ఫండ్.. ఇన్వెస్కో ఇండియా ఇన్‌కమ్ ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ ప్రారంభించింది. ఈక్విటీ ఆర్బిట్రేజ్, డెట్ ఆధారిత పథకాల్లో పెట్టుబడులు పెట్టే ఫండ్ ఆఫ్ ఫండ్. 60-65 శాతం పెట్టుబడులు డెట్ ఆధారిత పథకాల్లో పెట్టనుండగా 35-40 శాతం ఆర్బిట్రేజ్ ఫండ్‌లో పెడుతుంది. ఈ ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 16.

బజాజ్ అలియాంజ్ నిఫ్టీ మల్టీఫ్యాక్టర్ ఫండ్

బజాజ్ అలియాంజ్ లైఫ్.. నిఫ్టీ 500 మల్టీఫ్యాక్టర్ 50 ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. యూలిప్ కస్టమర్ల కోసం ఈ కొత్త ఫండ్‌ను తీసుకువచ్చింది. ఈ ఫండ్.. పాలసీదారులకు లైఫ్ కవరేజీతో పాటు మల్టీఫ్యాక్టర్ ఆధారిత ఈక్విటీ ఇండెక్స్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పిస్తోంది. ముగింపు తేదీ ఈ నెల 14.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



6వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	570
వరంగల్	562	గోదావరి	535
చిత్తూరు	633	విశాఖపట్నం	560
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	105	విజయవాడ	102
వరంగల్	105	గుంటూరు	107
కరీంనగర్	105	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	105	చిత్తూరు	100
కర్నూలు	105	నెల్లూరు	105
విశాఖపట్నం	86	అనంతపురం	105
గోదావరి	102		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,830 ▲	90,600 ▲	1,20,000 ▼
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,10,000 ▲
విశాఖపట్నం	98,730 ▼	90,600 ▼	1,20,000 ▼
రాజమండ్రి	98,840 ▲	90,600 ▲	1,11,100 ▲
ప్రొద్దుటూరు	97,300 ▼	89,560 ▼	1,08,500 ▲
ముంబై	97,021 ▼	88,871 ▼	1,07,580 ▼

కాల్పుల విరమణకు హమాస్ అంగీకారం

గాజా, టెల్‌అవీవ్, జూలై 5: ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి హమాస్ అంగీకారం తెలిపింది. ఈమేరకు తన సమ్మతిని ఈజిప్ట్, ఖతార్ మధ్యవర్తులకు తెలియజేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన ఈ కాల్పుల విరమణ ఒప్పందం 60రోజులు అమలులో ఉంటుంది. హమాస్ తన దగ్గరున్న ఇజ్రాయెలీ బందీల్లో పది మందిని తొలి రోజే వదిలిపెడుతుంది. అలాగే బందీలుగా ఉంటూ మరణించిన వారి 18 మృతదేహాలను హమాస్ అప్పగిస్తుంది. ప్రతిగా గాజాలో ఇజ్రాయెల్ దాడులు, సైనిక చర్యలు నిలిపివేయాలి. ప్రజలకు నిత్యావసరాల సరఫరాలో ఆటంకాలు కలగకుండా చూడాలి. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికాలో వచ్చేవారం పర్యటించనున్న సందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందంపై తుదినిర్ణయం ప్రకటిస్తారని సమాచారం.

అమెరికాలో నీరవ్ మోదీ తమ్ముడి అరెస్టు

న్యూఢిల్లీ, జూలై 5: పరారీలో ఉన్న ఆర్థికనేరగాడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ తమ్ముడు నెహాల్ దీపక్ మోదీ (46)ని అమెరికాలో అరెస్టు చేసినట్టు శనివారం అధికారవర్గాలు తెలిపాయి. అతడిని భారత్‌కు పంపించాలని ఈడీ, సీబీఐలు చేసిన విజ్ఞప్తి మేరకు శుక్రవారం అమెరికా పోలీసులు అరెస్టు చేసినట్టు పేర్కొన్నాయి. అతడిని అదుపులో తీసుకునే విషయమై ఇంటర్‌పోల్ ఇదివరకే రెడ్ నోటీసు జారీ చేసింది. నెహాల్ మోదీ కేసుపై ఈ నెల 17న కోర్టులో తదుపరి విచారణ జరగనుంది. వజ్రాల వ్యాపారంలో మోసం చేశాడన్న కేసులో దాదాపు మూడేళ్ల జైలు శిక్ష అనుభవించిన నెహాల్ గురువారమే విడుదలయ్యాడు. వెంటనే మనీ లాండరింగ్ కేసులో పోలీసులు అరెస్టు చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంకును రూ.13వేల కోట్ల మేర మోసగించిన కేసులో నీరవ్‌మోదీతో పాటు ఆయన మేనమామ మెహుల్ చోక్సీ ప్రధాన నిందితులుగా ఉన్నారు. వారికి సహకరించారంటూ నెహాల్‌పైనా కేసు నమోదైంది.

ఉగ్రవాదులను అప్పగిస్తాం: బిలావల్ భుట్టో

ఇస్లామాబాద్, జూలై 5: భారత్ కోరుతున్న కొంతమంది ఉగ్రవాదులను అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి, విపక్ష పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) అధినేత బిలావల్ భుట్టో స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో సహకరించేందుకు భారత్ సిద్ధపడితే, పరస్పర విశ్వాస కల్పన చర్యల్లో భాగంగా పాక్ అలాంటి చర్య చేపడుతుందన్నారు. భారత్‌తో సత్సంబంధాల పునరుద్ధరణ కోసం లష్కరే తయిబా చీఫ్ హఫీజ్ సయీద్, జైషే మహ్మద్ అధినేత మసూద్ అజార్‌లను అప్పగిస్తారా అని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఆయన ఆ విధంగా సమాధానం చెప్పినట్లు డాన్ పత్రిక వెల్లడించింది. మసూద్ అజార్, హఫీజ్ సయీద్ పాకిస్థాన్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆయన అన్నారు. హఫీజ్ సయీద్ పాకిస్థాన్ కస్టడీలో ఉన్నాడని, మసూద్ అజార్ ఎక్కడున్నాడో తమకు తెలియదన్నారు.

విమానంలో ఫైర్ అలారం.. రెక్కపైనుంచి దూకేసిన ప్రయాణికులు

న్యూఢిల్లీ, జూలై 5: విమానం కొద్ది క్షణాల్లో టేకాఫ్ అవుతుందనగా ఫైర్ అలారం మోగింది. భయాందోళనతో ప్రయాణికులు ఆగమాగమై విమానం రెక్క పైనుంచి కిందికి దూకేశారు. స్పెయిన్‌లోని మయాక ఎయిర్‌పోర్టులో ఇది జరిగింది. ఈ ఘటనలో 18 మంది గాయపడ్డారు. స్పెయిన్‌లోని పాల్మా డే మయాక నుంచి ఈ నెల 4న ర్యాన్ ఎయిర్‌కు చెందిన బోయింగ్ 737 విమానం మాంచెస్టర్‌కు వెళ్లేందుకు సిద్ధమైంది. ఇంతలో విమానంలో అగ్నిప్రమాద హెచ్చరికగా అలారం మోగింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు విమానంలోకి వచ్చి ఎమర్జెన్సీ ద్వారం గుండా ప్రయాణికులను బయటకు పంపే ఏర్పాట్లు ప్రారంభించారు. కానీ, కొందరు భయంతో విమానం రెక్క మీద నుంచి దూకేశారు. ఇదిలా ఉండగా, విమానంలో అగ్నిప్రమాదం ఏమీ జరగలేదని, అలారం పొరపాటున మోగిందని ఆ తర్వాత సిబ్బంది చెప్పారు.

టెక్సా‌స్‌లో వరద బీభత్సం.. 27 మంది మృతి

కెర్విల్, జూలై 5: కొన్ని నెలల పాటు కురవాల్సిన వర్షం కొన్ని గంటల్లో కుండపోతగా కురవడంతో అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. ఈ వరదల్లో 27మంది దుర్మరణం పాలవగా.. మరో 23మందికిపైగా బాలికల ఆచూకీ గల్లంతయింది. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. కెర్ కౌంటీలో శుక్రవారం రాత్రి ఏకదాటిగా 25 సెంటీమీటర్ల వర్షం కురవడంతో హంట్ ప్రాంతంలోని గ్వాదలూప్ నది ఉగ్రరూపం దాల్చింది.

బిహార్‌లో ఓటర్ల జాబితాపై సమీక్షపై సుప్రీంకోర్టులో ఏడీఆర్ పిటిషన్

న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ బిహార్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సమీక్ష (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-ఎస్ఐఆర్) రాజ్యాంగ వ్యతిరేకమని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్(ఏడీఆర్) స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దానివల్ల లక్షలాది మంది ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోతారని తెలిపింది. గతేడాది అక్టోబర్ 29 నుంచి ఈ ఏడాది జనవరి 6 తేదీల మధ్య ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ఇప్పటికే జరిగిపోయిందని గుర్తు చేసింది. వలస వెళ్లిన వారి ఓట్లు, మరణించిన వారి ఓట్ల విషయంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించారని తెలిపింది. ఎన్నికలు మరో మూడు, నాలుగు నెలల్లో ఉండగా ఇంత తక్కువ సమయంలో మరోసారి విస్తృత సమీక్ష జరపాలంటూ జూన్ 24న ఆదేశాలు ఇచ్చిందని, ఇందుకు ఎలాంటి కారణాలు లేవని ఏడీఆర్ అభిప్రాయపడింది. తన పౌరసత్వం గురించి మాత్రమే కాకుండా తన తల్లిదండ్రుల పౌరసత్వాన్ని కూడా పత్రాల ద్వారా నిరూపించాల్సి ఉంటుందని, లేకపోతే ఓటరు పేరును జాబితా నుంచి తొలగిస్తారని తెలిపింది. తమ అంచనా ప్రకారం ఈ ప్రక్రియ మూలంగా ఎస్సీ, ఎస్టీలు, వలస కార్మికులు వంటి అణగారిన వర్గాలకు చెందిన మూడు కోట్ల మంది తమ ఓటు హక్కును కోల్పోతారని ఏడీఆర్ తన పిటిషన్‌లో ఆందోళన వ్యక్తం చేసింది.

వక్ఫ్ ఆస్తులకు పోర్టల్.. నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 5: దేశంలో ముస్లిం మైనారిటీ వర్గాలకు చెందిన వక్ఫ్ ఆస్తులను సక్రమంగా నిర్వహించేందుకు, అభివృద్ధి చేసేందుకు, వక్ఫ్‌కు మరింత సాధికారత కల్పించేందుకు ఉద్దేశించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. దీని ప్రకారం ప్రత్యేక పోర్టల్, డేటాబేస్ ద్వారా వక్ఫ్ ఆస్తుల రిజిస్ట్రేషన్, ఆడిట్, అకౌంట్ల నిర్వహణను పర్యవేక్షించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 8 నుంచి అమల్లోకి వచ్చిన 2025, వక్ఫ్ సవరణ చట్టంలో పొందుపరిచిన 1995నాటి చట్టంలోని సెక్షన్ 108బీ ప్రకారం ఈ నిబంధనలు తీసుకువచ్చినట్టు కేంద్రం పేర్కొంది. ఆయా నిబంధనల అమలు, పర్యవేక్షణ, నియంత్రణ బాధ్యతలను కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖలోని సంయుక్త కార్యదర్శికి అప్పగించారు. వక్ఫ్ పోర్టల్ సహా డేటాబేస్‌కు సంబంధించిన వివరాలను పర్యవేక్షించేందుకు, కేంద్రంతో ఎప్పటికప్పుడు చర్చించేందుకు, సహాయకారిగా ఉండేందుకు వీలుగా ప్రతిరాష్ట్ర ప్రభుత్వం ఓ నోడల్ అధికారిని నియమించాలి. ఈ అధికారి రాష్ట్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదాను కలిగి ఉండాలని కేంద్రం వివరించింది. రాష్ట్ర ప్రభుత్వం నియమించే నోడల్ అధికారి.. తన పరిధిలోని వక్ఫ్ ఆస్తులను గుర్తించి జాబితాను అధికారికంగా ప్రచురించాలి. అనంతరం 90 రోజుల్లో దీనిని పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. పోర్టల్, డేటాబేస్‌లపై ముతావలికే నియంత్రణ ఉంటుంది. అయితే, జిల్లా కలెక్టర్‌కు కూడా పోర్టల్, డేటాబేస్ యాక్సస్ ఉంటుంది.

దేశ రక్షణ మరింత బలోపేతం

సిద్ధమవుతున్న 12 హైపర్‌సోనిక్ మిసైళ్లు.. అభివృద్ధి చేస్తున్న డీఆర్‌డీవో



న్యూఢిల్లీ, జూలై 5: అత్యాధునిక ఆయుధాలతో దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి భారత్ సిద్ధమవుతోంది. డీఆర్‌డీవో ఆధ్వర్యంలో వివిధ రకాల 12 హైపర్‌సోనిక్ మిసైళ్లు రెడీ అవుతున్నాయి. దాడి చేయడం, రక్షణ సామర్థ్యాలపై దృష్టి పెట్టడం లక్ష్యంగా ఈ హైపర్‌సోనిక్ మిసైల్ టెక్నాలజీని వేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రాజెక్టు విష్ణులో ఈ మిసైళ్ల తయారీని ప్రధానంగా చేపట్టారు. వీటితో పాటు మరిన్ని అత్యాధునిక ఆయుధాలను కూడా అభివృద్ధి చేస్తున్నారు. వీటిలో ఓ హైపర్‌సోనిక్ గ్లైడ్ వెహికిల్ (హెచ్‌జీవీ), హైపర్‌సోనిక్ క్రూజ్ మిసైల్స్, హైపర్‌సోనిక్ మిసైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. వీటిని అభివృద్ధి చేయడంలో ప్రధాన లక్ష్యం.. అత్యంత వేగవంతమైన దాడి సామర్థ్యాలలో స్వావలంభన సాధించడం, అలాగే ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానం వాడే శత్రువులను ఎదుర్కోవడానికి బలమైన రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడం అని నిపుణులు చెబుతున్నారు. 2024 నవంబరులో డీఆర్‌డీవో తొలి హైపర్‌సోనిక్ మిసైల్ పరీక్షను నిర్వహించడం ఓ మైలురాయిగా అభివర్ణిస్తున్నారు. దేశీయ స్క్రామ్‌జెట్ ఇంజిన్ అభివృద్ధిలో ఇదో ఘన విజయంగా నిలిచింది. దీంతో స్క్రామ్‌జెట్ హైపర్‌సోనిక్ వ్యవస్థలను అభివృద్ధి చేసిన అమెరికా, రష్యా, చైనా సరసన భారత్ నిలిచింది. దీర్ఘశ్రేణి హైపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్ సామర్థ్యం ఉన్న శక్తిమంతమైన దేశాల్లో మనదేశం ఒకటిగా నిలిచింది. మాక్ 5 (ధ్వని కన్నా ఐదు రెట్లు వేగం) కన్నా ఎక్కువ వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉన్న ఆయుధాలను హైపర్‌సోనిక్‌గా పేర్కొంటారు. ప్రస్తుతానికి ఇలాంటి హైస్పీడ్ క్రూయిజ్ మిసైళ్లను అడ్డుకునే రక్షణ వ్యవస్థ ఏదీ ప్రపంచంలో లేదు. అలాంటి అత్యాధునిక 12 హైపర్‌సోనిక్ ఆయుధాలను ఆర్మీ, నేవీ, వాయుసేన కోసం డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తోంది. దీనిలో మొట్టమొదటగా ఎక్స్‌టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైల్(ఈటీ-ఎల్‌డీహెచ్‌సీఎం)ను ప్రాజెక్టు విష్ణులో భాగంగా రూపొందిస్తున్నారు. స్క్రామ్‌జెట్ ఇంజిన్‌తో మాక్ 8 స్పీడ్‌ను అందుకునేలా దీనికి రూపకల్పన చేశారు. 2,500 కిలోమీటర్ల వరకు ఉన్న పరిధిలోని లక్ష్యాలను ఇది ఛేదించగలదని చెబుతున్నారు. 2030 కల్లా దీనిని సాయుధ బలగాల అమ్ములపొదిలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక మరో ప్రధానమైన ఆయుధం హెచ్‌జీవీ. స్క్రామ్‌జెట్ ఇంజిన్‌తో రూపొందించిన ఈ మిసైల్‌ను నవంబరు 2024లో డీఆర్‌డీవో పరీక్షించింది. యుద్ధనౌకలపై దాడి చేసేందుకు రూపొందించిన ఈ మిసైల్ రేంజ్ 1,500 కిలోమీటర్లు. 2030 కల్లా దీనిని కూడా ప్రవేశపెట్టనున్నారు. ఇదే సమయంలో ప్రాజెక్టు కుశ కింద ప్రత్యేక హైపర్‌సోనిక్ రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి భారత్ కృషి చేస్తోంది. దాడి చేసే ఆయుధాలను రూపొందిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ఈ రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడానికి సంకల్పించారు. ఇక ఇండో-రష్యన్ బ్రహ్మోస్ క్రూయిజ్ మిసైల్‌కు హైపర్‌సోనిక్ వెర్షన్ బ్రహ్మోస్-2 అభివృద్ధిపై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. భూమిపై నుంచి 1500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలపైకి మాక్ 7 నుంచి 8 వేగంతో దూసుకుపోయేలా దీన్ని డిజైన్ చేశారు.

హైపర్‌సోనిక్ డ్రోన్లు కూడా..

యుద్ధ విమానాలు, నౌకల నుంచి కూడా ప్రయోగించే హైపర్‌సోనిక్ మిసైళ్లను డీఆర్‌డీవో అభివృద్ధి చేస్తోంది. జలాంతర్గాముల నుంచి ప్రయోగించే వర్షన్ కూడా ప్రతిపాదనలో ఉంది. అంతేకాకుండా హైపర్‌సోనిక్ డ్రోన్లు, డెకాయ్‌లు కూడా రూపొందిస్తోంది. 2030 కల్లా సమగ్ర హైపర్‌సోనిక్ మిసైల్ అభివృద్ధి కార్యక్రమాన్ని పూర్తి చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది.

సామాజిక సమానత్వంలో 4వ స్థానంలో భారత్!

'జీని ఇండెక్స్' నివేదికను ఉటంకిస్తూ కేంద్ర సామాజిక సంక్షేమ శాఖ ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 5: ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో నాలుగో అతిపెద్ద దేశంగా నిలిచిన భారత్.. అత్యంత సామాజిక సమానత్వం ఉన్న దేశాల్లోనూ నాలుగో స్థానంలో నిలిచింది. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలు సహా 167 దేశాల కంటే మెరుగైన స్థానం సంపాదించింది. ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన 'జీని ఇండెక్స్' నివేదికను ఉటంకిస్తూ కేంద్ర సామాజిక, సంక్షేమ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. పేదరికాన్ని తగ్గించే చర్యలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోనే ఈ సమానత్వం సాధ్యమైందని పేర్కొంది. మొత్తం 171 దేశాలతో కూడిన జీని ఇండెక్స్‌లో భారత్ 25.5 పాయింట్లతో స్లోవాక్ రిపబ్లిక్ (24.1), స్లొవేనియా(24.3), బెలారస్ (24.4) తర్వాత నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపింది. భారత స్కోరు 2011లో 28.8 పాయింట్లుగా ఉండగా.. 2022 నాటికి 25.5 పాయింట్లకు మెరుగుపడిందని వివరించింది (తక్కువ స్కోరు ఉంటే తక్కువ అసమానతలు). జీని ఇండెక్స్‌లో యూకే (32.4) చైనా (35.7), యూఎస్ఏ (41.8) మనకన్నా వెనుకబడ్డాయని పేర్కొంది. "భారత ఆర్థిక పురోగతి పౌరుల మధ్య సమానంగా ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. పేదరికం తగ్గింపు, విస్తృతంగా సంక్షేమ కార్యక్రమాల అమలు, జన్‌ధన్ యోజన, ఆధార్ వంటివాటితో నేరుగా సంక్షేమ పథకాల నగదు బదిలీ, ఆయుష్మాన్ భారత్‌తో వైద్య సదుపాయం వంటివి దీనికి కారణం. ప్రపంచ బ్యాంకు ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. దేశంలో 2011 నుంచి 2023 మధ్య 17.1 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. పేదరికం 16.2 శాతం నుంచి 2.3 శాతానికి తగ్గింది" అని సామాజిక సంక్షేమశాఖ ప్రకటనలో పేర్కొంది.

మళ్లీ ఏకమైన ఠాక్రే సోదరులు

- మరాఠీ విజయోత్సవ వేడుకల్లో వేదిక పంచుకున్న ఉద్ధవ్, రాజ్
- మహారాష్ట్రపై హిందీని రుద్దితే సహించబోమంటూ కేంద్రంపై తీవ్రస్వరం
- 'మహా' రాజకీయాల్లో ఆసక్తికర మలుపు



ముంబై, జూలై 5 : మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఠాక్రే సోదరులు (సోదరుల కుమారులు) ఉద్ధవ్, రాజ్ తొలిసారి ఒకే వేదికను పంచుకున్నారు. మరాఠీ భాష అస్థిత్వం కోసం ఐక్యమవుతామని, ముంబై, మహారాష్ట్రలను చేజిక్కించుకుంటామని ఇరువురు నేతలూ ప్రతినబూనారు. ప్రాథమిక పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేసిన త్రిభాషా సూత్ర విధానాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. ఈ సందర్భంగా శనివారం ముంబైలోని వర్లీలో శివసేన (ఉద్ధవ్ ఠాక్రే వర్గం), మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన 'ఆవాజ్ మరాఠీచా' పేరిట విజయోత్సవ సభ నిర్వహించాయి. కార్యకర్తలు, అభిమానులతో కిక్కిరిసిన సభలో ఈ పార్టీల తరపున ఉద్ధవ్, రాజ్ వేదిక పంచుకున్నారు. ఈ సందర్భంగా తమ కలయికపై వస్తున్న అనుమానాలను తొలగించేందుకు ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నించారు. "బృహత్ ముంబై కార్పొరేషన్ (బీఎమ్‌సీ) ఎన్నికల వరకైనా మేమిద్దరం కలిసి సాగుతామో లేదోనని అనేకమందికి అనుమానాలు ఉన్నాయి. మేమిక్కడ మరాఠీ కోసం ఉన్నాం. మరాఠీ కోసమే కలిసి ఉంటాం." అని తెలిపారు. మరో అడుగు ముందుకేస్తూ...ముంబై స్థానిక సంస్థల ఎన్నికలను, మహారాష్ట్రను కూడా మేం గెలుచుకుంటామని ఉద్ధవ్ ఠాక్రే ప్రకటించారు. బీఎమ్‌సీ ఎన్నికలు ఈ ఏడాది చివర్లో లేక వచ్చే ఏడాది మొదట్లో జరగొచ్చునని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యలు మహారాష్ట్ర రాజకీయాలు కీలక మలుపు తిరగనున్నాయనే సంకేతం అందించాయి. రాజ్ ఠాక్రే కూడా సుమారుగా అదే సూచనను తన ప్రసంగంలో చేశారు. "మా ఇద్దరిని బాలాసాహెబ్ కలపలేకపోయారు. కానీ, ఆ పని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ చేయగలిగారు" అని రాజ్ అనడంతో సభ నవ్వుల జల్లులతో నిండిపోయింది. 'కలిసి ఉండాలనుకుంటున్నాం కాబట్టే కలిశాం" అని వ్యాఖ్యానించారు. హిందీని రుద్దాలనే ప్రయత్నాన్ని ఎన్నటికీ సఫలం కానీయబోమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులపై రాజ్ ఠాకే తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. విచ్ఛిన్న రాజకీయాలు చేస్తూ, రాజకీయాలను వ్యాపారంగా మార్చివేశారంటూ ఆగ్రహించారు.

అదొక ఏడుపుగొట్టు సభ : ఫడణవీస్

ఠాక్రే సోదరులిద్దరు కలిసి.. విజయోత్సవ సభను కాకుండా, ఒక ఏడుపుగొట్టు సభను నిర్వహించారని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్ ఎద్దేవాచేశారు. బాలాసాహెబ్ కలపలేకపోయిన తామిద్దరిని దేవేంద్ర కలిపారన్న రాజ్ ఠాక్రే వ్యాఖ్యలపై స్పందిస్తూ... తనకు ఆ ఘనతను కట్టబెట్టినందుకు రాజ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. ప్రభుత్వాన్ని కూలదోసి తిరిగి పదవిలోకి ఎలా రావాలన్న యావ తప్పించి వారిద్దరి సభలో మరాఠీ గురించి ఒక్క మాట కూడా వినిపించలేదన్నారు.

సీయూఈటీ-యూజీ లోపభూయిష్టం?

పరీక్ష పత్రం సరళిపై ఆందోళనలు

న్యూఢిల్లీ, జూలై 5: దేశంలోని వివిధ కాలేజీలు, యూనివర్సిటీల్లో యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్ష (సీయూఈటీ-యూజీ) వ్యవస్థ లోపభూయిష్టంగా మారిందన్న విమర్శలొస్తున్నాయి. ఈ నెల 4న సీయూఈటీ-యూజీ ఫలితాలు విడుదలయ్యాయి. అయితే పరీక్ష పత్రం సరళి, మూల్యాంకనంలో తప్పులు, ఒక స్ట్రీమ్ నుంచి మరోదానిలోకి మారడంలో అడ్డంకులు, సహేతుకంగా లేని నార్మలైజేషన్ ప్రక్రియ తదితరాలపై విద్యార్థులు, నిపుణులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. స్కోరింగ్ విధానం, వ్యవస్థాగత వైఫల్యాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఎకనామిక్స్ (ఆనర్స్), బీఎంఎస్ వంటి కోర్సుల్లోకి మారాలని భావించే సైన్స్ విద్యార్థులను సీయూఈటీ-యూజీ 2025 స్వరూపం తీవ్ర ఒత్తిడికి గురిచేసింది. ప్రశ్నపత్రం సరళి సబ్జెక్టు మారడాన్ని కఠినతరంగా మార్చింది. తమ కోర్ సబ్జెకులు మినహా మిగిలిన వాటిలో రాణించాల్సి రావడం వారికి ఇబ్బందికరంగా పరిణమిస్తోంది. ఇక ఐదు సబ్జెక్టులే ఎంచుకోవాలన్న నిబంధన విద్యార్థులకున్న ఆప్షన్లను పరిమితం చేస్తోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ప్రస్తుత విధానంలో పరిమితులెన్నో...

- క్లిష్టత స్థాయితో సంబంధం లేకుండా ఒకే సంఖ్యలో ప్రశ్నలు ఇవ్వడం, పరీక్ష వ్యవధిని అందరికీ ఒకేలా వర్తింపజేయడం అన్యాయమనే వాదన ఉంది.
- విద్యార్థులకు వచ్చిన పర్సంటైల్‌ను కాకుండా మొత్తం మార్కులను పరిగణనలోకి తీసుకోవడం కూడా స్ట్రీమ్ మారాలని భావించే సైన్స్ విద్యార్థులకు ప్రతికూలంగా మారుతోంది.
- రాష్ట్ర బోర్డులు, ఈశాన్య రాష్ట్రాల విద్యార్థుల కంటే సీబీఎస్ఈ విద్యార్థులు ముందంజలో ఉంటారు. ఈ నేపథ్యంలో సమాన అవకాశాల కోసం 'ఒకే దేశం ఒకే సిలబస్'ను అమలు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.
- సీయూఈటీ-యూజీ పరీక్షను దాదాపు నెల రోజుల పాటు, వేర్వేరు షిఫ్టుల్లో నిర్వహిస్తున్న నేపథ్యంలో నార్మలైజేషన్ ప్రక్రియ అసంబద్ధంగా మారిందని, ఇది చాలావరకూ దుర్వినియోగమవుతోందని ఆరోపణలొస్తున్నాయి.

నాసిరకం హెల్మెట్లపై కేంద్రం సీరియస్

న్యూఢిల్లీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లను వినియోగించడం గణనీయంగా పెరిగినా.. నాణ్యమైన హెల్మెట్ల వినియోగం తక్కువే ఉంటోంది. ఈ నేపథ్యంలో వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నాసిరకం హెల్మెట్ల తయారీ, వినియోగంపై కఠినంగా వ్యవహరించాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాహనదారులు ఐఎస్ఐ మార్కు, బీఐఎస్ సర్టిఫికేషన్ ఉన్న హెల్మెట్లను మాత్రమే వినియోగించాలని, ఇందుకు తనిఖీలు నిర్వహించడంతోపాటు వినియోగదారులకు అవగాహన కల్పించాలని దేశంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, మేజిస్ట్రేట్లకు లేఖలు రాసినట్టు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. దేశంలో 21 కోట్లకుపైగా ద్విచక్ర వాహనాలున్నాయని, వాహనదారుల భద్రత అత్యంత ముఖ్యమని కేంద్రం తెలిపింది.

భారత సంతతి ప్రజలకు ఓసీఐ కార్డులు

- ఆరో తరం వరకు ఉదారంగా ఇస్తాం
- ట్రినిడాడ్, టుబాగో పర్యటనలో మోదీ
- ఐరాసలో భారత శాశ్వత సభ్యత్వానికి ఆ దేశం సంపూర్ణ మద్దతు


అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్‌తో మోదీ

పోర్ట్ ఆఫ్ స్పెయిన్, జూలై 5: ట్రినిడాడ్, టుబాగో దేశంలో నివసిస్తున్న భారత సంతతి ప్రజల్లో ఆరో తరం వారికి కూడా ప్రవాస భారతీయ పౌరసత్వ(ఓసీఐ) కార్డులు ఇవ్వనున్నట్లు ఆ దేశ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం ప్రకటించారు. ద్వీప దేశమైన ట్రినిడాడ్, టుబాగోలో 40 శాతం మంది భారత సంతతి వారే. అయితే వీరంతా బ్రిటీషు వారి పాలనా కాలంలో అక్కడికి వెళ్లారు. దీంతో ప్రస్తుతం వారి వద్ద ఎటువంటి భారతీయ గుర్తింపు కార్డులు లేవు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మోదీ ఈమేరకు ప్రకటించారు. కాగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత శాశ్వత సభ్యత్వానికి ట్రినిడాడ్, టుబాగో పూర్తి మద్దతు ప్రకటించింది. ఈమేరకు రెండు దేశాలు శనివారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ.. ట్రినిడాడ్, టుబాగో ప్రధాని కమ్లా పెర్సాద్ బిసెస్సర్ మధ్య జరిగిన చర్చల్లో రెండు దేశాల మధ్య ఆరు అంశాలపై ఒప్పందాలు జరిగాయి. రక్షణ, వ్యవసాయం, ఆరోగ్యం, డిజిటల్ సాంకేతికత, ఏకీకృత చెల్లింపుల వంటి వాటిలో సహకరించుకోవాలని నిర్ణయించారు. ఆ దేశ మహిళా క్రికెటర్లకు భారత్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు మోదీ ప్రకటించారు. 2027-28 సంవత్సరానికి ఐరాస భద్రతా మండలిలో ట్రినిడాడ్, టుబాగో సభ్యత్వానికి, 2028-29 సంవత్సరానికి భారత సభ్యత్వానికి మద్దతు ఇవ్వాలని ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా నివారించాల్సిందేనని ఇరు దేశాలు నిర్ణయించాయని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇండియా-కారికోమ్ భాగస్వామ్యం మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. కారిబ్బియన్ ప్రాంతంలోని 15 సభ్య దేశాలతో కూడినదే కారికోమ్. మోదీ తన పర్యటనలో ద్వీప దేశ అధ్యక్షురాలు క్రిస్టిన్ కార్లా కాంగలూను కూడా కలుసుకొన్నారు. కాగా మోదీ తన ఐదు దేశాల పర్యటనలో భాగంగా శుక్రవారం(స్థానిక కాలమానం ప్రకారం) అర్జెంటీనా చేరుకున్నారు. రెండు రోజుల పాటు ఆ దేశంలో పర్యటించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376, RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.